
ఆంధ్రప్రదేశ్

సెప్టెంబరు 1970

తెలంగాణాకు వరప్రసాదం

పోచంపాడు ప్రాజెక్టు

50 పైసలు



ఆంధ్రప్రదేశ్

సంపుటి : 14　　సెప్టెంబరు 1970　　సంచిక : 11

భాద్రపదం – ఆశ్వయుజం, 1892 శా.శ.

ప్రధాన సంపాదకులు : పెండ్యాల వామనరావు

ఈ సంచికలో...

రెండవ అట్ట : పోచంపాడు ప్రాజెక్టు

మూడవ అట్ట : పాలకొల్లులోని ఆలయ గోపురం

చివరి అట్ట : హైదరాబాద్‌లోని రవీంద్రభారతి భవనం

వెల : 50 పైసలు

సాలు చందా 6 రూపాయలు

రిజిస్టర్డ్ నెం. 135

ఈ సంచికలో
రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు
తప్పనిసరిగా
ప్రభుత్వానికి సంబంధించినవిగా భావించనక్కరలేదు.

17–1

మరో అడుగు ముందుకు

మరొక స్వాతంత్ర్యదినం గడచిపోయింది. స్వాతంత్ర్యానంతరం యిరవైమూడేండ్లు గడిచి యిరవైనాలుగో సంవత్సరంలో ప్రవేశించాం. వేగంగా ప్రగతి సాధించే కృషిలో ఆంధ్రప్రదేశ్ గతసంవత్సరం మరికొన్ని ఘన విజయాలు సాధించింది. ప్రశాంత పరిస్థితులు నెలకొనివున్నందుననే యిది సాధ్యమైంది. కొన్ని రాష్ట్రాలలో, దురదృష్టవశాత్తు అప్రతిష్ఠాకరంగా జరిగిన మతకలహాల సంఘటనల వంటివి మన రాష్ట్రంలో లేక పోవడం సంతృప్తి కలిగించే విషయం. భాషలవారీగానూ, మతాలవారీగాను రాష్ట్రంలోవున్న వివిధ వర్గాల ప్రజలు సఖ్యతతో మెలగుతూ వుండడం అనే సంప్రదాయం మన రాష్ట్ర ప్రజాజీవితంలో అంతరర్భితంగా వున్నది ఇటీవల మన గవర్నరు శ్రీ ఖండూభాయ్ దేశాయ్ చెప్పినట్లు మనది "సార్వజనీన" రాష్ట్రం.

నక్సలైట్ల కార్యకలాపాలను అదుపులోకి తేవడంలో ప్రభుత్వం విజయం సాధించింది నక్సలైట్ ముఖ్య నాయకులు కొందరు మరణించడమో, అరెస్టుకావడమో జరిగిన ఫలితం. శ్రీకాకుళం జిల్లాలో కొండజాతిప్రజలు నివసించే ప్రాంతంలో యిప్పుడు ప్రశాంతపరిస్థితి ఏర్పడింగా పోలీసు చర్యలవల్లనేమి, వెనుకబడిన కొండజాతి ప్రజల జీవన పరిస్థితులు మెరుగు పరిది ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకున్న సంక్షేమ చర్యలవల్లనేమి అక్కడి ప్రజల్లో మళ్ళీ ఆత్మ విశ్వాసచే ఏర్పడింది.

గడచినసంవత్సరంలో మూడు అత్యంత ప్రధానమైన సంఘటనలు జరిగాయి. అనుకున్నదానికంటే ముందుగా పోచంపాడు ప్రాజెక్టుక్రింద 40వేల యకరాలకు నీరు వదలడం, గోదావరి బ్యారేజి పని ప్రారంభంకావడం, శ్రీకాకుళంజిల్లాలోని వంశధారప్రాజెక్టు ప్రారంభోత్సవమూ జరిగాయి. మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలపరిచే మరి రెండు ముఖ్యసంఘటనలు కూడా జరుగబోతున్నవి. వాటిలో ఒకటి విశాఖపట్టణంలో ఉక్కుకర్మాగారం స్థాపన, రెండవది, తెలంగాణా ప్రాంతంలోని రామగుండంలో ఎరువులఫ్యాక్టరీ స్థాపన. ఈ రెండింటివల్ల రాష్ట్రంలో ఉద్యోగ వసతి సౌకర్యాలు బాగావృద్ధిచెందే అవకాశాలు వున్నాయి.

ఇచ్ఛాపురంనుండి కాకినాడ వరకూ విస్తరించివున్న కొండజాతి ప్రాంతానికి ఉపయోగకరంగా విశాఖపట్టణంలో 100 కిలోవాట్ల ట్రాన్స్మిటర్ స్థాపించడానికి భారత ప్రభుత్వ అంగీకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం సాధించగలగడం విశేషం.

మన రాష్ట్రంలో 20 లక్షల ఎకరాలకుపైగా ప్రభుత్వబంజర్లు, భూమిలేని పేదవారికి పంచడం జరిగింది. మరేయితర రాష్ట్రంలోనూ యింత ఎక్కువగా బంజర్లపంపిణీ జరుగలేదు. దీనికితోడు రైతులకు పరపతి సౌకర్యాలు విస్తృత పరచే కార్యక్రమాలవల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజల్లో ధైర్యోత్సాహాలు కలుగుతున్నాయి. నాగార్జున సాగర్ ప్రాజెక్టుక్రింద క్రమంగా ఫలితాలు కూడా రావడంతో వ్యవసాయోత్పత్తి బాగా పెరుగుతుంది. దీనివల్ల అనేకంగా వ్యావసాయిక పరిశ్రమలు కొత్తగా ప్రారంభమయ్యే అవకాశాలు కలుగుతాయి.

యాత్రాసౌకర్యాల అభివృద్ధి రంగంలో కూడా మనరాష్ట్రం ముందంజవేస్తూ వున్నది. ఆంధ్రప్రదేశ్‌లో జరిగే యాత్రా విషయాల అభివృద్ధి కార్యక్రమాల్లో భారత ప్రభుత్వం కూడా రానురాను ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నది. భారత యాత్రిక అభివృద్ధి కార్పొరేషన్ వారు ఇటీవల హైదరాబాదులో తమ రవాణా–ప్రయాణ విభాగాన్ని ఏర్పాటుచేశారు. దీనికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఈ విభాగం హైదరాబాదులో స్థాపించడం భారత ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధకు నిదర్శనం.

— పి. వి. ఆర్.



సమైక్యత పునాదిగా

1953 అక్టోబరు మొదటి తేదీన భాషా ప్రాతిపదికపైన ఆంధ్ర రాష్ట్రం నిర్మాణం జరగడం భారత దేశ చరిత్రలో ఒక గణనీయమైన ఘట్టం. భాషను ముఖ్య ప్రాతిపదికగా తీసుకొని రాష్ట్రాలను పునర్వ్యవస్థీకరించే కార్యక్రమానికి అప్పుడు నాంది జరిగింది. 1956 నవంబరు మొదటి తేదీన, హైదరాబాదు రాజధానిగా ఏర్పడిన విస్తృత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి స్వర్గీయ జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభోత్సవం చేయడంతో, సమైక్య ఆంధ్ర రాష్ట్రం ఏర్పడాలన్న నాలుగు కోట్ల తెలుగు ప్రజల అయిదు శతాబ్దాలనాటి కల ఫలించింది. మధ్యన 150 సంవత్సరాల పాటు తప్ప తెలుగు ప్రజలు ఎప్పుడూ కూడా ఒకే ఒక రాజకీయాధికారం క్రింద వుంటూ వచ్చారు. కాబట్టి సమైక్య ఆంధ్రప్రదేశ్ అవతరణతో పూర్వపు పరిస్థితి పునరుద్ధరించబడింది.

అక్షర క్రమంలో భారతదేశంలోని రాష్ట్రాలలో అగ్రస్థానం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ యింకా అనేక యితర విషయాలలో కూడా అగ్రగామిగా వుంది. ఇది మన దేశంలోని పెద్ద రాష్ట్రాలలో అయిదవది. జనాభానుబట్టి మన రాష్ట్రాలలో నాలుగవ స్థానాన్ని ఆక్రమిస్తుంది. ప్రసిద్ధమైన గోదావరి, కృష్ణా నదులు ఈ రాష్ట్రంగుండా ప్రవహిస్తున్నాయి. ఖనిజ సంపద యిచ్చట పుష్కలంగా వుంది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడి 14 సంవత్సరాలు గడిచాయి. వ్యవసాయ ప్రధానమైన ఈ రాష్ట్రం పారిశ్రామిక రంగంలో కూడా ప్రగతి సాధించడానికి కృషి చేస్తున్నది. హైదరాబాదు నగరంలోనూ, ఆ పరిసర ప్రదేశాలలోనూ, విశాఖపట్నం, రామగుండం, క్రొత్తగూడెంలలోనూ కొత్త కొత్త పరిశ్రమలు ఆవిర్భవిస్తున్నాయి. రాష్ట్రానికి ఉజ్వలమైన భవిష్యత్తు వుంది.

ఆంధ్రప్రదేశ్‌లో అంతర్భాగంగా — రాష్ట్ర రాజధాని అయిన హైదరాబాదుతోసహా — తెలంగాణా ప్రాంతం అన్ని రంగాలలోనూ గణనీయమైన అభివృద్ధిని సాధించిందన్న విషయాన్ని ఎంతటి విమర్శకుడు కూడా కాదనలేడు. నాలుగు కోట్ల మంది తెలుగు ప్రజల భాష, ఆకాంక్షలు, గమ్యం ఒక్కటే. వీరు సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో కలిసి వుండడానికి యిదే కారణం. విదేశ పాలనలో వీరు వేరు చేయబడినారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలలో అపూర్వమైన విధంగా విభజించబడివున్న ప్రకృతి వనరులను సంపూర్ణంగా వినియోగించుకోవడానికి సమైక్య ఆంధ్రప్రదేశ్ వర్ధిల్లడం అవసరం.

భౌగోళికంగానూ, సాంస్కృతికంగానూ ఆంధ్రప్రదేశ్ ఉత్తర, దక్షిణ ప్రాంతాలకు సంగమ స్థానం. ఇది మిశ్రమ సంస్కృతితో కూడిన విలక్షణమైన స్వరూపాన్ని, కాస్మాపాలిటన్ దృక్పథాన్ని కనబరుస్తుంది. హిందీ విషయంలో నైతేనేమి, సంక్షేమ చర్యల విషయంలో నైతేనేమి రాష్ట్రం ప్రదర్శిస్తున్న వైఖరి ఎంతో పరిణతి జెందినట్టిది. ఈ వైఖరి విజ్ఞత, అభివృద్ధి మార్గాలపట్ల ఆసక్తి కలిగిన రాజనీతిజ్ఞత, వ్యవహార దక్షతలచే తీర్చిదిద్దబడినట్టిది. 1967 సార్వత్రిక ఎన్నికల తర్వాత రాజకీయ పరిణామాలు అనిశ్చితంగా వున్నప్పుడు సుస్థిరమైన, పటిష్ఠమైన పరిపాలనా వ్యవస్థను కలిగివున్న కొన్ని రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ఈ ఘనత ప్రస్తుత ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డికి దక్కుతుంది. శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి 1964వ సంవత్సరం నుంచి మాత్రమే రాష్ట్ర వ్యవహారాలలో ప్రధాన పాత్ర వహిస్తున్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటి నుంచి మంత్రిగానూ, పార్టీ ముఖ్యుడుగానూ ఆయన కీలకపాత్ర వహించారు. కొన్నివేల సంవత్సరాల ఇతిహాసం కలిగి ఉపఖండమంతటి విశాలమైన దేశచరిత్రలో, ఏ ఆందోళనలు, అలజడులనైనా — వాటి స్వభావం ఎటువంటిదైనప్పటికీ — క్షణికమైనవిగా మాత్రమే పరిగణించవలసి వుంటుంది. రాజకీయమైన, ప్రాంతీయమైన, మత సంబంధమైన ఒత్తిడుల వల్ల జనించిన ఉద్రిక్తతలు, విద్వేషాలవల్ల సువిశాలమైన, సుస్థిరమైన, సుభిక్షమైన రాష్ట్రం యొక్క ఐక్యతకూ, పురోభివృద్ధికీ విజ్ఞులైన ప్రజలు భంగం వాటిల్లనివ్వరు.

సముజ్వల భవిష్యత్తు

శ్రీ బ్రహ్మానందరెడ్డి, తాను స్వయంగా పేర్కొన్నట్లు, భాషా ప్రయుక్త రాష్ట్రాల వ్యవస్థ భారాన్ని వహిస్తున్నారు. ఎందుచేతనంటే ఆంధ్రప్రదేశ్ (ఇది భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణంతో సహా అనేక రంగాలలో మార్గదర్శకంగా వున్నది) భవిష్యత్తుమీద యితర రాష్ట్రాల భవిష్యత్తు ఆధారపడివుంది. పెనుగాలుల తాకిడిని నిర్భయంగా నిబ్బరంగా ఎదుర్కొని కొండ వలె నిలిచిన ధీశాలిగా ఆయన చరిత్రలో కీర్తించబడతారు. ఆంధ్రకు మొదటి నుంచీ ప్రజ్ఞాశాలురు ముఖ్యమంత్రులుగా వున్నారు. ఆంధ్ర కేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి. ఉత్తేజకరమైన ఆయన సారథ్యం రాష్ట్రానికి శుభ ప్రారంభాన్ని కలుగజేసింది. తరువాత కొద్దికాలంపాటు శ్రీ బెజవాడ గోపాలరెడ్డి నాయకత్వం వహించారు. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా శ్రీ నీలం సంజీవరెడ్డి (1953 నుంచి 1956 వరకు ఉప ముఖ్యమంత్రిగా వున్నారు) పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి వివిధ రంగాలలో అభివృద్ధినీ, ఏకీకరణనూ సాధించే కార్యక్రమం ప్రారంభమైంది. మధ్యలో రెండు సంవత్సరాల పాటు శ్రీ దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రిగా వున్న తరువాత శ్రీ సంజీవరెడ్డి తిరిగి రాష్ట్ర ప్రభుత్వాధినేతగా వచ్చారు. 1964 వరకు ఆయన ఆ పదవిలో వున్నారు. అప్పుడు ప్రస్తుతపు ముఖ్యమంత్రి అధికారాన్ని స్వీకరించారు. శ్రీ బ్రహ్మానందరెడ్డి యోగ్యుడైన వారసుడుగా వచ్చారు. ఒక వ్యాఖ్యాత పేర్కొన్నట్లు తెలంగాణాకు లభించవలసిన దానిని లభింపజేసి గత 14 సంవత్సరాలుగా "పేరుకొని పోయిన పాపాల"ను ప్రక్షాళనం చేయడానికి క్రమపద్ధతిలో కృషిచేసిన తొలి ముఖ్యమంత్రి బహుశః శ్రీ బ్రహ్మానందరెడ్డి.

శ్రీ బ్రహ్మానందరెడ్డి మంత్రి మండలిపై వచ్చిన అవిశ్వాస తీర్మానం ఇటీవల అత్యధిక మెజారిటీతో ఓడించబడడం శ్రీ జగ్జీవన్‌రామ్ పేర్కొన్నట్లు శ్రీ బ్రహ్మానందరెడ్డికి శాసన సభలో గల "పూర్తి ప్రాబల్యాన్ని" మరోమారు అసందిగ్ధంగా నిరూపిస్తున్నది. తెలంగాణా ప్రాంతంలో జరిగిన అభివృద్ధి అంతా 1964 వ సంవత్సరంలో తాను ముఖ్యమంత్రి అయిన తరువాతనే జరిగినదన్న విషయాన్ని శ్రీ బ్రహ్మానందరెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణా ప్రాంతంలో 1948-56 సంవత్సరాల మధ్య పరిశ్రమలలో ఎంతమాత్రం పెట్టుబడి పెట్టలేదనీ, అంతేకాక నిజాం హయాములో ప్రారంభించిన పరిశ్రమలను సైతం ప్రైవేటు పారిశ్రామికులకు అప్పగించారనీ శ్రీ బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆ కాలంలో అధికారంలో వుండి, యిప్పుడు తెలంగాణా అభివృద్ధిని మాట్లాడుతున్నవారు ఈ విషయంలో ఏమీచేయలేదు.

గడచిన కొన్ని సంవత్సరాల కాలంలో తెలంగాణా ప్రాంతంలో రూ. 100 కోట్లను ప్రభుత్వ రంగంలోనూ, రూ. 70 కోట్లను ప్రైవేటు రంగంలోనూ వెచ్చించారు. తత్ఫలితంగా 80,000 మంది స్థానిక ప్రజలకు ఉద్యోగావకాశాలు లభించాయి. ఇది "గణనీయమైన అభివృద్ధి". పది వేలు మొదలు పన్నెండు వేల మందికి ఉపాధులు కల్పించే రామగుండం ఎరువుల కర్మాగారం (దీని పెట్టుబడి రూ. 75 కోట్లు) హైద్రాబాదులోని హిందుస్థాన్ కేబుల్ సంస్థ (తెలంగాణా ప్రాంతంలో నెలకొల్పబడుతున్న పరిశ్రమలలో యివి కొన్ని మాత్రమే). విశాఖ పట్నంలోని రూ. 35 కోట్ల ఔటర్ హార్బర్, తుత్తునాగం యంత్రాగారం మొదలైనవి తమ కృషి ఫలితంగానే ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పబడినట్లు శ్రీ బ్రహ్మానంద రెడ్డి అన్నారు. విశాఖపట్నంలో ఉక్కు కర్మాగారాన్ని స్థాపించడానికి నిశ్చయించడం ఆయన కృషి ఫలితమే. నాగార్జున సాగర్‌కు అదనంగా రూ. 35 కోట్ల సహాయాన్ని పొందడం; పోచంపాడు ప్రాజెక్టు నిర్మాణాన్ని సాగించడం, రాజమండ్రివద్ద గోదావరి నదిపై రోడ్డు-రైలు వంతెన నిర్మించడం, సికిందరాబాదు కార్య స్థానంగా దక్షిణ-మధ్య రైల్వే మండలాన్ని ఏర్పాటు చేయడం, విశాఖ పట్నంలో డ్రైడాక్, భారత్ హెవీ వెసల్స్, ప్లేట్స్ యంత్రాగారాల్ని నెలకొల్పడం, రాయలసీమ అభివృద్ధి మండలిని స్థాపించడం—ఇవన్నీ ఆయన సాధించిన విజయపరంపరలే.

ప్రారంభంనుంచి 1969 అక్టోబరువరకు 14.6 లక్షల ఎకరాల బంజరు భూములను పంపిణీ చేశారు. అప్పటినుండి "ముమ్మర" కార్యక్రమం క్రింద 3.81 లక్షల ఎకరాలను పంచి పెట్టారు. ఇంతేగాక అనర్హులైన సివాయి జమాదార్ల ఆక్రమణలో వున్న 24,000 ఎకరాల భూమిని భూవసతిలేని బీద ప్రజలకు పంచిపెట్టారు. గిరిజనుల పరిస్థితిని మెరుగు పరచడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకున్నది. ముత్తాదారీ విధానాన్ని రద్దుపరచడం, గిరిజనుల భూములను గిరిజనేతరులకు బదిలీ చేయడాన్ని నిషేధించడం, ఋణ సహాయం చేయడం మొదలైనవి ఈ ప్రత్యేక చర్యలలో కొన్ని. ఇచ్ఛాపురంనుంచి కాకినాడవరకు గల గిరిజన ప్రాంతాలకొరకు వైజాగ్‌లోకానీ, శ్రీకాకుళంలోకానీ 100 కిలోవాట్ల రేడియో కేంద్రాన్ని నెలకొల్పడం అవసరం. దీనిని మంజూరు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నది. 1970 ఏప్రిల్‌లో ముఖ్యమంత్రి, వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాలో వంశధార నదిపై ఒక ప్రాజెక్టుకు పునాది రాయి వేయడం, గోదావరి మీద నిర్మించే సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజికి శంకుస్థాపన చేయడం, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి తోడ్పడే ప్రధాన సంఘటనలు. వంద సంవత్సరాల క్రితం గోదావరి నదిమీద ఆనకట్ట నిర్మించి డెల్టా ప్రాంతాన్ని సశ్యశ్యామలం చేసిన సర్ ఆర్థర్ కాటన్ పేరును ఈ కొత్త బ్యారేజికి పెట్టుకొని ఆంధ్రప్రజలు ఆ మహా వ్యక్తిపట్ల తమకుగల గౌరవాన్ని చాటుకున్నారు.

ఈనాడు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ప్రగతిని పుంజుకుంటున్న దశలో వుంది. దీనికి ఎట్టి అంతరాయం ఏర్పడినా రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకూ హాని కలుగుతుంది. ఈ ప్రాంతాల అభివృద్ధికేకాక మొత్తంమీద దేశం అభివృద్ధికికూడా దెబ్బ తగులుతుంది.

పోచంపాడు ప్రాజెక్టు-తెలంగాణాకు వరప్రసాదం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి 1970 జూలై 24వ తేదీ ఉదయం 9-30 గంటలకు పోచంపాడు ప్రాజెక్టు జలాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి సేద్యపు నీటి విషయాల మంత్రి శ్రీ. శీలం సిద్దారెడ్డి అధ్యక్షత వహించారు. వర్తమాన సంవత్సరంలో 40,000 ఎకరాలకు సేద్యపు నీటిని అందజేయాలని తొలి దశగా యీ జలాలను విడుదల చేయడం జరిగింది.

గోదావరి నదిమీద రూ. 90 కోట్ల ఖర్చుతో నిర్మిస్తున్న పోచంపాడు ప్రాజెక్టు, వెనకబడిన తనంతో, దారిద్ర్యంతో బాధ పడుతున్న నిజామాబాదు, కరీంనగర్ జిల్లాలలో 5.7 లక్షల ఎకరాలకు సేద్యపు నీటిని అందించే విధంగా రూపొందించబడింది. ఈ ప్రాజెక్టు పూర్తయినప్పుడు రూ. 73.60 కోట్లు విలువచేసే 10.96 లక్షల టన్నుల ఆహారధాన్యాలను ఉత్పత్తి చేయవచ్చు. ఈ అధికోత్పత్తివల్ల ఒక్క తెలంగాణా ప్రాంతానికేగాక, ఆహారధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించే కృషిలో విమగ్నమైవున్న యావద్భారత దేశానికి ఎంతో లాభం చేకూరుతుంది. ఈ పోచంపాడు ప్రాజెక్టుకు 1963 జూలై 26న ఆనాటి ప్రధానమంత్రి శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారు. అదే ఆయన ఆఖరి సారిగా ఆంధ్రప్రదేశ్‌కు రావడం. ఆయన శంకుస్థాపన చేసిన శిలాఫలకం మీద యీ విధంగా వ్రాసివుంది.

"ప్రజాసేవా నిలయం—ఆధునిక దేవాలయం"

ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఆనకట్టలైన నాగార్జునసాగర్, శ్రీశైలం, పోచంపాడు ఆనకట్టలకు ఆయన శంకుస్థాపన చేయడంలోనే, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయానికి నెహ్రూ చూపిన విశేష శ్రద్ధాసక్తులు వెల్లడవుతున్నాయి.

పోచంపాడు ప్రాజెక్టు ప్రధానంగా సేద్యపు నీటి ప్రాజెక్టు. అయితే ముందు ముందు ఒక విద్యుదుత్పాదక కేంద్రాన్ని నెలకొల్ప డానికి వీలుగా ఇది నిర్మించబడుతున్నది

1. నిజామాబాదు జిల్లాలో పోచంపాడు అనే గ్రామంవద్ద గోదావరి నది మీద 140 అడుగుల ఎత్తుగల ఆనకట్టను నిర్మించడం.
2. 66 వే. కో. ఘ. అ. ల నీటిని వినియోగించుకొనే విధముగా దక్షిణ భాగంలో 123 మైళ్ళ కుడి కాలువను ఒక దానిని నిర్మించడం.
3. నిజామాబాదు, కరీంనగర్ జిల్లాల్లో 5.7 లక్షల ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం లభించే విధంగా ఈ ప్రాజెక్టును రూపొందించడం.

— ఇవి ఈ ప్రాజెక్టులోని ముఖ్యాంశాలు.

ఇతర ప్రాజెక్టులకులేని సౌకర్యం ఒకటి ఈ ప్రాజెక్టుకు వుంది. ఈ ప్రాజెక్టు మీద సాధ్యమైనంత తక్కువ ఖర్చుచేసి చాలా త్వరలోనే యీ ప్రాజెక్టు జలాలను వినియోగంలోకి తీసుకు రావచ్చు. ఆనకట్టమీదచేసే మొత్తం ఖర్చు రూ. 29.5 కోట్లలోనూ రూ. 12 కోట్లు ఖర్చుచేస్తే 1970 నాటికి 40,000 ఎకరాలకు సేద్యపునీటిని అందించవచ్చు. పైగా ఆనకట్ట ఎత్తును పెంచే కొద్దీ కాలువల పొడవును పెంచి మరింత ఎక్కువ నేలకు సేద్యపు నీటిని అందించవచ్చు. ఈ ప్రాజెక్టుకు రూ. 90.25 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు.

మొదట రూపొందించిన పథకం

తెలంగాణాలోని వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధిపరచే నిమిత్తం, వెనుకటి హైదరాబాదు ప్రభుత్వం ఒక పెద్ద పథకాన్ని రూపొందించింది. దీని ప్రకారం కవలగుడావద్ద గోదావరినది మీద ఒక రిజర్వాయరును, కుష్టాపురంవద్ద మరొక ఆనకట్టను 20 లక్షల ఎకరాలకు సేద్యపునీటిని అందించే నిమిత్తం నిర్మించాలని భావించారు. అయితే కుష్టాపురం, కవలగుడాలవద్ద రెండు ఆనకట్టల్ని

ప్రతించే బదులు పోచంపాడువద్ద ఒక ఆనకట్టను నిర్మించాలని 1955–56లో ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు చేయడం జరిగింది. 6.2 లక్షల ఎకరాలకు సేద్యపునీరు అందజేసే విధంగా దీన్ని రూపొందించారు. అయితే మళ్ళీ 1958–59లో రూ. 117.35 కోట్ల ఖర్చుతో 20.45 లక్షల ఎకరాలకు సేద్యపు నీటిని అందజేసే విధంగా ఈ పథకాన్ని సవరించారు. పోచంపాడువద్ద 257 శ.కో. ఘ. అడుగుల నీరు లభిస్తుందన్న ఉద్దేశంతో తదనుగుణంగా యీ కొత్త పథకాన్ని రూపొందించారు. అయితే మహారాష్ట్ర ప్రభుత్వం గోదావరి జలాల వినియోగం విషయంలో తన వాటా గురించి వాదించడంవల్ల పోచంపాడువద్ద 66 శ.కో.ఘ. అడుగుల నీరు మాత్రమే లభ్యమయ్యేట్టు తేలింది. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం 1959లో మధ్యతరహా పథకాన్నొక దానిని కేంద్రానికి సమర్పించింది. పోచంపాడు ఆనకట్టవద్ద లభ్యమయ్యే అధిక జలాలను వినియోగించుకోడానికి వీలుగా ముందు ముందు దీన్ని మార్చుకొనే రీతిలో యీ పథకాన్ని రూపొందించడం జరిగింది. అవసరమైతే నీటి నిలువ పరిమాణాన్ని ముందు ముందు పెంచుకోడానికి వీలుగా ప్రస్తుతం 66 శ.కో.ఘ. అడుగుల నీటిని వినియోగించుకొంటూ ఒక స్టోరేజి ప్రాజెక్టుగా దీన్ని నిర్మించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. ఈ ఆనకట్టకు జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపనచేస్తూ ఒక దివ్యసందేశాన్ని యిచ్చారు. నిత్యం గుర్తుంచుకోవలసిన విషయం అది. భారత ప్రజలకు అదొక మార్గదర్శక జ్యోతి.

"చేసినపనిని గురించి మనం ఎక్కువగా ఆలోచించవద్దు. చెయ్యకుండా వుంచేసిన పనిని గురించే గట్టిగా ఆలోచిద్దాం. మన దేశంలో అపారంగా వున్న వనరులను గురించి కూడా ఆలోచిద్దాం. ఈ వనరులను సమీకరించి ప్రజాశ్రేయస్సుకు వినియోగించుకుంటే భారత దేశస్వరూపమే మారిపోగలదు దేశం సంపదలతో తులతూగగలదు. ఈ మహత్తర కార్యాన్ని నెరవేర్చడానికై మన లోని శక్తినంతా కేంద్రీకరించి కృషి చేద్దాం." అన్నారు నెహ్రూజీ.

ఆనకట్టు

దీనిఎత్తు 140 అడుగులు. పొడవు 47,900 అడుగులు. ఇందులో 3,141.5 అడుగుల భాగం నదీ ప్రవాహ మధ్యంలో రాతితో కట్టబడివుంది. మిగిలిన భాగం మట్టితో వుంది. రాతితో కట్టబడిన స్పిల్వే 2,510 అడుగుల పొడువు వుంది. ఇందులో నుంచి 16 లక్షల క్యూసెక్‌ల జలం ప్రవహించడానికి వీలుంది. విద్యుచ్ఛక్తి ఉత్పాదనకు కూడా ఇక్కడ ఏర్పాట్లువున్నాయి. పవర్‌డాంలో రెండు బ్లాకులున్నాయి. ఒక్కొక్కటి 95 అడుగుల పొడవువుంది. పవర్‌హౌస్ నిర్మాణం, తరువాత జరుగుతుంది. దీనిశక్తి 36 మి. వాట్లు.

ప్రధాన దక్షిణ కాలవ

డాము కుడివైపు నుంచి వున్న ప్రధాన దక్షిణ కాలవ పొడవు 123 మైళ్లు. ఇందులో నుంచి 8,600 క్యూసెక్కుల గరిష్ఠ నీరు ప్రవహిస్తుంది. ఈ కాలువ అనేక లోయలు, సానువుల గుండా పోతుంది. 54 వ మైలువద్ద ఈ కాలువ జ[illegible]పురం కొండలలో సుమారు ఒకఫర్లాంగు పొడవున త్రవ్వబడిన సొరంగం గుండా వెడుతుంది. అక్కడి నుంచి 16 మైళ్లు పోయినతరువాత ఈ కాలవ గోదావరి ఉపనది అయిన మానేరు గుండా వెడుతుంది. ఆయకట్టును ఎక్కువ చేయడానికి, మానేరు పైన ఒక డామును నిర్మించి కాలవను ఇంకా పొడిగించాలని నిర్ణయించబడింది. మానేరు దాటిన తరువాత ఈకాలవ పొడవు 35 మైళ్లు వుంటుంది. ఈకాలవ క్రింద వర్తమాన సంవత్సరానికి 40,000 ఎకరాలకు నీరు విడుదల చేయాలని ప్రతిపాదించబడింది.

పునరావాసం

డాము యొక్క జలవిస్తరణ ప్రాంతం 175.9 చ. మై. వుంది. దీనివల్ల 82 గ్రామాలు నీటిలో మునిగిపోయాయి. 38 గ్రామాలు పూర్తిగా జలగర్భంలో కలిసిపోయినాయి. 8 గ్రామాలు కొంతవరకు మాత్రమే మునిగిపోయినాయి. మానేరు రిజర్వాయరు ఫలితంగా అదనంగా 6 గ్రామాలు 3 కుగ్రామాలు దెబ్బతిన్నాయి. పోచంపాడు ప్రాజెక్టువల్ల సుమారు 65,000 మంది ప్రజలు, మానేరు రిజర్వాయరు క్రింద 10,500 మంది ప్రజలు నిర్వాసులవుతారు. వీరికి పునరావాసం కల్పించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం వహించింది. ఇందుకొరకు అనేక పునరావాస కేంద్రాలు స్థాపించబడుతున్నాయి. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రాంతాలలో కాక వేరేస్థలాల్లో స్థిరపడి పోదలచుకొన్న ప్రజలకు ప్రభుత్వం అదనంగా నగదుగ్రాంట్లు మంజూరు చేస్తున్నది.

ఆయకట్టు అభివృద్ధి

ఈ ప్రాజెక్టు క్రింద భూమిని అభివృద్ధి పరిచేందుకు ఆంధ్ర ప్రదేశ్ సహకార కేంద్ర భూమి తనఖా బ్యాంకు దీర్ఘకాలిక ఋణ సౌకర్యాలు కల్పించేందుకై ఒక పథకం రూపొందిస్తున్నది.

అదనపు ఆహారోత్పత్తి

పోచంపాడు ప్రాజెక్టులో మామూలుగా రూ. 10 కోట్లు విలువచేసే 1.36 లక్షల టన్నుల ఆహారధాన్యాలు పండుతాయి. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయిన తరువాత ఆహారోత్పత్తి రూ. 73.6 కోట్లు విలువచేసే 10.96 లక్షల టన్నుల వరకు పెరుగుతుందని అంచనా వేయబడింది. దీనివల్ల ప్రజల శ్రేయస్సు బాగుపడుతుంది. పారిశ్రామికంగా కూడా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. ఇక్కడి పారిశ్రామిక అవకాశాలు పరిశీలించబడినాయి. ఒక్కొక్కటి ఒకటన్ను శక్తిగల 58 బియ్యం మిల్లులు, 22 నూనె మిల్లులు స్థాపించడం అవసరమవుతుందని అంచనా వేయబడింది.

ఇన్ని అవకాశాలున్న కారణాన, పోచంపాడు ప్రాజెక్టుపై పెట్టిన ఖర్చులో సాలీనా 19½ శాతం ఆదాయం వుంటుందని ఆశింప బడుతున్నది. పెట్టుబడి దృష్ట్యా ఇది చాలా లాభసాటియైనది. ★

పరిపాలనా విషయాలు

ధరల కంట్రోలు

అత్యవసర వస్తువుల ధరలను అదుపులో వుంచే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ధరల అదుపు సంస్థను ఒక దానిని ఏర్పాటు చేసింది. దీనికి సహకార సంఘాల రిజిష్ట్రారు అధ్యక్షులు. సివిల్ సరఫరాశాఖ డైరెక్టరు, ఆర్థిక గణాంకశాఖ డైరెక్టరు, విజిలెన్సు శాఖ పోలీసు సూపరింటెండెంటు, మార్కెటింగు శాఖ డైరెక్టరు సభ్యులుగా వుంటారు. ఈ సంఘం, ధరల ధోరణిని రెండునెలలకు ఒక సారి సమీక్ష చేసి అత్యవసరవస్తువుల ధరలను అదుపులో పెట్టడానికి ప్రభుత్వానికి మార్గాలను సూచిస్తుంది.

మార్కెటులో కృత్రిమంగా ధరలు పెరిగినట్లయితే, వాటిని అదుపులో పెట్టడానికి మార్కెటులోనే స్టాకులను విడుదల చేయాలని, ప్రభుత్వం యోచిస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ గిరిజన సలహా మండలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిరిజన సలహా మండలిని పునర్వ్యవస్థీకరించింది. ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమం ఇంఛార్జి మంత్రిగా ఈ మండలి ఎక్స్ ఆఫీషియో అధ్యక్షులుగా వుంటారు. ఈ మండలి 1970 మార్చి 19వ తేదీ నుంచి మూడు సంవత్సరాలపాటు పనిచేస్తుంది. మండలి యితర సభ్యుల పేర్లు. అధికార సభ్యులు:- గిరిజన సంక్షేమశాఖ కమీషనరు, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి, గిరిజన సంక్షేమ శాఖా డైరెక్టరు. అధికార సభ్యులు:- శ్రీ వి.నరసింహారావు ఎం.పి., శ్రీమతి బి.కె. రాధాబాయి ఎం.పి., శ్రీ మీసక సుబ్బన్న, ఎం.ఎల్.ఎ. శ్రీ బోయిన రాజయ్య ఎం.ఎల్.ఎ., శ్రీ చిట్టి నాయుడు ఎం.ఎల్.ఎ., శ్రీ డి. కొండలరావు ఎం.ఎల్.ఎ., శ్రీ చోడి మల్లికార్జున ఎం.ఎల్.ఎ. శ్రీ కె. రామిరెడ్డి ఎం.ఎల్.ఎ., శ్రీ యస్. ఎ. దేవిషా ఎం.ఎల్.ఎ. శ్రీ కె. భీమారావు ఎం.ఎల్.ఎ., శ్రీ కె. కన్నయ్యదొర ఎం.ఎల్.ఎ. శ్రీ ఎన్. ప్రతాపరుద్రరాజు ఎం.ఎల్.ఎ., శ్రీ కొమరం రామయ్య ఎం.ఎల్.ఎ., శ్రీమతి పి. వాణీ రమణారావు ఎం.ఎల్.సి., శ్రీ టి. సాంబయ్య, ఆంధ్రప్రదేశ్ యానాది సంఘ ప్రధాన కార్యదర్శి, గుంటూరు జిల్లా, శ్రీ చండ పాపయ్య, కోయ, కరకగూడెం, బూర్గంపహాడు తాలుకా, ఖమ్మం జిల్లా.

ప్రభుత్వ ప్లీడర్లు

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు ప్రభుత్వ ప్లీడరుగావున్న శ్రీ ఖాజా అబ్దుల్ ముక్తదార్‌నూ, అడ్వొకేటు శ్రీ డి. వి. శాస్త్రినీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రభుత్వ ప్లీడర్లుగా వారు ఛార్జి తీసుకొనే తేదీనుంచి నియమించింది. శ్రీ పి. రామచంద్రారెడ్డి అడ్వొకేటు జనరలుగా నియమించబడిన ఫలితంగానూ, పైన పేర్కొన్న నియామకాలు జరిగిన ఫలితంగానూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రభుత్వ ప్లీడర్ల ఉద్యోగ హోదాలూ, వారికి కేటాయించిన పనులూ దిగువతెలిపిన విధంగా ఉంటాయి.

శ్రీ జి. వెంకటరామశాస్త్రి, ప్రధాన ప్రభుత్వ ప్లీడరు. రూ. 25,000 ల విలువకు మించిన కోర్టు అప్పీళ్ళతోసహా మొదటిసారి చేసుకునే అప్పీళ్లు, సివిల్ మిసలేనియస్ అప్పీళ్లు, స్పెషల్ ట్రిబ్యునల్ అప్పీళ్లు, అభిప్రాయాలు. శ్రీ పి. శివశంకర్, రెండవ ప్రభుత్వ ప్లీడరు. రూ. 10 000 ల విలువకు మించి రూ. 25,000 ల వరకు విలువకలిగిన సిటీ సివిల్ కోర్టు అప్పీళ్ళతో సహా అప్పీళ్లు, పబ్లిక్ సర్వెంట్స్, ఎలక్షన్లు, ఆహార, వ్యవసాయశాఖ (సివిల్ సప్లయిస్ కేసులతోసహా), మునిసిపాలిటీ కేసులకు సంబంధించిన రిట్లు. శ్రీ కె. ఎ. ముక్తదార్, మూడవ ప్రభుత్వ ప్లీడరు. మిగతా ప్రభుత్వ ప్లీడర్లకు కేటాయించినవి మినహా సాధారణ రిట్లు, రూ. 10,000 ల వరకు విలువకలిగిన సిటీ సివిల్ కోర్టు అప్పీళ్లు రూ. 25,000 ల వరకు విలువకలిగిన సివిల్ మిసలేనియస్ అప్పీళ్లు, రెండవసారి చేసుకునే అప్పీళ్లు. సి. ఆర్. పి. లు, ఇతర అంశాలు. శ్రీ డి. వెంకటరెడ్డి, మోటారు రవాణా కేసుల ప్రభుత్వ ప్లీడరు. అన్ని మోటారు రవాణా కేసులు. శ్రీ డి. వి. శాస్త్రి, అమ్మకంపన్ను విషయాల ప్రభుత్వ ప్లీడరు. అన్ని అమ్మకం పన్ను విషయాలు.

మత సామరస్యం-నేటి ప్రధాన కర్తవ్యం

క్రాంత్రితతరానికి వెనకచూపులేదు_ముందుచూపుతప్ప. కాబట్టి ముందుచూపు వుండాలని ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ అన్నారు. "ఈనాడు మతంపేరిట మన మతంయొక్క ప్రాథమిక సూత్రాలను విస్మరించడం జరుగుతున్నది. మన దేశానికి ఆధారభూతమైన ప్రాథమిక సూత్రాలను మరచిపోతున్నాము" అని ఆమె ఉద్ఘాటించారు.

మన దేశంలో వివిధ మతాలకుచెందిన, ఆచార వ్యవహారాలకు చెందిన, భాషలకు చెందిన ప్రజలు నివసిస్తున్నారు. వారు సఖ్యతతో కలసిమెలిసి ఉండాలంటే మత సామరస్యం అత్యావశ్యకం. ఏదైనా వర్గానికిచెందిన వారికి ఇతరుల మతం, భాష, ఆచార వ్యవహారాలపట్ల సద్భావం లేకపోవచ్చు కాని సహనం మాత్రం ఉండాలి. మత సామరస్యానికి ఇది అవసరం. గాంధీ మహాత్ముడు తమ జీవితంలో తొలి దశలోనే దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడు_యీ పరమసత్యాన్ని గుర్తించారు. జీవితాంతంవరకూ ఈ అభిప్రాయాన్ని కలిగిఉన్నారు.

ఖిలాఫత్ ఉద్యమం రోజుల్లో, పంజాబు దురంతాలకు వ్యతిరేకంగా పోరాటం సాగిన రోజుల్లో ఆయన హిందూ_ముస్లిముల ఐకమత్యానికి అత్యంత ప్రాముఖ్యం ఇచ్చారు. దీనినే ఆయన మూలంగా మత సామరస్యంగా పరిగణించారు. మత సామరస్యాన్ని, మత సమైక్యతనూ పటిష్ఠం చేయాలని విజ్ఞప్తి చేస్తూ ఆయన ఆరోజుల్లో ఉపన్యాసాలు ఇచ్చారు. వ్యాసాలు వ్రాశారు.

భారత దేశంలోని ప్రతి జీవన రంగంలోనూ గాంధీజీ ప్రభావం దేదీప్యమానంగా కానవస్తుంది. మానవులను సత్క్రమ పథంలో నడిపించడానికి గాంధీజీ ఎంతో కృషిచేశారు. కనుక మానవుని భవితవ్యాన్ని తీర్చిదిద్దడానికి ఆయన దైవాంశ సంభూతుడుగా అవతరించినట్లు కనిపించింది. విభిన్న సంస్కృతుల సమ్మేళనం సఖ్యతతో జరిగి, భిన్నత్వంలో ఏకత్వం సాక్షాత్కరించడాన్ని గాంధీజీ అభిలషించారు.

ఒకవర్గంవారు మరొకవర్గంపట్ల ద్వేషాసూయలకు బదులుగా సుహృద్భావాన్ని ప్రదర్శించాలని ఆయన కోరారు. ఆయన మత సామరస్యాన్ని, నిర్జీవమైనశరీరాలకు నూత్నజీవితాన్ని ప్రసాదించి కొత్తఉత్సాహాన్నీ, ధైర్యాన్నీ కలుగజేసేదిగా పరిగణించారు. గాంధీజీ నిత్యములైనసత్యం, అహింసలకొరకు తమజీవితాన్ని అంకితం చేశారు. ఇవి భారతదేశానికేకాక సమస్త ప్రపంచానికి అత్యావశ్యకములైనవి. ప్రజలలో అహింసాతత్వాన్ని ప్రబోధించడంలో గల కష్టనిష్ఠూరాలేమిటో గాంధీజీకి బాగా తెలుసు. యావత్తు దేశానికి తీరని ఆర్థిక, నైతిక, ఆధ్యాత్మిక నష్టాన్ని కలిగించిన మత కలహాలను నివారించడానికి కొన్ని చర్యల్ని సూచించారు. ఈ ఉద్దేశంతోనే కల్లోలిత ప్రాంతాలలో శాంతిని స్థాపించడానికి శాంతిదళాలను ఆయన ఏర్పాటుచేశారు. ఈ శాంతి దళాలు నిర్వహించవలసిన పనులను సూచించారు. ఆయన సూచనలు నేటికికూడా అమూల్యమైనవి. ఆయనచేసిన సూచనలివి._

1. స్త్రీ పురుషులందరికీ అహింసయందు పరిపూర్ణమైన విశ్వాసం ఉండాలి. భగవంతుని యందు విశ్వాసం లేకపోతే ఇది సాధ్యంకాదు. భగవంతుని దయ, శక్తిలేనిదే, అహింసావాది ఏపనీ చేయలేడు. భగవంతునిదయ.శక్తిలేనిదే అతనికి శాంతంగా, నిర్భయంగా మరణాన్ని ఎదుర్కోవడానికి ధైర్యం ఉండదు. అందరి హృదయాలలో భగవంతుడు ఉన్నాడనే విశ్వాసం ఉంటేనే ఇట్టి ధైర్యం వస్తుంది భగవంతుని సమక్షంలో భయం ఉండదు. భగవంతుని అనంతశక్తిని తెలుసుకోవడంలో గల అంతరార్థం ఏమంటే "గూండా"లని వ్యవహరించబడే మానవులను కూడా గౌరవించాలి. మానవుణ్ణి దానవత్వపు ప్రభావం నుండి మళ్లించడానికి మనం ప్రయత్నించాలి

2. ఈ శాంతిదూత, ప్రపంచంలోని అన్ని మతాలను సమంగా చూడాలి.

3. స్థానిక ప్రజలు, తమ ప్రాంతాలలో శాంతి సామరస్యానికి కృషి చేయవచ్చు.

4. ఈ కృషిని వ్యక్తిగతంగాగానీ సమిష్టిగాగానీ చేయవచ్చు అందువల్ల ఏ ఒక్కరూ సహచరుల నిమిత్తం వేచి ఉండవలసిన పనిలేదు. ఐతే తమ ప్రాంతంలో స్థానిక బృందాన్ని ఏర్పాటుచేయడానికి సహచరులను కూడగట్టుకునేందుకు సహజంగానే ప్రయత్నిస్తారు

5. అవాంఛనీయ పరిస్థితులు నెలకొన్న తరుణంలో అపరిచిత వ్యక్తిగా అల్లరిమూకల మధ్యకు వెళ్లి, వారిలో అనుమానాలను రేకెత్తించే అవకాశం ఏర్పడకుండా యీ శాంతి దూత తన ప్రాంతంలోగానీ, తాను ఎన్నుకున్న ప్రదేశంలోగానీ వ్యక్తిగత సేవలద్వారా ముందునుండే ప్రజలతో సన్నిహిత సంబంధం, పరిచయం కలిగి ఉండాలి.

6. వ్యక్తిగత నడవడికకూ; నిష్పాక్షికతకూ యీ శాంతి దూత కట్టుబడి వుంటూ పేరు సంపాదించాలి.

7. సాధారణంగా ఉపద్రవం సంభవించడానికి ముందుగా సూచన ప్రాయంగా హెచ్చరికలు జరుగుతుంటాయి. అవి తెలిసినప్పుడు ప్రమాదాన్ని పసికట్టి యీ శాంతి బృందాలు ముందుగా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి.

8. అల్లరులు వ్యాపిస్తున్న సమయంలో పూర్తి కాలం పనిచేసే కార్యకర్తలు ఉంటే మంచిది. ఐతే విధిగా ఉండాల్సిన పని లేదు. సాధ్యమైనంత ఎక్కువ మంది సహృదయులైన స్త్రీ పురుషులు ఉండాలనేదే ప్రధాన ఉద్దేశం. తమ ప్రాంతం

లోని ప్రజలతో సన్నిహిత సంబంధాలను నెలకొల్పడానికి కృషి చేయగల, వివిధ జీవన రంగాలకు సంబంధించిన వ్యక్తులను కార్యకర్తలుగా చేర్చుకున్నప్పుడే యీ ఉద్దేశం నెరవేరుతుంది. అంతేగాక శాంతి బృందం ఆశయాలకు అర్హులైనవారినికూడా చేర్చుకోవాలి.

9. కాలక్రమేణ సులభంగా గుర్తించడానికి వీలుగా, శాంతి బృందం కార్యకర్తలు ప్రత్యేకమైన దుస్తులను ధరించాలి.

ఈ సందర్భంలో రాజ్యాంగ సభ, 1948 ఏప్రిల్ 3 వ తేదీన ఆమోదించిన తీర్మానం దిగువ ఇవ్వబడింది.


"ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకూ, జాతీయ సమైక్యతా పరిరక్షణకూ ఎలుగా భారతీయ జీవనరంగంనుండి మతతత్వాన్ని పూర్తిగా రూపు మాపాల్సిన అవసరం ఉన్న దృష్ట్యా తమ వర్గానికిచెందిన మత విషయక, సాంస్కృతిక, సాంఘిక, విద్యా విషయక అవసరాలకు మినహా జాతి మత, వర్ణ, వర్గ ప్రాతిపదికలపై సభ్యత్వం ఇవ్వడానికి, లేక సభ్యత్వం నిరాకరించడానికి అవకాశంగల నియమ నిబంధనలుగల మత సంస్థలను ఇతర కార్యక్రమాలలో పాల్గొనడానికి అనుమతించరాదు. అంతేగాక అందుకై శాసనపరమైన, పరిపాలనా పరమైన చర్యలన్నిటినీ తీసుకోవాలని అభిప్రాయపడుచున్నది."

ఈ నాడు మత సామరస్యం చాలా అవసరం. అతుకుల బొంత సమైక్యత మనకు అవసరం లేదు. హృదయాల కలయిక మనకు కావాలి. మత తత్వానికి వ్యతిరేకంగా జాతీయ సమైక్యతా మండలి నిర్వహిస్తున్న ఉద్యమంలో పార్టీలతో పనిలేకుండా ప్రతి భారతీయ పౌరుడు పాల్గొనాలి ★

పోలీసు అధికారులకు ధైర్యసాహస పతకాలు



శ్రీ యం సత్యనారాయణ



శ్రీ యల్. కె. పాత్రుడు



శ్రీ కె. సుగుణాకరరావు

శ్రీకాకుళం జిల్లాలోని పోలీస్ ఇన్స్పెక్టరు శ్రీ కెంబూరు సుగుణాకరరావు, సబ్ ఇన్స్పెక్టరు శ్రీ మల్లవురెడ్డి సత్యనారాయణ గార్లకు రాష్ట్రపతి పోలీసు పతకాలు యివ్వబడినవి. 1969 మార్చి 17 వ తేదీన ఆదిభట్ల కైలాసం, అతని సహచరులను పట్టుకోడానికి కలువరాజు పేటలో పోలీసులు దాడిచేసిన సందర్భంగా వీరుభయులు ధైర్య సాహసాలు ప్రదర్శించి, తమ విధ్యుక్త ధర్మం నిర్వర్తించారు.

సోంపేట పోలీసు ఇనస్పెక్టరు శ్రీ లంకా జగన్నాత్రుడుకు కూడా రాష్ట్రపతి పోలీసు పతకం లభించింది. 1669 మార్చి 24 వ తేదీన బాతుపురం గ్రామంమీద దుండగులు దాడిచేసిన సందర్భంగా, ఆరు రోజులు దుండగులకోసం వెదికి వారితో ఘర్షణపడి, ఒకనిని పట్టుకోవడం జరిగింది. ఆ సందర్భంగా ప్రదర్శించిన ధైర్య సాహసాలకు గుర్తింపుగా యీ పతకం యివ్వబడింది.

శ్రీకాకుళం జిల్లాలోని మరొక ఇన్స్పెక్టరు శ్రీ యర్రగంటి వీర వెంకట సత్యనారాయణమూర్తికికూడా "ఉత్తమ శ్రేణి నాయకత్వమూ, ధైర్య సాహసాలు ప్రదర్శించినందుకు" పోలీసు పతకం లభించింది. 1969 మార్చి 19 వ తేదీన బోరివంక గ్రామంలో జరిగిన రెండు హత్యల సందర్భంగా దుండగులతో మార్చి 28 వ తేదీన జరిగిన సంఘర్షణలో 7 గురు దుండగులు మరణించారు.

తెలుగునాడులో సాంస్కృతిక విప్లవం

కశింకోట ప్రభాకరదేవు

తెనుగు సీమకు ప్రత్యేకతను సంపాదించింది కూచిపూడి నృత్యం. కూచిపూడి నృత్యకళ యీ దేశంలోనే గాక విదేశాల్లో సైతం విశిష్టత సంపాదించుకున్నది.

★

ప్రతియుగంలోనూ మనిషి జీవితం సాంస్కృతిక కార్యక్రమాలతో పెనవేసుకపోయింది. తన సుఖంకోసం అయితే నేమి, సమిష్టి సంతోషాన్ని దృష్టిలో వుంచుకొని అయితేనేమి మనిషి ప్రాచీన కాలంనుండి విభిన్న పద్ధతుల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ మనుగడను సుఖప్రదం చేస్తున్నాడు. ఈనాడు సాంస్కృతిక విప్లవమనే మాటకు అర్థం కేవలం ప్రాచీన కళాజ్ఞానాల పునరుద్ధరణ మాత్రమేకాదు ప్రాచీనత్వంలోని కొన్ని సాంస్కృతిక విలువలను అవగాహన చేసుకొని, వాటిని ఆధునిక భావపరిణామంతో పదునుపెట్టి సరికొత్త సంస్కృతిని రూపొందించడమే సాంస్కృతిక విప్లవమని చెప్పుకోవచ్చు. ఈ విప్లవ లక్ష్యం కేవలం జగతికళ్యాణమే.

భారతదేశం ఈస్టిండియా కంపెనీవారి పరిపాలనలో వున్న కాలం అది. ఆనాడు భారతదేశంలో ఎన్నో మూఢవిశ్వాసాలు, అనాచారాలు విశృంఖలంగా సంచరిస్తూ మానవత్వపు విలువలను మటుమాయం చేస్తుండేవి. అటువంటి పాడు దినాలలో రాజారామ మోహనరాయలు, మూఢవిశ్వాసాలను, సాంఘిక దురాచారాలను సునిశితంగా ఖండించి దేశ సంస్కృతిని కొంత సంస్కరించాడు. భారతదేశంలో సాంస్కృతిక విప్లవానికి ఆనాడే అంకురార్పణ జరిగింది. 1857వ సంవత్సరం సిపాయిల తిరుగుబాటు కేవలం భారతీయుల ప్రప్రథమ స్వాతంత్ర్య విప్లవమేకాదు, పరోక్షంగా అది హిందూ సాంస్కృతిక విప్లవానికి దోహదం చేసిందని చెప్పవచ్చు. ఆనాడు స్వరాజ్యం పేరిట ఉద్యమం బయలుదేరి ఆ ఉద్యమం సాంస్కృతిక విప్లవంగా పరిణామం చెందింది. తెలుగువాడలో ఆ ఉద్యమం వ్యాపించడానికి కారకులు శ్రీ వీరేశలింగం పంతులుగారు. వీరు వాఙ్మయమనే శంఖారావంతో ఆంధ్రుల్ని యుగ యుగాల మూఢచారాల నిద్రనుండి మేల్కొల్పారు. అంతవరకు విదేశీయుల దాస్యశృంఖలాలలో సతమతమవుతున్న ఆంధ్రుల అద్వితీయ సంస్కృతీ ప్రతిభలను కప్పిపుచ్చిన చీకటి తెరలు అంతరించాయి. తెలుగుజాతికి, తెలుగు సంస్కృతికి నవోదయమయింది. అటుపిమ్మట డా॥ రాధాకృష్ణన్, గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావు ఆది గాగల ప్రముఖుల విభిన్న మేధాసంపత్తితో తెలుగుజాతి, తెలుగు సంస్కృతి సరికొత్త విలువల్ని సంతరించుకుంది.

తిరుపతి వేంకటకవులు

ఆంధ్రరాష్ట్ర ఉద్యమ ఫలితంగా 1926 లో ఆంధ్ర విశ్వకళా పరిషత్తు నెలకొల్పబడింది. ఈనాటి చరిత్ర పరిశోధనలకు శ్రీ కావలి వెంకటబొర్రయ్యగారు మూల పురుషులు. ఆయన, ఆయన అనుచరుల కృషివల్లనే మనం ఈనాడు ఎంతోమంది రాజుల చరిత్రలను, కవుల చరిత్రలను తెలుసుకోగలుగుతున్నాం. ఆంధ్ర విశ్వకళా పరిషత్తు అవతరణ సమయములో శ్రీ తిరుపతి వేంకటకవుల (జంటకవుల) మార్గదర్శకత్వాన ఆశు కవితలూ, అష్టావధానాలూ శతావధానాలూ తల ఎత్తి సామాన్య జనులలో కూడా తీవ్రమైన సాహితీ పిపాసను రేకెత్తించాయి. సాంస్కృతిక విప్లవాన్ని తీవ్రతరం చేశాయి. తత్ఫలితంగా గుంటూరు బందరులలో సాంస్కృతిక కళాశాలలు నెలకొల్పబడి తెలుగునాడంతటా జాతీయవిద్య ఒక ఉద్యమంగా వ్యాపించింది. ఆనాడు వ్యవహార భాషోద్యమానికి రథసారథులు శ్రీ గిడుగు రామ్మూర్తి గారు, శ్రీ గురజాడ అప్పారావుగారు.

తెలుగుభాషకు శ్రీ వీరేశలింగం పంతులుగారు చేసిన సేవ అమూల్యమైనది. అత్యంత శ్లాఘనీయమైనది. తెలుగులో నవల, కథానిక, ప్రహసనాల ప్రయోగకర్త శ్రీ వీరేశలింగం గారు. నేటి వచన రచనకు ఒరవడిని కలిగించిన మహానుభావుడతడు. ప్రతీ ఆంధ్రుడికి పంతులుగారు చిరస్మరణీయులు. తెలుగు సాహిత్యసీమ వారికి ఆజన్మాంతం ఋణపడి ఉంటుంది.

అభ్యుదయ కవిత్వం

ఆనాడు క్రైస్తవ మిషనరీలుకూడ ఆంధ్ర వాఙ్మయానికి చేయూత నిచ్చి సాంస్కృతిక విప్లవాన్ని పటుతరం చేశాయి. ఎందుచేతనంటే మతవ్యాప్తియే లక్ష్యంగా గల ఈ మిషనరీలు ప్రజల భాషతో పరిచయం లేనిదే మతవ్యాప్తి జరగదని గ్రహించి ఆ భాషతో పరిచయాన్ని సంపాదించుకొని తెలుగు భాషాభివృద్ధికి కృషిచేశాయి తదుపరి పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు, శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, అడవి బాపిరాజు మొదలగు సాహిత్యవేత్తలు నూతన ప్రక్రియలతో తెలుగు సాహిత్య క్షేత్రములో నూతన పంటలు పండించారు. తరువాత చందస్సును విడిచిపెట్టి కవిత్వాన్ని అల్లసాగేరు శ్రీశ్రీ. శిష్లా. నారాయణబాబు. తిలక్ వంటి అభ్యుదయ కవులు కవితారీతులలో కొంగ్రొత్త పథాన్ని సృష్టించి ఆ మార్గంలో పయనించడానికి నూతన కవులకు ప్రోత్సాహాన్ని యిచ్చారు. వీరి కవిత్వానికి "అభ్యుదయ కవిత" అని పేరువచ్చింది.

నాటక రంగం

1880 సంవత్సరమునకు పూర్వము ఈ దేశంలో నాటకాలు, నాటికలు ఉండేవి కావు యక్షగానాలు, పగటివేషాలు, తోలుబొమ్మలాటలు మాత్రమే వినోద కాలక్షేపాలుగా చెలామణిలో ఉండేవి. తరువాత తెలుగు సాంస్కృతిక విప్లవానికి నాందీ ప్రస్తావన జరుగుతున్న కాలంలో ధార్వాడ కంపెనీవారు ప్రప్రథమ నాటక ప్రదర్శనలిచ్చి, తెలుగు ప్రజల అభిమానాన్ని, ఆదరణని సంపాదించుకోగలిగారు. తత్ఫలితంగా ఉత్సాహవంతులైన రచయితలు సంస్కృత నాటకాలను ఆంధ్రీకరించి ప్రదర్శనలకు అనుగుణ్యంగా మార్చారు. ఆనాడు స్త్రీ పాత్రలను పురుషులే ధరించారు; ఆనాటి నటులలో పేరు ప్రఖ్యాతులను సంపాదించుకొన్నవారు శ్రీ యడవల్లి సూర్యనారాయణ ఉప్పలూరి సంజీవరావుగార్లు. ఆనాడుకూడా సంఘసంస్కరణల ప్రభావం నాటకాలపై అమితంగా ఉండేది. అందుకు ఉదాహరణలు "చింతామణి," "కన్యాశుల్కం". "మధుసేవ." "రాణాప్రతాప సింహ," "రోషనార" మొదలగు నాటకాలు. 1920 సంవత్సరం తరువాత ఆంధ్రనాటకరంగ చరిత్రలో ఒక పెద్ద మార్పు జరిగినది బళ్ళారి రాఘవ నాటకరంగంలో క్రొత్తదనాన్ని ప్రవేశపెట్టి, స్థూలాభినయమే నటన కాదని. సాత్వికాభినయం నటనకు ముఖ్యం అని చాటిచెప్పి "నవ్యాంధ్ర నాటకకర్త" అయినాడు. 1929లో నాటక కళాపరిషతు ఏర్పాటైంది. కేంద్ర స్థాయిలో సంగీత-నాటక అకాడమీ స్థాపింపబడి ప్రభుత్వం నాటక కళాభివృద్ధికి పూనుకుంది. యిదిఎంతైనా హర్షనీయం

కూచిపూడి

తెలుగు సీమకు ప్రత్యేకతను సంపాదించింది కూచిపూడి నృత్యం. కూచిపూడి నృత్యకళ ఈ దేశంలోనే గాక విదేశాలలో కూడ విశిష్టతను సంపాదించుకుంది. ఐతే, ఆధునిక కాలంలో సాంస్కృతిక విప్లవం వల్లన కథాకళి, మణిపూర్ నాట్యకళా సాంప్రదాయాల ప్రభావం మన నృత్యకళపై పడింది. ఫలితంగా మన నాట్యకళ వినూత్న శోభను సంతరించుకుని ప్రఖ్యాతి గాంచినది. భరత నాట్యవిశారదులు శ్రీ బి వి నరసింహారావు గారు పూర్వ పద్ధతిలో నున్న క్షేత్రయ్య పదాలతో పాటు నండూరి వారి ఎంకి పాటలకు కూడా నృత్యకళా సీమలో చోటును కల్పింప చేశారు. యిది అంతయు సాంస్కృతిక విప్లవానికి నిదర్శనము.

సంగీతం

కళలలో కెల్లా గొప్పది సంగీతము. 18వ శకంలో పురందరదాసు కీర్తనలు చరిత్ర ప్రసిద్ధి కెక్కినాయి. ఈ పంధోమ్మిదవ శకంలో తచ్చూరి సింగనాచార్యుడు, సంగమేశ్వర శాస్త్రిగార్లు గొప్ప సంగీత లక్ష్య లక్షణ విద్వాంసులుగా ప్రసిద్ధి చెందారు సంగీత స్వరాల్లో పరిశోధనలు చేసి ఫలితాన్ని మనకు అందజేసిన శ్రీ జి. వి. సీతాపతిగారు మనకు చిరస్మరణీయులు. సాంస్కృతిక ఉద్యమం ఫలితంగా తెలుగునాడులో సంప్రదాయ సిద్ధమయిన సంగీత కళాశాల విజయనగరంలో నెలకొల్పబడింది.

చిత్రకళ

చిత్ర కళలో తెలుగునాడున పెద్దమార్పేమీ సంభవించలేదు. అయినప్పటికీ "ఆధునిక చిత్రకళ" లో కొంత ప్రవేశాన్ని సంపాదించుకుని, పాశ్చాత్య చిత్రకళా విధానాలలో పురాణ కథలను చిత్రీకరించిన చిత్రకారులు కొందరు చిత్రకళకు కొత్త అందాన్ని తెచ్చిపెట్టాడు. యిది నూతన ప్రక్రియ. శ్రీయుతులు దామెర్ల రామారావు. వరదా వెంకటరత్నం, అడవిబాపిరాజు. మొక్కపాటి కృష్ణమూర్తి అంట్యాకుల పైడిరాజుగార్లు నవ్యాంధ్ర చిత్రకళా రీతికి ప్రయత్నించి సాంస్కృతిక విప్లవానికి చేయూతనిచ్చారు

ఈ నాటి సాంస్కృతిక విలువలకి, ఒకనాటి సాంస్కృతిక విలువలకి మధ్య ఎంతో వ్యత్యాసం కనబడుతుంది. దీనికి కారణం ప్రతినిత్యం పదునుబారుతున్న ప్రజల మేధస్సే. పరుగిడుతున్న కాలంతో పాటు మనిషికూడా పరిగెత్తుతూ మారుతున్నాడు అతని ఆలోచనలూ "మారుతున్నాయి అభ్యుదయం పేరిట ప్రాచీన సంస్కృతిని తన భావనా పటిమతో, తార్కిక జ్ఞానంతో మారుస్తూ ముందుకు సాగిపోతున్నాడు. ఈ సాంస్కృతిక విప్లవమనేది ఏ ఒక్కకాలానికీ చెందినది కాదు. ఒకనాడున్న సాంస్కృతిక విలువల రూపం ఈ నాడు మారింది. ఈ నాడు ఉన్న రూపం రేపు మారిపోవచ్చు. సాంస్కృతిక రంగాల్లో విభిన్నమైన మార్పులెన్నో జరుగవచ్చు ఈ సాంస్కృతిక విప్లవమనేది నిత్యనూతనం. దీని లక్ష్యం జగత్కళ్యాణ సాధనయే. అది నెరవేరగలదని మనం ఆశిద్దాం.

మన రాజ్యాంగం-వెనుకబడిన జాతులు

జె. వీరాస్వామి,

భారత దేశంలో పౌరులందరికి సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని సమకూర్చడం; భావప్రకటన, మత విశ్వాస, ఆరాధనా స్వాతంత్ర్యాలను కాపాడడం, వ్యక్తి గౌరవాన్ని కాపాడుతూ అందరి మధ్యా సౌభ్రాతృత్వాన్ని పెంపొందించి దేశఐక్యతను కాపాడడం మన రాజ్యాంగంయొక్క లక్ష్యాలై ఉన్నవి.

రాజ్యాంగంలో, ప్రభుత్వ కర్తవ్యము ను నిర్దేశించిన భాగంలోని 46 వ అనుచ్ఛేదంలో షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు; తదితర వెనుకబడిన తరగతుల వారు ఆర్థికంగాను విద్యావిషయకంగాను అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, వెనుకబడిన ప్రజలు సాంఘికంగా అణగద్రొక్క బడకుండా కాపాడాలని చెప్పబడి ఉంది. ఇంకా సాంఘికంగాను, విద్యలోనూ, షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు, తదితర వెనుకబడిన తరగతుల వారికి ప్రత్యేక సదుపాయాలు సమకూర్చే నిమిత్తం, రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుల జాబితాలోని 15వ అనుచ్ఛేదం నాల్గవ ఖండంక్రింద, ప్రభుత్వానికి ప్రత్యేక అధికారం ఇవ్వబడింది. అలాగే, 16 వ అనుచ్ఛేదం, నాల్గవ ఖండంక్రింద, ప్రభుత్వ దృష్టిలో, తగినంత మంది ప్రభుత్వోద్యోగులలో లేనటువంటి వెనుకబడిన వర్గముల వారికి, రిజర్వేషన్ ద్వారా, ఉద్యోగావకాశాలు కలిగించడానికి ఏర్పాటు చేయబడింది. వివిధ రాష్ట్రాలలోను, అన్ని కేంద్ర పాలిత ప్రాంతాలలోనూ, షెడ్యూలుకులాలు, షెడ్యూలు జాతులుగా పరిగణింపబడదగ్గవారి జాబితాలను, బహిరంగ ప్రకటనద్వారా ప్రకటించుట, రాష్ట్రపతికి, రాజ్యాంగంలోని 341, 342 వ అనుచ్ఛేదములద్వారా అధికారమీయబడింది. లోక్‌సభలోనూ, ప్రతి రాష్ట్ర శాసన సభలోనూ షెడ్యూలు కులాలు షెడ్యూలు జాతులవారికి స్థానాలను ప్రత్యేకించుచూ రాజ్యాంగంలో నిబంధన చేయబడింది. ప్రత్యేక ప్రాతినిధ్య పద్ధతిని, ఇంకా పది సంవత్సరములు కొనసాగిస్తూ ఇటీవల రాజ్యాంగ సవరణ కూడా చేయబడింది. కేంద్ర, రాష్ట్ర పరిపాలనా వ్యవస్థలలో ఉద్యోగనియామకాలు చేసినప్పుడు, ప్రభుత్వ యంత్రాంగం యొక్క కార్యనిర్వాహక శక్తి కుంటు పడని పద్ధతిలో షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులవారి అవసరాలను దృష్టిలో ఉంచు కొనవలెనని 335 వ అనుచ్ఛేదం ఆదేశిస్తోంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే నియమింపబడ్డ వెనుకబడిన జాతుల కమిషన్ వారు వెనుక బడిన జాతుల జాబితాలను తయారుచేయు కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నారు. షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులవారు 15, 16 వ అనుచ్ఛేదములలోని నాల్గవ ఖండము మేరకు, వెనుకబడిన జాతులుగా పరిగణింపబడడానికి ఏ సందేహము లేదు. అవే అనుచ్ఛేదముల నిమిత్తం, తదితర వెనుకబడిన వర్గాలను నిర్ణయించడమే కష్టతరమైన పని. 15 అనుచ్ఛేదము, నాల్గవఖండం, సాంఘికంగా విద్యా విషయకంగా వెనుకబడిన పౌరులను గురించి ముచ్చటిస్తుంది. విపులంగా చెప్పాలంటే 15వ అనుచ్ఛేదం, నాల్గవ ఖండంక్రింద, జాబితాలో పేర్కొనవలసిన వర్గాలవారు, సాంఘికంగాను, విద్యావిషయకంగాను ఉభయత్రా వెనుక బడివుండాలి. 16వ అనుచ్ఛేదం, నాల్గవ ఖండంక్రింద జాబితాలో పేర్కొనవలసినవారు, ప్రభుత్వోద్యోగాల్లో సరియైన మేరకు ప్రాతినిధ్యం లేనివారై వుండాలి. ఖచ్చితంగా చెప్పాలంటే 15, 16 వ అనుచ్ఛేదముల క్రింద రెండు జాబితాలు విడివిడిగా తయారు చేయడానికి ఏ అభ్యంతరము కన్పడదు. సాంఘికంగా వెనుకబడినతనం అంటే ఏమిటి? అనేది ముఖ్యంగా ఇక్కడ ఉద్భవించే ప్రశ్న. హైందవ సమాజంలో, వ్యక్తులయొక్క అంతస్తులను నిర్ణయించడంలో దురదృష్టవశాత్తు కులం ముఖ్యపాత్ర వహిస్తోందనే విషయం, సుప్రీముకోర్టువారు కూడా గుర్తించారు. కులం లేదా వర్ణము అనేది ప్రారంభదశలో వృత్తి రీత్యా ఏర్పడినట్లు సాంఘికశాస్త్రవేత్తలు, వేద పండితులు చెబుతున్నప్పటికి, రానురాను కులవ్యవస్థ కొరకరాని కొయ్యగా తయారయింది. చారిత్రకంగా కులవ్యవస్థ వృత్తిమూలకంగాఏర్పడినప్పటికి, కాలక్రమేణా దానికి వైదిక కర్మానుసారంగా పవిత్రత అపాదింపబడి శాశ్వతమూలకమైన మార్పులేని సుస్థిరతను సంతరించుకొంది. ఈ అస్వాభావిక పరిణామం ఉచ్చ, నీచ కుల పరిగణనకు, కుల దురభిమానమునకు కూడా దారి తీసింది.

340 వ అనుచ్ఛేదం క్రింద, రాష్ట్రపతిచే నియమింపబడ్డ వెనుక బడిన తరగతుల కమిషనువారు కూడా, భారత దేశంలో కులవ్యవస్థ వల్ల కలిగేలోటు పాటను గురించి విపులంగా పేర్కొన్నారు. అర్థబలం, అధికారబలంతో సంబంధం లేకుండా కులవ్యవస్థ నిర్ణయింపబడింది. వ్యక్తి గౌరవం అతని సంపదను బట్టి కాకుండా, వంశానుగతమైన కులాధిక్యతపై ఆధారపడి ఉంటుందని వారు చెప్పారు. వెనుకబడిన తరగతులను నిర్ణయించడానికి మత వర్ణ, కుల, లింగ, జన్మస్థాన ప్రాతిపదికపై కాకుండా, షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులను నిర్ణయించిన రీతిగా, సాంఘికంగాను విద్యా విషయకంగాను వెనుకబడిన తనం ప్రాతిపదికగా తీసుకొనవలెనని సుప్రీముకోర్టువారు స్పష్టీకరించారు. కేవలం, కుల ప్రాతిపదికమీద కాకుండా సాంఘిక, విద్యారంగాలలో, ఆ కులము, లేక జాతి వారియొక్క, వెనుకబడిన తనాన్నిబట్టి, జాబితాలు

తయారు చేయబడాలని కోర్టులు ఆదేశిస్తున్నాయి. కులాన్ని గుర్తించినట్లయితే కులవ్యవస్థ శాశ్వతంగా నిలిచిపోయే ప్రమాదం ఉన్నట్లు కొందరు భావిస్తున్నారు. అసలు ముఖ్యమైన ప్రశ్న యేమిటంటే, ఇంతకాలం కులతత్వం పోగొట్టడానికి ఎట్టి చర్యలు తీసికొనబడ్డాయి? పార్లమెంటు, శాసన సభలు, స్థానిక సంస్థలు మొదలగు వాటికి జరిగే ఎన్నికలలో కులం ముఖ్యపాత్ర వహిస్తోందని ఒక అభిప్రాయం ప్రబలంగా ఉంది. ఈవాదనలో ఎంతవరకు సత్యం ఉందనేది నిశితంగా పరిశీలన చేయవలసి ఉంది. ఏ కులస్థులు ఎక్కువమంది ఉన్నట్లయితే ఆ కులానికి సంబంధించిన అభ్యర్థి నెగ్గగలడు అనే భావం ప్రజాసామాన్యంలో బలపడినట్లయితే, కుటుంబ నియంత్రణ కార్యక్రమంపైకూడా పెద్ద దెబ్బతీయగల ప్రమాదం లేకపోలేదు. గట్టి చర్యలు తీసుకొనకపోయిన పక్షంలో హిందూ సమాజంనుండి కులోన్మాదాన్ని బయటకు నెట్టివేయడం అసాధ్యం. పైగా, కుల వివక్షత పాటించని క్రైస్తవ, మహమ్మదీయ, బౌద్ధ, జైన, సిక్కు మతాలపైకూడా ఈ కులప్రభావం పడి, సమాజం నిర్వీర్యం కాగలదు. కొన్ని వేల సంవత్సరాలనుండి పాతుకపోయింది. కాబట్టి కులజాడ్యం మనతో కొంతకాలం పాటు ఉండక తప్పదు. కనుక ఉన్న సత్యాన్ని గుర్తించకపోవడం సరియైన పద్ధతికాదు. సాంఘిక విద్యారంగాలలో వెనుకబడిన కులాలు, జాతులు నిర్ణయించాలంటే అట్టి కులాల, లేక జాతుల పూర్తి వివరాలు సేకరించాలి. అంటే వృత్తి, లేక ఉద్యోగం, రాబడి, నివాస స్థలము, విద్య, సంఘములో వారికి ఇవ్వబడే మర్యాద, లేక గౌరవం—ఇవన్నీ తెలియాలి ఈ వివరాలు వాస్తవికంగా సేకరించాలంటే జనాభా లెక్కలు తయారుచేసే సమయంలోనే వీలుపడుతుంది. కాకాసాహేబ్ కలేల్కర్ కమిటీవారు, తమ నివేదికలో ఈ విషయం ప్రత్యేకంగా పేర్కొన్నారు. క్రిందటిసారి 1961 లో జనాభా లెక్కలు సేకరించినప్పుడు కుల వివరణ, పట్టి నుండి తొలగించారు. దీనికి కారణం కులవ్యవస్థ శాశ్వతంగా నిలిచిపోతుందనే భ్రాంతి ఉన్నకీడును ప్రభుత్వ రికార్డులలోనుండి తొలగించినంత మాత్రంచేత, కులవ్యవస్థ నిర్మూలింపబడదు. ఎడారులలో ఉష్ట్రపక్షిని పట్టుకొనేవారు దానిని తరిమికొడితే, అది అలసిపోయినపుడు తన తల ఇసుకలో దాచుకొని తను ఎవరికీ చిక్కకుండా దాగున్నానని అనుకుంటుందట. ఇలాంటి ఉష్ట్రపక్షి విధానాలవల్ల ఏ సమస్యా పరిష్కారంకాదు. ప్రభుత్వోద్యోగాలలో తగిన ప్రాతినిధ్యం ఇవ్వడానికి సాంఘిక విద్యారంగాలలో వెనుకబడిన జాతుల జాబితా తయారుచేయడానికి పూర్తి వివరాలు సేకరించాలని న్యాయస్థానాలు ఆదేశిస్తున్నాయి. 1971 వ సంవత్సరంలో జనాభా లెక్కలు తయారు చేయునపుడు వివిధ కులాలు, జాతుల ప్రాతిపదిక మీద వాటికి సంబంధించిన ముఖ్యమైన సమాచారములు సేకరించుట చాల అవశ్యకము. ఆ విధంగా సమాచారము సేకరించినచో రాజ్యాంగములోని 15, 16 వ అనుచ్ఛేదముల నిమిత్తం వెనుకబడిన తరగతులను నిర్ణయించుటకు సరియైన వివరాలు లభిస్తాయి.

షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతుల మాదిరిగా సాంఘికంగాను విద్యారంగంలోను వెనుకబడి ఉండనివారిని 15వ అనుచ్ఛేదం నాల్గవ ఖండం క్రింద తయారుజేయు వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చకూడదు. ఇలాటి కొన్నికులాలను చేర్చడమే మన న్యాయస్థానాలు మొత్తం జాబితాను రద్దుచేయడానికి ఒక కారణమౌతుంది. ఈలోటుపాటులను సరిదిద్దుకోకుండా, కొందరిని సంతృప్తిపరచడానికి జాబితాను విస్తృతపరచుకొంటూ పోతుంటే, మొత్తం జాబితా చట్టబద్ధం కాకుండా పోయి, ఏండ్ల తరబడి నిజంగా వెనుకబడిన తరగతులవారికి ప్రభుత్వ సహాయం దొరకకుండా పోతుంది.

జాతి ఐక్యతకు గొడ్డలిపెట్టుగా ఉన్న కులవ్యవస్థను నిర్మూలించటానికి ప్రతిభారతీయుడు తోడ్పడాలి. కులతత్వాన్ని ఎంత తొందరగా నిర్మూలించగలిగితే దేశ సమైక్యతకు, బయట శత్రురాజ్యముల కుతంత్రములను తుదిచిపెట్టడానికి అంత మంచిది. ప్రభుత్వపరంగా కులతత్వాన్ని నిర్మూలన చేయడానికి ఒక సులభ మార్గం ఉన్నట్లు కొందరు సంఘ సంస్కర్తలు చెబుతున్నారు. వర్ణాంతర వివాహాలు చేసుకొన్నవారికి తగినంత ప్రోత్సాహం కల్పించే నిమిత్తం ప్రభుత్వోద్యోగాలలోనూ, ప్రభుత్వ పెట్టుబడితో నడుపు వివిధ సంస్థల ఉద్యోగాలలోనూ కొంత నిష్పత్తిలో ఉద్యోగాలు కేటాయించబడాలనీ, షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు తదితర వెనుక బడిన తరగతులవారిని వివాహం చేసుకొన్న ఉన్నత కులాలవారికి, ప్రత్యేక ఉద్యోగావకాశం కల్పించినచో కులదృక్పథం కొంతవరకు పోతుందనీ కొందరి దృఢ విశ్వాసం. ప్రభుత్వం, సంఘ సంస్కర్తలు జాగ్రత్తగా ఈవిషయం పరిశీలన చేయవచ్చును. ఉద్యోగావకాశాలు తక్కువగా ఉన్న నేటి పరిస్థితులలో విద్యావంతులైన ఉన్నతకులస్థులు, వర్ణాంతర వివాహాలు విరివిగా చేసుకొని క్రమంగా కులతత్వాన్ని రూపుమాపగలరని, దృఢంగా విశ్వసించేవారిలో నేనొక వ్యక్తిగా భావిస్తున్నాను. కేవలం బహిరంగ ఉపన్యాసాలు, ఇతరప్రచార సాధనాలవల్ల అనుకొన్నంత మానసిక పరివర్తన జరుగదు ప్రస్తుతం వర్ణాంతర వివాహాలు అడపాదడపా జరుగుతున్నా, వాటికి సమాజంలో ప్రోత్సాహం లేదు. గౌరవంలేదు. వర్ణాంతర వివాహం ప్రాతిపదికగా, ఉద్యోగాలు కేటాయించబడడానికి రాజ్యాంగరీత్యా వీలుకానిచో, దేశ సమైక్యతను కాపాడడానికి ప్రపంచవ్యాప్తంగా మనదేశానికి గౌరవప్రతిపత్తులను పెంపొందింపచేయడానికి, దేశ స్వాతంత్ర్యాన్ని, అంతఃశత్రు,బహిశ్శత్రువులబారినుండి తప్పించడానికి అట్టికేటాయింపుకు వీలుకల్పించే విధంగా రాజ్యాంగం సవరణ చేయవలసివస్తే—అలాచేయటం భావ్యం కాందటారా?

(ఆకాశవాణి సౌజన్యంతో)

గాంధీచరిత్ర-తోలుబొమ్మలాట

(గత సంచిక తరువాయి) — ఆరుద్ర

(కేతిగాడు పోలిగాడు సంభాషణ)

కేతిగాడు : పేరువచ్చాక అందరూ చుట్టాలే, అందరూ కులపోళ్ళేగాని పేర్లు రాకముందు వృద్ధిలోనికి వచ్చేవాళ్ళని చూస్తే అందరికీ కుళ్ళేకదా;

పోలిగాడు; ఔను. కుళ్ళబోతుల ముందు గుడిసె కడితే కూలినదాకా ఒకటే పోరు అన్నారు. ఇంతకీ గాంధీగారికి కుల మెప్పుడు పోయింది? ఎలా పోయింది?

కేతిగాడు : చిన్నప్పుడే పోయింది. తాను చేసిన పుణ్యంవల్ల, తల్లి నోచిననోములవల్ల, దైవమిచ్చిన దీవనవల్ల బాలమహాత్ముడు కుశాగ్రబుద్ధి అయినాడు. అతనిబుద్ధి పాదరసంలాగ పరుగులు తీసేది. ఇక్కడ చదవవలసిన చదువులు పూర్తిచేసిన పిమ్మట ఆయన సీమకు వెళ్లి పెద్ద వకీలువృత్తికి చదవదలిచారు. అందుకు కులపెద్దలంతా అడ్డు చెప్పారు.

బంగారు : అదేమి? సాటి కులపోడు బాగుపడతానంటే పెద్దలు కళ్లు కుట్టుకోవడం ఎందుకో.

పోలిగాడు : ఎందుకేమిటి? తమ పెత్తనం చూపడానికి. ఏమిరా కేతిగా! గాంధీగారిని సీమకి వెళ్ళొద్దన్నారా!

కేతిగాడు : అవును. సీమకెళ్లినవాళ్ళంతా మాంసం తినాలి, సారా తాగాలి, ఆడాళ్ళతో తిరగాలి అనే దురభిప్రాయం ఆ రోజుల్లో ఉండేవి. సీమకెళితే గాంధీగారు చెడిపోతారని పెద్దలనుకున్నారు. మీవాడు చెడిపోతాడని తల్లికి నూరి పోశారు.

బంగారు : ఎంత నూరిపోసినా ఆవిడ నమ్ముతుందా? కొడుకంటే ఆమెకు చాలా నమ్మకం.

కేతిగాడు : అది నిజమే! అయినా ఎటుపోయి ఎటువస్తుందో అన్న భయముంటుంది కదా_ తల్లికూడా అభ్యంతరం చెప్పింది.

పోలిగాడు : ఆ! ఆ! అప్పుడేమైంది?

కేతిగాడు : ఏమవుతుంది. గాంధీగారు తల్లి పాదాల సాక్షిగా ప్రమాణం చేశారు, తల్లీ నేను సీమకు వెళ్లినట్లాయినా మద్యమాంసమ్ములు ముట్టను. పరస్త్రీలను తాకను ఇది తప్పిన తల్లికి తప్పినట్లు, అని కఠోరమైన ప్రతిజ్ఞ చేయగా ఆమె అంగీకరించింది; అయినా కులపెద్దలు ఒప్పుకోలేదు.

పోలిగాడు : ఔనౌను. దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడన్నట్టు కులపెద్దలు ఒప్పుకోలేదన్నమాట. గాంధీగారు అప్పుడేం చేశారు.

కేతిగాడు ; ఎవరేమన్నాసరే_తల్లి అనుమతించిన తరవాత తన నిర్ణయాన్ని మార్చుకోనన్నారు. కులపెద్దలకు గంగ వెర్రులెత్తాయి. బొంబాయిలో పెద్దసభ పెట్టారు కులంలో ఉన్నవాళ్ళందరిని రప్పించారు.

బంగారు : అందరూ వచ్చారా?

కేతిగాడు : రాక చస్తారామరి. రానివాళ్ళకు అయిదణాల జుల్మానా వేస్తారాయె.

బంగారు : అయిదణాలా!

కేతిగాడు : ఆ రోజుల్లో అంటే ఎనభై సంవత్సరాల కిందట అయిదణాలంటే ఈ రోజుల్లో అయిదారు రూపాయలన్నమాట. జుల్మానా కట్టాలనే భయంకొద్దీ అందరూ సభకొచ్చారు. దానికి బాలగాంధిని బలవంతంగా తీసుకెళ్లారు. సీమకెళితే చెడిపోతావు_వెళ్లకని బెదిరించారు. ఆయన బెదరలేదు.

బంగారు : ఔనౌను. తాటాకు చప్పుళ్లకు కుందేళ్లే బెదరవు. మహాత్ముడు బెదురుతాడా? గాంధీగారు ఏమన్నారు.

కేతిగాడు : ఏమంటారు. నేను మాతల్లి పాదాలసాక్షిగా ప్రమాణం చేశాను. మధుమాంసాలను ముట్టను. పర స్త్రీలను తాకను. ఇంక మీ అభ్యంతరమేమిటన్నారు.

బంగారు : వాళ్ల నోరు కట్టడి ఉంటుంది.

కేతిగాడు : లేదు. సముద్రప్రయాణం చేయరాదని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి కనుక వెళ్లకూడదన్నారు.

పోలిగాడు: అవును. నిజమే. గాంధీగారేమన్నారు.

కేతిగాడు : బుద్ధొచ్చే సమాధానం చెప్పారు. ఓ పెద్దవారా! మనది వర్తక వాణిజ్యాలుచేసే వైశ్యకులం ఓడ వ్యాపారాలలో ఎన్నో నబురులు వెళ్లిన వాళ సంతతి ఇక్కడ ఉన్నారు. మనసోదరులు నేటికి ఏడెన్ రేవు వరకు అరేబియాసముద్రంపై వర్తకం నిమిత్తం ప్రయాణాలు చేస్తున్నారు. అటువంటి సందర్భంలో నేను సీమదాకా వెళ్లినట్లాయెనా ఏమి దుర్నిమిత్తం ఏర్పడగలదు, అని ప్రశ్నించారు.

పోలిగాడు: సెభాష్! దానికి కులపెద్దలు ఏమన్నారు?

కేతిగాడు : ఏమంటారు, మండిపడ్డారు. మహాత్మునికి మతి పోయిందన్నారు. వెలివేశారు. ఆ కుర్రవానికి సాయ పడినవాళ్లను కూడా వెలివేస్తామన్నారు. సాగనంపిన వాళ్లకు రూపాయి పావలా జుల్మానా వేస్తామన్నారు.

బంగారు : అఘోరించలేక పోయారు. వెలివేస్తే గాంధీగారు ఏమన్నారు?

కేతిగాడు : కానివ్వండి. నా నిర్ణయం మారదన్నారు. చూశావా అత్తా! ఎంత గొప్ప కుటుంబంలో పుట్టినా కొందరు కులపెద్దలు మొండికెత్తి వెలివేస్తే ఎటువంటి వాడైనా కులహీనుడవుతాడు; అంటరానివాడవుతాడు. ఆదిలో మన మాల మాదిగలందరూ ఈ విధంగానే కొందరి మూర్ఖత్వంవల్ల దూరమయ్యారు. ఊరి వెలుపల వెలివాడల్లో వుంటూ అంటరానివారయ్యారు.

బంగారక్క: అలా చెప్పు! చదువుకొనే రోజులలోనే మహాత్ముడు మాలవాడయ్యాడన్నమాట. కులంవాళ్ల కోపానికి ఆహూతయ్యాడన్నమాట.

కేతిగాడు : అవును. అయినా వాళ్ల కోపాలు తాటాకు మంటలు. సీమ నుంచి మహాత్ముడు పట్టా పుచ్చుకొని రాగానే మళ్లా కులంలో కలుపుకున్నారు.

బంగారక్క : ఆఁ! సిగ్గులేనివాళ్లు. ఎలా కలుపుకున్నారు, ఏ మొఖం పెట్టుకొని కలుపుకొన్నారు.

కేతిగాడు : కలుపుకోక ఏం చేస్తారు. పెద్ద చదువులు చదివివచ్చాడాయె. ప్రాయశ్చిత్తం చేసుకొని కులంవాళ్లకి సంతర్పణ చేస్తే చాలన్నారు విందుభోజనాలకు చెంబులు పట్టుకొని తయారయ్యారు.

బంగారక్క : తిండికందరూ సిద్ధమేగా? అయితే పోయిన కులం ఊరబంతి పెడితే మళ్లా వచ్చేస్తుందా? ప్రాయశ్చిత్తం చేసుకుంటే దోషంపోతే — మాలవాళ్ళందరికీ ప్రాయశ్చిత్తం చేసికొని మనలో కలపొచ్చుగా.

కేతిగాడు : గాంధీగారు చెప్పింది అదే! మన దేశంలో మాలవాళ్లు పడే పాట్లన్నీ ఆయన తన జీవితంలో పడ్డారు. అందుకే స్వానుభవం వల్ల వీటిని తెలుసుకొన్నారు. ఇతరులకు చెప్పారు.

బంగారు : అల్లుడా! అల్లుడా! కులంవాళ్లు మళ్లీ కలుపుకొన్నాక మాలవాళ్లపాట్లు ఆయనెందుకు పడవలసి వచ్చిందిరా?

కేతిగాడు : తప్పలేదు. సీమ నుంచి తిరిగి వచ్చాక గాంధీగారు మళ్లా పరదేశాలకు వెళ్లారు. దక్షిణాఫ్రికా దేశంలో ప్లీడరుగిరీ చేశారు. అక్కడే స్థిరపడ్డారు. ఆ దేశంలో నూటికి తొంభయి తొమ్మండుగురు నల్లవాళ్లే ఉన్నా అధికారం చేసే నూటికొక్క తెల్లతోళ్ళవాడు తానే అధికుడనని, తానే దేవుడనని భావించి, నల్లవాళ్లను మాలవాళ్లకన్నా ఎక్కువగా బాధించేవారు.

బంగారు : అయ్యో! అంత హింసించేవారా?

కేతిగాడు : అవును. చూడు!

ఆఫ్రికాలో

తెరమీదకు బారిస్టర్ దుస్తులలో గాంధీ ప్రవేశం.

ఆ॥వె॥ ధర్మహాని జరుగ తడవ తడవకు తా
నవతరింతు ననుచు హరి వచించె
గీతలోని మాట ఖ్యాతి నిలుపగాంధి
ఆఫ్రికా తలమున నడుగుపెట్టె.

(రైలుస్టేషనులో గాంధీ దర్శనం—రైలుబండి బొమ్మ కనబడుతుంది.)

ధూమశకటమందు దొరలు కూర్చుండెడు
పెట్టెలోన గాంధి వెడలుచుండ
నప్పుడొకడు దుష్టు డాంగ్లేయుడందు తా
నెక్కి గాంధి జూచి చిక్కుపెట్టె.

దరువు

దొర:— పోగరా? బండి దిగరా!
తగుదునమ్మాయని — యెగబడి నా సరస
నగుపించగా ఒళ్లు పోగరా!!

ఏమిరా! నల్లాద! కూలీ! నీకన్న
ఎక్కువ నాపాద ధూళి
భూమి నేలెడు గొప్ప సీమదొరలతోటి
సామిగాళ్లాసాటి — నీవనగాయేపాటి ॥పో॥

తెల్లవాళ్ళది దొడ్డజాతి - మేము
వల్లించునదే మీకు నీతి
ఎల్లవారలు బెదర ఏలలేదుర భీతి
నల్లినలిపెడురీతి నలుపుచే నా ఖ్యాతి ॥పో॥

కొన్నకోలు

ద్విపద

అని ప్రేలి మనగాంధీ నందుండి వెలికి
త్రోయంగ జూచెడి దొరతోడనిట్లు
సర్వమానవులిల సమువేయటంచు
బాపుజీ కడుశాంత వచనాల నుడివె.

గాంధీ:— తగునా! పాడియగునా
జగమున వేరొక్క తెగలోని జనులను
తెగనాడగా నీకు ॥తగునా॥

మనుజులందరు యొక్కచేను. క్షితిని
తనువు లందరి వొక్కచేను
దొరల నెత్తుటిలోన పొరలి పారవు పాలు
అరసిమెలగిన చాలు - అది నీకు కడుమేలు ॥త॥

కొన్నాను నేరైలు చీటి! అదియే
నన్ను చేసెను నీ సాటి
చదువు సంస్కారముల సంతరించితి చాల
పెదవి వాదనలేల పెనుగులాడకు! గోల! ॥త॥

ద్విపద

అని గాంధి విజమాడ ఆగ్రహావేశ
చిత్తుడై మత్తుడై చెలరేగినాడు
సాటి తెల్లదొరలు సాయపడంగ
శకటమునుండి యా సాధుపుంగవుని
దింపించి వేసెనా తెలివిహీనుండు
గాంధిలేకయె బండి కదలిపోయినది.
అంతతో కష్టమ్ములంతు కాలేదు.
అశ్వశకట మెక్కినటు పైన గాంధి
ఆ బండిలో గూడ నాంగ్లేయుడొకడు
తమచెంత కూర్చుండ తగదని పల్కి
బండి తోలెడివాని ప్రక్కకు పంప
మహాభాగుయని గాంధి మారాడకుండె
బండిలోపల మంచి పవనాలులేక
వెలుపల కొచ్చెనా శ్వేత వర్ణుండు.

ఆ యొక్క తెల్లదొర అట్లు బయటకు వచ్చి గాంధీజీతో పోట్లాడితే సంభాషణ యెట్లు సాగెనన్న!

దొర:— గాలి లోన లేదుర నల్లాడ - చోటు
ఖాళీ చేసివ్వరా నల్లాడ!

గాంధీ:— నీకు నాచోటిస్తె తెల్లాడా!
నాకు చోటు ఎక్కడో తెల్లడా!

దొర:— కావలసిన చోటుంది నల్లాడా! నా
కాళ్ల చెంత కూర్చోరా నల్లాడా!

గాంధీ:— కాని మాట లనకయ్య తెల్లావా! అంత
హీనముగా చూడకయ్య తెల్లాడా!

దొర:— కిక్కు నెత్తికొచ్చాయా నల్లాడా! నీ
ఒళ్లు హూనమౌతుంది నల్లాడా!

గాంధీ:— ప్రాణాలు పోయినా తెల్లాడా! ఈ
స్థానాన్ని విడనోయి తెల్లాడా!

దొర:— వీడవా!

గాంధీ:— వీడను.

దొర:— వీడవా!

గాంధీ:— వీడను.

కొట్టు - కొట్టు - కొట్టు!

సంధివచనం: ఎంత కొట్టినా - గాంధీజీ బండికమ్మలు పట్టి వీడలేదు. కొట్టికొట్టి దొర అలసిపోయాడు.

:ద్విపద:

ఆశయమ్ముల కొంకణు మాత్రమైన
చెక్కుచెదరని యా సిద్ధ సంకల్పు
స్థితిజూచి యా దొరల్ సిగ్గొందినారు
గాంధి యాత్మబలమె కడకు తా గెలిచె
గంజాయి వనమున కడుదొడ్డ తులసి
పాదుకాను సరణి పాషరాజ్యమున
గాంధీమహాత్ముండు కాపురముండి
సాటి దేశీయులతోటి జీవించి
వారి కష్టసుఖాల పంచుకోసాగి
బాలసుందరమను బాధితుండొకడు
గాంధిచెంతకు వచ్చి కన్నీరుకార్చి
వేలాది కూలీల వేదనల్ తెల్పె.

బాలసుందరం: పాట

వినవయ్య వినవయ్య తండ్రీ - మా
వేదనలు కనవయ్య తండ్రీ!
దొరయొకడు నన్ను కొన్నాడు - నా
నరమునెతురు తోడుతాడు
ప్రొద్దుపొడిచిన ఘడియనుండి - నే
యెద్దులా పనిజేతునండి
ఎంతపని చేసినా దొరకు - అయ్యో
సంతసము కలగదీ వరకు.
పట్టుకొని బాదాడు బాబూ - నా
పండ్లూడ కొట్టాడు బాబూ!
పారిపోదామన్న వెదకి - నను
పట్టుకొని తంతాడు తిరిగి.
వేరు గతిలేదయ్య స్వామి నాకు
దారి చూపించవా స్వామి ... (సశేషం)

కొరిశపాడు పంచాయతీసమితి పదేండ్ల ప్రగతి

రాష్ట్రంలో పంచాయతీ రాజ్ వ్యవస్థను ఏర్పాటుచేసి ఇప్పటికి దశాబ్దం గడచింది. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ పథకాన్ని ప్రప్రథమంగా అమలుజరిపి అగ్రగామిగా నిల్చిన ఆంధ్రప్రదేశ్, గ్రామీణ ప్రాంతాలలో ప్రజల జీవనస్థాయి పెరుగుదలకు అనేక కార్యక్రమాలను అమలు జరిపి, అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల సహాయ సహకారాలను ఎంతగానో పొందింది. అభివృద్ధిని సాధించడంలోను, గ్రామీణ నాయకత్వాన్ని నిర్మించడంలోను పంచాయతీ రాజ్ వ్యవస్థ విజయ వంతమైందని పది సంవత్సరాలుగా గడించిన అనుభవంవల్ల స్పష్టమవుతున్నది. రాష్ట్రంలో 321 పంచాయతీ సమితులు ఉన్నాయి. ఒంగోలు జిల్లాలోని కొరిశపాడు పంచాయతీ సమితికూడా అందులో ఒకటి.

కొరిశపాడు పంచాయతీ సమితిలో 56 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సమితి జనాభా 1,16,916. సమితి విస్తీర్ణం 194.5 చదరపు మైళ్లు.

ప్రతి గ్రామానికి ఒక ప్రణాళిక

గ్రామ పంచాయతీల సహకారంతో ప్రతిగ్రామానికి ఒక సమీకృత ఆర్థికాభివృద్ధిప్రణాళికను పంచాయతీసమితి విజయవంతంగా అమలు జరిపింది. ఆర్థికకార్యక్రమానికి సంబంధించి వివిధరంగాలలో గణనీయమైన అభివృద్ధిని సాధించింది.

ఈప్రాంతంలోని అధిక జనాభాకు జీవనాధారం వ్యవసాయం. అందువల్ల వ్యవసాయ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వబడింది. సమితి ప్రాంతంలో సగటు వర్షపాతం 750 మి.మీ జొన్న, సజ్జ, కందులు, మిరప, వేరుశనగ, పొగాకు, ధనియాలు ఇక్కడి ప్రధానమైన పంటలు. నాగార్జునసాగర్ కాలువ నిర్మాణంతో వరిసేద్యం విస్తీర్ణం చెప్పుకోదగినంతగా పెరిగింది. ఈ కాలువ ద్వారా 60,270 ఎకరాలకు సేద్యపు నీరు లభిస్తుంది. వన్నూరుపాడు, అమ్మనబ్రోలు, ధనుకొండ గ్రామాలలో రు. 5. 64 లక్షల ఖర్చుతో మూడు లిఫ్టు ఇరిగేషన్ సంఘాలను నిర్వహిస్తున్నారు. తద్వారా అదనంగా మరికొంత ప్రాంతానికి నీటిపారుదల సౌకర్యం లభిస్తుంది

పశుగణాభివృద్ధి

పశుగణాభివృద్ధి నిమిత్తం యీ ప్రాంతంలో ముర్రా జాతి, ఒంగోలు జాతి పశువులను పెంచుతున్నారు. వాటికి బాగా ప్రాచుర్యం లభిస్తున్నది. పందుల పెంపకాన్ని ఒక పరిశ్రమగా అభివృద్ధి చేస్తున్నారు. బ్లాకుప్రాంతంలో పందుల పెంపకం దార్లకు యార్క్‌షైర్ పందులు పంపిణీ చేశారు. 650 మేలుజాతి కోళ్ళను సరఫరా చేశారు. అమ్మనబ్రోలులో ఒకకీలక గ్రామీణ కేంద్రాన్ని అయిదు ఉపకేంద్రాలతో సహా నెలకొల్పారు. కొరిశపాడులోపశువైద్యశాల ఏర్పడింది. ఇదే కృత్రిమ పిండోత్పత్తి కేంద్రంగా కూడా పనిచేస్తున్నది.

సహకార రంగంలో సమితి అద్వితీయమైన అభివృద్ధి సాధించింది. సమితిలోని అన్నిగ్రామాలకూ సహకారరంగం కార్యకలాపాలు విస్తృతీకరించాయి. 51 బహుళార్థ సాధక సహకార సంఘాలు, ఒక మార్కెటింగ్ సంఘం, 18 ఇతరరకాల సంఘాలు సమితిలో ఉన్నాయి.

విద్య

సమితిలో 41 ప్రాథమిక పాఠశాలలను 7 అప్పర్ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభించారు. పంచాయతీసమితి 17 పక్కా పాఠశాలభవనాలు నిర్మించింది.

14 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా జరిగింది. ఆ గ్రామాలలో వ్యవసాయంతో పాటుగా కుటీర పరిశ్రమల అభివృద్ధికి కూడా విద్యుచ్ఛక్తిని వాడుతున్నారు.

వైద్యసహాయం

సమితిలోని గ్రామాలకు వైద్యసౌకర్యాలు కలుగజేసే నిమిత్తం ప్రజల విరాళాలతో రెండు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను స్థాపించారు. ఇంతేగాక నాలుగు లోకల్ ఫండు ఆసుపత్రులను, ఒక గ్రామీణ ఆసుపత్రిని కూడా నెలకొల్పారు.

హరిజన సంక్షేమం

1969 మేనెలలో వరదలవల్ల కొరిశపాడు గ్రామ హరిజనులకు బాగానష్టం జరిగింది. అనేకమంది నిరాశ్రయులయ్యారు. పంచాయతీసమితి, ప్రభుత్వ ఆర్థికసహాయంతో హరిజనులకొరకు ఇండ్లు నిర్మించే పథకాన్ని చేపట్టింది. 17 ఎకరాలస్థలంలో రూ. 3 .50 లక్షల ఖర్చుతో 235 ఇండ్లు నిర్మాణం జరుగుతున్నది.

పంచాయతీ రాజ్యవిధానాన్ని పట్టుదలతో అమలు పరిచినట్లయితే అభ్యున్నతి సులభసాధ్యమేననడానికి కొరిశపాడు పంచాయతీ సమితి చక్కని తార్కాణం. ★

భార్గవకమిటీ నివేదిక ముఖ్యాంశాలు

(గత సంచిక తరువాయి)

తెలంగాణా రెవిన్యూ ఆదాయం, రెవిన్యూ ఖర్చు, అభివృద్ధి ఖర్చులను గురించి, లోగడ పేర్కొన్న సూత్రాలను ఆధారంగా చేసుకొని, జాబితాలను తయారు చేశాము. ఖర్చుకాకుండా మిగిలి పోయిన తెలంగాణా మిగులు నిధులకు సంబంధించిన అంకెల వివరాలు దిగువ పేర్కొనబడినాయి.

ఖర్చుకాని మిగులు నిధులు

సంవత్సరం	(రూ. లు లక్షలలో) మొత్తం
1956_57	633.01
1957_58	378.04
1958_59	516.71
1959_60	697.27
1960_61	142.13
1961_62	79.69
1962_63	466.93
1963_64	764.23
1964_65	191.13
1965_66	113.53
1966_67	(—) 360.01
1967_68	(—) 788 35

ఈ ప్రకారంగా, 1968 మార్చి 31 వరకు ఖర్చుకాని మిగులు నిధుల మొత్తం రూ. 2834.31 లక్షలు వుంది.


అయితే "పెద్దమనుషుల ఒప్పందం" ప్రకారం తెలంగాణా ప్రాంతం అభివృద్ధి కొరకై ఖర్చు పెట్టి వుండవలసిన మొత్తం రూ. 2834.31 లక్షలు వుందని చెప్పడం సరియైనదా కాదా అనే ప్రశ్న ఏర్పడింది. గత పన్నెండేండ్లలో జమ అయిన మొత్తం డబ్బు యిది. అయితే ఈ సందర్భంలో మాకు రెండు సలహాలు ఇవ్వబడినాయి. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం ఖర్చుకాకుండా మిగిలిపోయిన డబ్బును ఆ సంవత్సరంలోకానీ, లేదా మరుసటి సంవత్సరంలోకానీ ఖర్చు పెట్టి వుండినట్లయితే అభివృద్ధి పనులు కొంతవరకు జరిగి వుండేవి. అంతేకాకుండా ధరలు ఎప్పటికప్పుడు పెరుగుతూనే వున్నాయి. అభివృద్ధి పనులను ఇప్పుడు_అంటే 1968 మార్చి 31 తరువాత చేపట్టడంవల్ల ధరల పెరుగుదల కారణాన వాటికి డబ్బు ఎక్కువ ఖర్చు అవుతుంది. ఈ పనులే ఇది వరకే నిర్వహించివుండినట్లయితే, ఇంత డబ్బు ఖర్చు అయ్యేది కాదు. ఈ విషయాన్నే దృష్టిలోపెట్టుకొని తెలంగాణా ప్రతి నిధులు, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్థిక శాఖాధిపతులు మిగులు నిధులకు పునః విలువ కట్టడం న్యాయ సమ్మతంగా ఉంటుందని చెప్పారు. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం వుండిన ధరల సూచీని ఆధారంగా చేసుకొని 1968 మార్చి 31 వ తేదీనాటి ధరల సూచీతో పోల్చిచూచి, ఆ దామాషాలో మిగులు నిధులకు విలువ కట్టాలని వారు సూచించారు

ఇక రెండవ సలహా విషయం, మిగులు నిధులను ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం, లేదా మరుసటి సంవత్సరంలో ఖర్చుపెట్టి వుండినట్లయితే, అభివృద్ధి పనులు కొనసాగివుండేవి ఈ అభివృద్ధి పనులు తిరిగి శీఘ్రపురోభివృద్ధికి దోహదం కలిగించి వుండేవి. అనుకొన్న ప్రకారం ప్రగతి జరుగక, ప్రయోజనాలు లేకపోవడంవల్ల, ఖర్చుకాకుండా వున్న మిగులు నిధులకు సమంజస మైన రేటు ప్రకారం వడ్డీని కలపడం భావ్యమని వాదించబడింది.

ఈ విషయాలలో కొంత వాస్తవికత వుంది. ఈ వాదానికి బలం వుంది. అయితే 1956 సం వు "పెద్ద మనుష్యుల ఒప్పందం" లో తెలంగాణా అభివృద్ధికై మిగులు నిధులపైన ఐదేండ్లవరకు పరిమితి వుంచడానికి ఒక నిర్ణయం తీసుకోబడింది. తెలంగాణా శాసన సభ్యులు కోరినట్లయితే, ఇది మరొక ఐదేండ్ల వరకుకూడా పొడిగించబడుతుంది. వెనుకబడివున్న తెలంగాణా ప్రాంతం అభివృద్ధికి దోహదం కల్గించడమే "పెద్ద మనుష్యుల ఒప్పందం" లక్ష్యమైవుంది. ఆంధ్ర ప్రాంత ప్రజల స్థాయికి తెలంగాణావాసులుకూడా రావడానికి వీలుగా ఈ ఒప్పందం చేయ బడింది ఐదేండ్లు తప్పితే పదేండ్లవరకు తెలంగాణా అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించినట్లయితే, ఒప్పందం యొక్క లక్ష్యం నెరవేరగలదని ఉభయ ప్రాంతాల నాయకులు భావించినట్లు తెలు స్తున్నది. "పెద్ద మనుష్యుల ఒప్పందం" ప్రకారం తెలంగాణాలోని రెవిన్యూ మిగులు నిధులు అనుకొన్న వాటికంటే ఎక్కువగానే ఖర్చు పెట్టడం జరిగిందని సేకరించిన అంకెల వివరాలనుబట్టి తెలుస్తున్నది. ఖర్చుకాకుండా మిగిలిన మొత్తాలు అంత ఎక్కువగా

లేవు. గత రెండు సంవత్సరాలలో అంటే 1966_67 ; 1967_68 లో. ఖర్చుకాకుండా మిగిలిన నిధులనుంచి సుమారు 11 కోట్లు ఖర్చుపెట్టడం జరిగింది. ఇంత జరిగినాకూడా, ఆశించిన లక్ష్యాలు నెరవేరలేదు. భవిష్యత్తులో కూడా పెద్దమనుషుల ఒప్పందాన్ని అమలు పరచవలసిన అవసరం వుంది. ఇది అమలు జరుగుతుంది కూడా. అటువంటప్పుడు పైన పేర్కొన్న రెండు సలహాల ప్రకారం మిగులు నిధులకు తిరిగి విలువ కట్టవలసిన అవసరం లేదు. రాష్ట్ర ప్రభుత్వం "పెద్ద మనుషుల ఒప్పందము" ను అమలు పరచడమే కాకుండా, తెలంగాణా అభివృద్ధికి తగిన నిధులు కేటాయించగలదని మేము ఆశిస్తున్నాము.

ఉభయ ప్రాంతాలకు రెవిన్యూ ఖర్చు రెవిన్యూ ఆదాయాలను వేరువేరుగా కేటాయించడం కష్టం. ఎందుకంటే, సాధారణ గా లెక్కలు రాష్ట్రానికంతటికీ తయారుచేయబడి వుంటాయి. 1956 సం., 'ఒప్పందం' దృష్ట్యా ప్రాంతంవారీగా లెక్కలు తయారుచేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొంది. అక్కౌంటెంటు జనరల్ కూడా ఉభయ ప్రాంతాలకు వేరు వేరుగా లెక్కలు వుంచుతున్నారు. అయితే ఇందులో కూడా కొన్ని ఇబ్బందులు లేకపోలేదు. కనుక ఇకముందు, రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, అక్కౌంటెంటు జనరలు ఈ లెక్కలను వేరువేరుగా తయారుచేయడం అవసరం. మేము నిర్ణయించిన సూత్రాలను జాగ్రత్తగా అమలు పరచినట్లయితే, ఇది సుకరమవుతుంది. అంతేకాకుండా, పెద్ద మనుషుల వప్పందం యొక్క లక్ష్యాలను సాధించవలసివుంటే ప్రాంతీయవారీగా లెక్కలు చూపుతూవుండడం మంచిది. అలా చేసినప్పుడు ఉభయ ప్రాంతాలలోను తలసరి ఆదాయాన్ని లెక్కకట్టి, అభివృద్ధిని పోల్చిచూడడం సాధ్యపడుతుంది. అప్పుడు వెనకబడిన ప్రాంత అభివృద్ధికి ఇతోధిక కృషి చేయడానికి సాధ్యపడుతుంది. "పెద్ద మనుషుల ఒప్పందం" లోని భావాన్ని చిత్తశుద్ధితో అమలు పరచడానికి తగు చర్యలు తీసుకొనేందుకు ప్రభుత్వానికి సులభమవుతుంది.




కార్మిక శాఖా మంత్రి శ్రీ జి. సంజీవ రెడ్డి జూన్ 29 వ జూబ్లీ హాలులో జరిగిన యూనియన్ల పరస్పర ప్రవర్తనా నియమావళి సదస్సులో ప్రసంగించారు


నగరంలో

★

వార్తా చిత్రాలు



యాత్రా విషయాలు, మహిళా సంక్షేమ శాఖల మంత్రి శ్రీమతి రోడామిస్త్రీ జూలై 6 వ రవీంద్ర భారతిలో మిత్రలాభం అనే సంగీత నృత్య నాటక ప్రదర్శనకు అధ్యక్షత వహించారు.



భారత దేశంలో స్వీడన్ రాయబారి గన్నర్ హెక్బర్గ్ జూలై 1 న హైదరాబాదులో రాష్ట్ర గవర్నర్ శ్రీ ఖండూభాయ్ దేశాయ్‌ని, ముఖ్య మంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డిని కలుసుకున్నారు.

నగరంలో వార్తాచిత్రాలు



భారత యాత్రా విషయాల అభివృద్ధి సంస్థకు చెందిన పర్యటనలు, రవాణా విభాగానికి రాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి జూలై 18 న జూబ్లీ హాలులో ప్రారంభోత్సవం చేశారు. ఈ విభాగంవద్ద పర్యాటకుల నిమిత్తం 2 లగ్జరీ కోచ్‌లు(85 సీట్లు గలవి), ఒక లగ్జరీ మినీ బస్సు (15 సీటు గలది) మూడు లగ్జరీ కార్లు వున్నాయి.

(గత సంచిక తరువాయి)

మన చరిత్ర సంస్కృతి

ప్రజోద్యమాలు

సాంస్కృతిక పునరుజ్జీవనం ఫలితంగా తెలుగు దేశంలోని అన్ని రంగాల్లోనూ నూతన చైతన్యం పొంగివచ్చింది. రాజకీయ సామాజిక రంగాలలో యీ చైతన్యం మరింత ప్రస్ఫుటంగా కన్పించింది. 1913లో బాపట్లలో ఆంధ్రమహాసభ జరిగింది. ఈ సభలో ఆంధ్రులలోని జాతీయ భావాలు స్పష్టంగా జాగృతమైనవి. నిద్రాణమై ఉన్న జాతి లేచి నిల్చున్నట్లుగ కన్పించింది. ఆంధ్రులకు ప్రత్యేకరాష్ట్రం కావాలనే ఉద్యమం బాపట్ల సభలోనే అంకురించింది. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుతూ 1915లో విశాఖపట్నంలో జరిగిన ఆంధ్ర మహాసభ తీర్మానించింది. భాషా ప్రాతిపదిక మీద భాషారాష్ట్రాలను పునర్విభజించాలన్న వాదాన్ని మొట్టమొదట ప్రతిపాదించింది తెలుగువారే. ప్రభుత్వ పరిపాలనలో సామాన్య ప్రజలు భాగస్వాములు కావాలన్న కోర్కె ప్రత్యేక రాష్ట్రవాంఛకు పునాది. దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులు, ప్రకాశం, పట్టాభి ప్రభృతులైన జాతీయ నాయకులు ఆంధ్రోద్యమానికి మూల స్తంభాలుగా నిలిచారు. ఆంధ్రోద్యమంతోపాటు 1920 నుండి ఆంధ్రదేశంలో గాంధీజీ నాయకత్వాన జాతీయ ఉద్యమంగూడా విజృంభించింది. జాతీయ ఉద్యమంలోని భాగంగానే వివిధ స్వరూపాలలో రాజకీయ ఉద్యమాలుతలెత్తాయి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1952లో మొట్టమొదటి సాధారణ ఎన్నికలు జరిగినవి. ఈ ఎన్నికల తరువాత ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఆందోళన రెట్టింపు బలంతో ఎగసి వచ్చింది. యాభై




పొట్టి శ్రీరాములు

ఎనిమిది రోజుల ఉపవాసదీక్ష తరువాత అమరజీవి పొట్టి శ్రీరాములుగారు ఆంధ్రరాష్ట్ర స్థాపన కొరకు 1952 డిసెంబరు 15వ తేదీన ఆత్మార్పణ కావించారు. చివరికి యీ అమరజీవి ఆశయం ఫలించింది. 1953వ సంవత్సరం అక్టోబరు ఒకటవ తేదీన ఆంధ్రరాష్ట్రం సిద్ధించింది.

తెలంగాణాలో ఆంధ్రోద్యమం

బ్రిటీష్‌వారి పాలనలో ఉన్న ఆంధ్ర ప్రాంతంలో ఆంధ్రోద్యమం కొనసాగినట్లే, నిజాం రాజరిక వ్యవస్థ ఉన్న తెలంగాణంలోగూడా ఆంధ్రోద్యమం విజృంభించింది. ఏ ప్రాంతంలో ఉన్నా తెలుగు ప్రజలందరి హృదయం ఒక్కటేగనుక వారి హృదయస్పందన గూడా ఒకేతీరుగా ఉంటుంది: ఆశయాలు, అభీష్టాలు ఒక్కటే. అయితే నిజాం పాలనలోని నిరంకుశ నిర్బంధాల కారణంగా తెలంగాణా ప్రాంతంలోని ఆంధ్రోద్యమం ఎన్నో ఇబ్బందులతో ఒక ప్రత్యేకమైన పరిస్థితిలో ముందుకు పోవలసివచ్చింది. రెండువూర్ల పాతిక సంవత్సరాల అసఫ్జాహి పరిపాలనలో తెలంగాణా తెలుగు ప్రజలకు, తెలుగుభాషకు ఒక విధంగా అజ్ఞాతవాసం, అరణ్యవాసం ప్రాప్తించినవి. ఇట్టి పరిస్థితిలో తెలంగాణా ఆంధ్రోద్యమం ప్రారంభమయింది. 1901వ సంవత్సరములో, హైద్రాబాద్ నగరంలో కొమర్రాజు వెంకట లక్ష్మణరావు ప్రోత్సాహంతో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం స్థాపితమైంది. ఈ ప్రయత్నంలో లక్ష్మణరావు గారికి చేదోడు వాదోడుగా పనిచేసినవారు మునగాల రాజాగారు శ్రీరావిచెట్టు రంగారావుగారు. తెలంగాణాలోనేకాదు, సకలాంధ్రలోను శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం మొట్టమొదటి గ్రంథాలయం. హనుమకొండ మొదలయిన పట్టణాల్లో 1901-1910 సంవత్సరాలమధ్య మరికొన్ని గ్రంథాలయాలు



మాడపాటి హనుమంతరావు


స్థాపితమైనవి. ఈ కాలంలోనే హైదరాబాద్‌లో విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి స్థాపితమైనది. విజ్ఞానచంద్రికా గ్రంథమండలి ద్వారా లక్ష్మణరావుగారు ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలమధ్య దృఢమైన సాంస్కృతిక బంధానికి దోహదం చేశారు. సమగ్ర ఆంధ్ర ఉద్యమానికి లక్ష్మణరావుగారే పునాదులు వేశారని చెప్ప వచ్చు. తెలంగాణంలో మొదట యీవిధంగా వైజ్ఞానిక ఉద్యమం వలె ప్రారంభమయిన ఆంధ్రోద్యమం తరువాత క్రమంగా రాజకీయ ఉద్యమ స్వరూపాన్ని ధరించింది. ఇరవై సంవత్సరాల గ్రంథాలయోద్యమం తెలంగాణా ప్రజల్ని ఎంతో మేల్కొలిపింది; ఇది తెలంగాణా ఆంధ్రోద్యమపు మొదటిదశ. 1921వ సంవత్సరాన హైదరాబాద్ నగరంలో ఒక ముఖ్యమైన సంఘటన జరిగింది; సుప్రసిద్ధ మహారాష్ట్ర విద్వాంసుడు కార్వే అధ్యక్షతన జరిగిన ఒక సంఘ సంస్కరణ సభలో అల్లంపల్లి వెంకట రామారావుగారు తమ ఉపన్యాసాన్ని తెలుగులో ప్రారంభించగా కొందరు సభికులు చప్పట్లుకొట్టి హేళనచేశారు. ఈ సంఘటన తెలంగాణంలో ఒక నూతన చరిత్రకు కారణభూతమైంది. ఈ సంఘటనను అవమానంగా భావించిన హైదరాబాద్ తెలుగువారు ఆ రోజు రాత్రి టేకుమాల రంగారావుగారి ఇంటిలో సమావేశమై ఆంధ్ర సంఘాన్ని స్థాపించుకున్నారు. ఇది తెలంగాణా ఆంధ్రోద్యమ చరిత్రలో మహత్తరమైన సంఘటన. ఆంధ్ర జనసంఘ స్థాపన సమావేశంలో మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, ఆదిరాజు వీరభద్రరావు మొదలయిన పెద్దలు పాల్గొన్నారు. శ్రీ కొండావెంకట రంగారెడ్డి అధ్యక్షతన 1922లో ఆంధ్రజనసంఘం ఒక కార్యవర్గాన్ని ఎన్నుకొని పని ప్రారంభించింది. నిజాం రాష్ట్రంలోని తెలుగువారి అభివృద్ధికొరకు ప్రయత్నించడం ఆంధ్రజనసంఘం ప్రధాన ఆశయం. ఆనాటి ఆంధ్రజనసంఘం కార్యనిర్వాహక వర్గానికి బారిష్టరు రాంగోపాలరెడ్డిగారు అధ్యక్షులు. మాడపాటి హనుమంతరావు పంతులుగారు కార్యదర్శి.

చైతన్య స్రవంతి

సమగ్రమైన ఆశయ ఆదర్శాలతో, విస్తృత కార్యక్రమంతో ఆంధ్రజనసంఘం తెలంగాణాలోని మారుమూలలకుగూడా వ్యాపించసాగింది. ఆంధ్రజనసంఘం ఆనాడు చేపట్టిన వివిధ కార్యక్రమాల్లోని ఒక భాగమే నేటి లక్ష్మణరాయ పరిశోధకమండలి. తెలంగాణాలోని శాసనాలను సేకరించి ప్రచురించడంలో ఈ మండలి చేసినకృషి ఎంతో ప్రశంసనీయమైనట్టిది.


తెనుగుదనం

ఆంధ్రజనసంఘం ప్రారంభించిన ఆంధ్రోద్యమానికి నల్లగొండనుంచి వెలువడే 'నీలగిరి' పత్రిక, వరంగల్లునుంచి వెలువడే 'తెలుగు పత్రిక' చేయూత ఇవ్వసాగినవి. ఇదే కాలంలో తెలంగాణా ఆంధ్రోద్యమానికి అండగా 1926లో గోలకొండ పత్రిక ప్రారంభమైంది. తెలుగు సంస్కృతి, తెలుగు భాషల పరిరక్షణ అభివృద్ధికొరకు ఉద్యమం నడుపుతున్న ఆంధ్ర జనసంఘం కార్యక్రమాల్లో రాజకీయాలు ఉన్నట్లు నిజాం అధికారులకు అనుమానం కలిగింది. అందువల్ల అధికారులనుండి ఆంధ్రోద్యమానికి ఎన్నో నిర్బంధాలు ఎదురైనవి. సభలకు అనుమతి దొరికేదికాదు. 1930 వరకు సాంస్కృతిక పరిధిలోనే కొనసాగిన తెలంగాణా ఆంధ్రోద్యమం తరువాత నిజంగానే రాజకీయ స్వరూపాన్ని ధరించసాగింది. ఇది అనివార్యమైన పరిణామం. ఆంధ్రజనసంఘం సభలో మహిళా సమావేశాలుగూడా జరుగుతుండేవి. 'అరువది లక్షలకు మించిన నిజాం రాష్ట్ర ఆంధ్రుల కష్ట సుఖములను తెలిసికొనుటకును, వారి సమిష్టి అభిప్రాయమును నిర్మించుటకును' ఒక మహాసభ అవసరమనే భావం క్రమక్రమంగా



బూర్గుల రామకృష్ణారావు

ప్రచారమయింది. తత్ఫలితంగా జోగిపేటలో, 1930లో మొట్టమొదటి ఆంధ్ర మహాసభ జరిగింది. ఈ సభకు కీ. శే. సురవరం ప్రతాపరెడ్డిగారు అధ్యక్షులు. ఈ మహాసభకు ఎంతో కష్టంమీద అనుమతి దొరికింది. ఈ సభతోపాటు మొట్టమొదటి ఆంధ్ర మహిళా సభగూడా జరిగింది. ఆంధ్రమహాసభలో రాజకీయాల ప్రసక్తి ఉండరాదని నిజాం ప్రభుత్వం ఒక పెద్ద షరతు విధించింది. 1930 నుండి 1946 వరకు మొత్తం పదమూడు ఆంధ్ర మహాసభా సమావేశాలు జరిగినవి. ఈ మహాసభ సమావేశాల వలన, ఆంధ్రమహాసభ యితర కార్యక్రమాల వలన తెలంగాణంలో అపారమైన ప్రబోధం కలిగింది, ఆంధ్రోద్యమం, సజీవమైన, చైతన్యవంతమైన ప్రజల ఉద్యమంగా రూపొందింది. మొట్టమొదటి అయిదు మహాసభా సమావేశాలు రాజకీయాల జోలికి పోలేదు. 1937లో నిజామాబాదులో జరిగిన ఆరవ ఆంధ్రమహాసభ చరిత్రాత్మకమైనట్టిది. హైదరాబాద్ రాష్ట్రంలోని తెలుగు ప్రాంతంలో నివసించే వారందరూ, వారి మాతృభాష ఏదైనప్పటికీ ఆంధ్రులేనని ఈ సమావేశం




జాకిర్ హుస్సేన్

నిర్ణయించింది. అందువల్ల ఆరవ సమావేశం నుంచి రాజకీయాలకే ప్రాముఖ్యం ఎక్కువయింది. ఈ కారణంవల్ల ఆంధ్ర భాషాభివృద్ధి కొరకు ప్రత్యేకంగా ఒక సంస్థను స్థాపించడం జరిగింది; ఇదే 1943లో స్థాపితమైన ఆంధ్రసారస్వత పరిషత్తు. తెలంగాణా ఆంధ్రోద్యమ చరిత్రలో ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహించిన పాత్ర ఒక ప్రత్యేకమైన అధ్యాయం. 'బాధ్యతాయుత ప్రభుత్వస్థాపన నిజాం రాష్ట్రాంధ్రుల ఆదర్శమని స్ఫురించే తీర్మానాన్ని నిజామాబాదు సమావేశంలోనే ఆమోదించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాజధానియైన నగరంలో ఉర్దూ సాహిత్యముకూడ మూడుపూలు ఆరుకాయలుగా గోల్కొండ రాజుల కాలంనుండి అభివృద్ధి చెందినది. స్వర్గీయ మహరాజా కిషన్ ప్రసాద్ ఉర్దూ సాహిత్యానికి పోషకులుగా కీర్తిగాంచినారు. స్వర్గీయ మగ్దూం మొహియుద్దీన్ సకల భారతావనిలోనే ఉర్దూ కవులకు తలమానికముగా ఉండిరి.

ఆంధ్రప్రదేశ్ అవతరణ

హైదరాబాదు మీద పోలీసుచర్య తరువాత తెలంగాణా ఆంధ్రోద్యమంలో మరొక అధ్యాయం ప్రారంభమైనది. పోలీసు చర్య తరువాత ఘనపురంలో జరిగిన తెలంగాణా ప్రాంత కాంగ్రెసు సమావేశంలో ఆంధ్ర–తెలంగాణాల ఏకీకరణ జరగవలెనని తీర్మానించబడింది. తరువాత నిజామాబాదులో జరిగిన ప్రదేశ్ కాంగ్రెసు సమావేశంలోగూడా ఇటువంటి తీర్మానమే ఆమోదాన్ని పొందింది. ఆ తరువాత విశాలాంధ్రోద్యమం మొదలైంది; విశాలాంధ్ర మహాసభ ఏర్పడింది. తెలంగాణాలో విశాలాంధ్రోద్యమం కొనసాగింది. 1956 నవంబరు ఒకటవ తేదీన ఆంధ్ర–తెలంగాణా




వి. వి. గిరి

విలీనీకరణ జరిగి ఆంధ్రప్రదేశ్ అవతరించింది. నూటయేబది సంవత్సరాల క్రిందట విడిపోయిన తెలుగుదేశం తిరిగి ఒక్కటయింది. ఇది తెలుగువారి చరిత్రలో మహత్తరమైన చరిత్రాత్మక సంఘటన. స్వతంత్ర భారతములో తెలుగుదేశానికి చెందిన మేధావులు ఉన్నత పదవులను అలంకరించి, తమ బాధ్యతలను ప్రతిభావంతముగా నిర్వహించిన నిదర్శనములు అనేకము. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ యిటువంటి మహనీయులలో అగ్రగణ్యులు. హైదరాబాదులో జన్మించి గొప్ప విద్యావేత్తగా ప్రఖ్యాతిగాంచి, రాష్ట్రపతి పదవిని అలంకరించిన డా. జాకిర్ హుసేన్‌గారు కూడ యిటువంటి వారే. ప్రస్తుతము భారత రాష్ట్రపతిగానున్న శ్రీ వరాహగిరి వెంకటగిరి మహోదయులు తెలుగుసీమకు చెందినవారగుట మనకందరకు గర్వ కారణము. (సమాప్తం)

(సమాచార, పౌరసంబంధ, యాత్రిక శాఖ ప్రచురించిన శ్రీ దేవులపల్లి రామానుజరావుగారి, "మన చరిత్ర సంస్కృతి" గ్రంథంనుండి పునర్ముద్రితం)

తూర్పు గోదావరి జిల్లాలో కొత్త పరిశ్రమలకు అవకాశాలు



సామాన్య పింగాణీ వస్తువులు

హోటళ్ళు, రెస్టారెంట్లు, పట్టణ ప్రాంతాలలోని నివాస గృహాలలో కప్పులు, సాసర్లు, చీనీ వంట సామాగ్రి వాడుతూ ఉంటారు. జీవనస్థాయి పెరుగుదల, ప్రజల అలవాట్ల మార్పువల్ల పింగాణీవస్తువులకు గిరాకీ పెరుగుతుంది. ఈ జిల్లాలోను, పరిసర ప్రాంతాలలోను వార్షికంగా రు 2.6 లక్షల విలువగల మామూలు పింగాణీ వస్తువుల డిమాండు ఉంటుందని అంచనా. అవసరమైన, ముడి సరుకు లభిస్తున్న దృష్ట్యా జిల్లాలో యీ వస్తువుల తయారీ యూనిటును నెలకొల్పడానికి అవకాశాలు ఉన్నాయి.

చెరకుగడ గుజ్జు

కార్బన్ కాగితాలు, పాలిష్‌లు పండ్ల భద్రత పరిశ్రమలలో కార్బోనేటుకు బదులుగా చెరకుగడ గుజ్జును ఉపయోగించవచ్చు. చక్కెర మిల్లుల నుండి ఉప ఉత్పత్తిగా లభించే ఫిల్టర్ మడ్ నుండి యిది తయారు చేయవచ్చు. జిల్లాలో ముడి సరుకు లభిస్తున్నందు వల్లనూ, పారిశ్రామిక ఉపయోగానికి చెరకు గడ గుజ్జు ఉపయుక్తమైనందువల్లనూ యీజిల్లాలో ముఖ్యంగా సామర్లకోటలో ఒక యూనిటును నెలకొల్పవచ్చు.

ఆహారపు కాడి

ఆహారపు కాడి ఒక ముఖ్యమైన ఆహారం, రొట్టెల తయారీలోను, విటమినుల తయారీలోను దానిని ఉపయోగిస్తారు. ఆహారపు కాడితో కూడిన రొట్టెలకు మంచి మార్కెటు ఉంది. రాష్ట్రంలో ఆహారపు కాడి తయారుచేసే యూనిట్లు లేవు. చక్కెర ఫ్యాక్టరీల ఉప ఉత్పత్తి అయిన బెల్లపు పానకం నుండి వివిధరకములు గల ఆహారపు కాడి విటమినులు తయారుచేయవచ్చు.

పెక్టిన్, పాపేయిన్

పండ్లు భద్రపర్చడంలోను, జామ్స్, పండ్లరసపాకం తయారీలోను పెక్టిన్‌ను విస్తారంగా ఉపయోగిస్తారు. జీర్ణకారిక వస్తువులు, బలవర్ధక ఔషధాల తయారీలో పాపేయిన్ ఉపయోగిస్తారు. బొప్పాయి పండ్ల గుజ్జు నుండి పెక్టిన్, పాపేయిన్‌లను తయారు చేయవచ్చు. కోనసీమ ప్రాంతంలో లాభసాటిగా బొప్పాయ తోటలను పెంచవచ్చు. వార్షికంగా 3000 పౌండ్ల పెక్టిన్, 13000 టన్నుల పాపేయిన్ ఉత్పత్తిచేసే శక్తిగల యూనిటును నెలకొల్పడానికి దాదాపు 30 ఎకరాల బొప్పాయతోట అవసరమవుతుంది.

నీరుతీయబడిన కూరగాయలు

సహజస్థితిలో ఉన్న కూరగాయల్లో 70 నుండి 85 శాతం వరకు తేమ ఉంటుంది. కొద్దిరోజుల్లో వాటిని ఉపయోగించకపోతే అవి కుళ్ళిపోతాయి. మిగులు నీటిని తీసివేయడం ద్వారా వాటి

బరువును తగ్గించవచ్చు. తద్వారా వాటిని కొంత కాలంవరకు వాడవచ్చు. నీరుతీయబడిన బెండకాయలు, బటాణీలవంటి కూరగాయలు పట్టణప్రాంతాలలో సంవత్సరమంతా లభిస్తున దృష్ట్యా మంచి ప్రాచుర్యానికి వచ్చాయి. రక్షణశాఖలోను, ఎగుమతికీ వాటిని ఉపయోగించవచ్చు. కూరగాయతోటలను అధికంగా వేస్తున్నందు వల్ల రామచంద్రాపురం, అమలాపురం వంటి ప్రదేశాలలో ఒకటి రెండుయూనిట్లను నెలకొల్పవచ్చు.

ఘనీభవింపచేసిన పాలు

జిల్లాలో దాదాపు ఒకలక్షటన్నుల పాలు లభిస్తాయని అంచనా. లో తట్టుగ్రామాలనుండి లభించేపాలను ఉపయోగించడానికి వీలుగా నీటిపారుదల సౌకర్యంగలడెల్టా ప్రాంతంలో పాడిపరిశ్రమను బాగా పెంపొందించడానికి మంచి అవకాశాలు ఉన్నాయి. పట్టణప్రాంతాలలోని రెస్టారెంట్లు, మిఠాయి దుకాణాలు, గృహావసరాలకు ఘనీభవింపచేసిన పాలకు మంచిగిరాకీ ఉంది మార్కెటు అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో రెండు యూనిట్లు నెలకొల్పవచ్చు. డెల్టా లోతట్టు ప్రాంతంలో రోడ్డు మార్గంలో ఉన్న గ్రామం దీని అనువైన ప్రదేశం

జీడిపప్పుగుల్ల నూనె

డెల్టా ప్రాంతంలోని కేసనపల్లి, మోరి గ్రామాలలో జీడిమామిడి శుద్ధి పరిశ్రమ బాగా స్థిరపడింది. నూనె ఉండే జీడిపప్పు గుల్లలను, పప్పును వేరు చేసేసమయంలో కాలుస్తారు. జీడిమామిడిని శుద్ధిచేయడంలో ఆధునిక పద్ధతులను అనుసరించడంద్వారా గుల్లలనుండి అధిక పరిమాణంలో నూనెతీయవచ్చు. జీడిపప్పు గుల్లనూనెను అమెరికాకు ఎగుమతి చేయవచ్చు. టైపురైటర్ రోల్స్, పరిశ్రమల ఫ్లోరింగ్ పెంకులు, ఇన్సులేటింగ్ పరికరాలు మొదలైనవాటిని తయారుచేయడంలోనూ దానిని ఉపయోగిస్తారు. జిల్లాలో జీడిమామిడి గుల్లనూనె తీయడానికి మంచి అవకాశాలు ఉన్నాయి.

ఎపొగ్జిరెసిన్స్

ఉపరితలం పూతవేయడం, పోతపని, పొరలువేయడం అంటువేయడంలో ఎపొగ్జిరెసిన్స్ ఉపయోగిస్తారు. జీడిమామిడి గుల్లనూనె నుండి యిది తయారు చేయవచ్చు. జీడిమామిడి గుల్ల విస్తారంగా లభిస్తున్న దృష్ట్యా మోరి సమీపంలో యీ పరిశ్రమను ఏర్పాటు చేయవచ్చును.

టెంకాయచిప్పల పొడి

ప్లాస్టిక్ పరిశ్రమలలో ఫినోల్ ఫార్మాల్డిహైడ్ మౌల్డింగ్ పౌడరతయారీలో ఫిల్లర్‌గా 80 నుండి 300 మెష్‌ల టెంకాయ చిప్పల పొడి ఉపయోగిస్తారు. తూర్పుగోదావరి జిల్లాలో వార్షికంగా దాదాపు 150 మిలియనుల టెంకాయలు ఉత్పత్తి అవుతున్నాయి. ప్లాస్టిక్ పరిశ్రమలనుండి టెంకాయచిప్పల పొడి డిమాండు బాగా ఉన్న దృష్ట్యాను, జిల్లాలో టెంకాయలు కోకొల్లలుగా లభిస్తున్న దృష్ట్యాను యిక్కడ ఒక యూనిటును నెలకొల్పడానికి అవకాశాలు ఉన్నాయి.

విస్తరణ జాయింట్ ఫిల్లర్లు

భవనాలు, రోడ్ల నిర్మాణాలలో కాంక్రీటు స్లాబ్‌ల మధ్య సందులను కలుపడానికి విస్తరణ జాయింటు సంభాలను ఉపయోగిస్తారు. తద్వారా నీరు కారడాన్ని నిరోధిస్తారు కొబ్బరిపీచు, జీడిమామిడి ద్రవం, కాల్షియం హైడ్రాక్సైడ్‌లతో వాటిని తయారు చేస్తారు. ఈ ప్రాంతంలో ముడిసరుకులన్నీ లభిస్తున్న దృష్ట్యా జిల్లాలో ఒక యూనిటును నెలకొల్పవచ్చు.

రబ్బరుతో కూడిన నారతాడు

సహజసిద్ధమైన, కృత్రిమమైన ఉత్పత్తులతో తయారుచేసిన కుషన్ పరికరాలు చాలా ప్రాచుర్యంలోకి వస్తున్నాయి. ఎక్కువ ధర ఉన్న కారణంగా మధ్యతరగతి దిగువ తరగతి ప్రజలకు యివి అందుబాటులో లేవు. నారతాడు రబ్బరు గుజ్జుతో తయారుచేసిన రబ్బరుతాడు తక్కువ ధరకు లభింప జేయవచ్చు. ఈ వస్తువు మన్నికగా కూడా ఉంటుంది. జిల్లాలో నారతాడు లభిస్తుంది. రబ్బరుకు కూడా కొదవలేదు. అందువల్ల యీ జిల్లాలో ముఖ్యంగా కొనసీమలో ఒక యూనిటును నెలకొల్పవచ్చు.

నార కుంచెలు

కాకినాడ రేవు నుండి విదేశాలకు—ఎక్కువగా జపాన్, బ్రిటన్, జర్మనీ దేశాలకు—వార్షికంగా 120 టన్నుల తాటినార ఎగుమతి అవుతున్నది. తాటినారను ఎగుమతి చేయడానికి బదులుగా దానిని మరింతగా శుద్ధిచేసి కుంచెల రూపంలో ఎగుమతి చెయవచ్చు. ఈ ప్రాంతంలో తాటినార లభిస్తున్న దృష్ట్యా జిల్లాలో ఒకటి, రెండు యూనిట్లను నెలకొల్పవచ్చు.

అరటి పిండి

ఎండిన అరటి ముక్కలనుండి అరటి పిండిని తయారుచేయవచ్చు. పసిపిల్లల ఆహారం, మిఠాయిలు, సేమియాలను తయారు చేయడంలో దానిని ఉపయోగించవచ్చు సారాయిబట్టీలలో మాల్టుకు బదులుగా వాడవచ్చు. జిల్లాలో 10,000 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వార్షికంగా 50,000 టన్నుల అరటి ఉత్పత్తి చేస్తున్నారు. అరటి కొల్లలుగా లభిస్తున్న దృష్ట్యా కోనసీమ ప్రాంతంలో ఒకటి, రెండు యూనిట్లు నెలకొల్పవచ్చు.

పండ రసపు పౌడరు

తూర్పు గోదావరిలో పండ్లతోటలు విస్తారంగా ఉన్నాయి. వివిధరకాల పండ్లులభిస్తాయి. మామిడి, నారింజ, పండ్లరసాల

నుండి బిళ్ళ రూపంలో పొడర్లు తయారుచేసి దేశంలోను, విదేశాల లోను విక్రయించవచ్చు. వండ్ల బిళ్ళలు అనువుగా ఉండి పానీయాల తయారీకి సామాన్య మానవునికి అందుబాటులో ఉంటాయి. జిల్లాలో రెండు యూనిట్లు నెలకొల్పడానికి అవకాశాలు ఉన్నాయి.

డి అయోడైడ్ ద్రావణం

ఉపరితల కోటింగ్, కాగితం, వస్త్ర పరిశ్రమ, చర్మకారీ పరిశ్రమ, ప్లైఉడ్ పరిశ్రమలలో బైండర్‌గా డి అయోడైడ్ ద్రావణం ఉపయోగిసారు. పెండలం ద్రావణం నుండి డిఅయోడైడ్ తయారు చేస్తారు. జిల్లాలో పెండలం సేద్యం చేస్తారు. జిల్లాలో ఒక యూనిటును నెలకొల్పవచ్చు.

పొటాషియం షోనేట్

ఇది దేశంలో పొటాషియం ఎరువులకు ముఖ్యమైన వనరు. సముద్రపు మొక్కలు, ఉప్పు శుద్ధిలో మిగిలిన ప్రధాన ద్రావణాలలో 2_25 శాతం పొటాషియం లవణం ఉంటుంది. తూర్పుగోదావరి జిల్లాకు కోస్తా ప్రాంతం చాలా ఉంది. అనేక ప్రదేశాలలో ఉప్పు తయారు చేస్తున్నారు ఎరువులుగా K_2O ప్రాధాన్యందృష్ట్యా ఒక యూనిటు_ముఖ్యంగా కాకినాడలో నెలకొల్ప డానికి మంచి అవకాశాలు ఉన్నాయి.

లామినేట్ చేయబడిన బోర్డులు

దుకాణాలు, హోటళ్ళ, ఆధునిక భవనాలలో ఆధునిక ఫర్నీచర్‌గా లామినేట్ చేయబడిన బోర్డులు ఉపయోగిస్తున్నారు. నిర్మాణపు పనులు, రైల్వేలు, కోచ్‌ల నిర్మాణంలో కూడా దానిని ఉపయోగిస్తున్నారు. వెదురు చాపలు, కలపచెక్క, కాగితం వంటి సానికంగా లభించే ముడి పదార్థాలతో దానిని తయారు చేయవచ్చు. ఎక్కువభాగం ముడిపదార్థాలు జిల్లాలో లభిస్తాయి. జిల్లాలో ముఖ్యంగా రాజమండ్రిలో ఒక యూనిటును నెలకొల్పవచ్చు.

పశుగ్రాస మిశ్రమం

పట్టణ ప్రాంతాలలోను, పట్టణాలుగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలోను, పాడిపరిశ్రమ, కోళ్ళ క్షేత్రాలు బాగా అభివృద్ధి చెందుతున్నాయి. సమగ్ర ఆహారం యిచ్చినందువల్ల పాలదిగుబడి, గ్రుడ్ల ఉత్పత్తి పెరుగుతుంది. స్థానికంగా లభించేపెండలం, వేరుశనగ పిట్టు, కొబ్బరి, బెల్లంపానకం, ఉప్పు మొదలైన ముడిపదార్థాలతో అనేకరకాల పశుగ్రాసం మిశ్రమాలను తయారు చేయవచ్చు. జిల్లాలో ఒకటి, రెండు యూనిట్లు నెలకొల్ప డానికి అవకాశాలు వున్నాయి.

రాగిచెట్టు చెక్కతో తోళ్ల శుద్ధి

తోళ్ల శుద్ధికి సంబంధించిన పదార్థాలను దేశానికి దిగుమతి చేసుకుంటున్నారు. జిల్లాలోని కోస్తాప్రాంతంలో విస్తారంగా లభించే రాగి చెట్టు చెక్కతో కూడా తోళ్ల శుద్ధి పదార్థాలను తయారుచేయవచ్చు. తోళ్ల శుద్ధి పదార్థాల తయారీకి రాగిచెట్టు చెక్కను అమెరికావారు బోర్నియో నుండి దిగుమతి చేసుకుంటున్నారు. జిల్లాలో దాదాపు 39000 ఎకరాల భూమిలో రాగి చెట్లు ఉన్నాయి. ఒక యూనిటును నెలకొల్పడానికి అవకాశాలు ఉన్నాయి.

ప్రయాణ సంబంధమైన వస్తువులు

పి. వి. సి. షీట్లు, రెగ్జిన్‌తో చేసిన జిప్ బ్యాగులు, సూట్ కేసులు, విద్యార్థుల బ్యాగులవంటి ప్రయాణాలకు అవసరమైన వస్తువులు జిల్లాలో బాగా ప్రాచుర్యంలో ఉన్నాయి. వార్షికంగా దాదాపు రెండు లక్షల రూపాయల విలువగల యిటువంటి వస్తు వులను ఉపయోగిస్తున్నారు. జిల్లాలో ఒక యూనిటును నెలకొల్ప డానికి అవకాశాలు ఉన్నాయి.

మైనం వత్తులు

కొవ్వు, పారాఫిన్‌ల నుండి మైనంవత్తులు తయారు చేసారు. కాకినాడలోని ప్రభుత్వ షార్క్_లివర్ ఆయిల్ ఫ్యాక్టరీలో లభించే ఉప ఉత్పత్తులనుండి కొవ్వు లభిస్తుంది. పారాఫిన్ సానికంగా లభిస్తుంది. నెలకు 1875 డజనుల మైనపు వత్తులు తయారుచేసే యూనిటుకు నెలకు రు. 2000/_లు మాత్రమే కావాల్సి ఉంటుంది.

ప్లాస్టిక్ రసాయనిక రంగులు

గృహాలలో అలంకరణకు ప్లాస్టిక్ రసాయనిక రంగు లను ఉపయోగించడం బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. రాష్ట్రం వెలుపలి ప్రాంతాలనుండి యీ రంగులను చాలావరకు తెప్పిస్తు న్నారు. ప్రస్తుతం ఉన్న యూనిట్లలో ఒకటి యీ రంగుల తయా రీని చేపట్టవచ్చు.

సర్వే పరికరాలు

జిల్లాలో సాంకేతిక విషయాలలో శిక్షణయిచ్చే సాంకేతిక సంస్థలు అనేకం ఉన్నాయి. విద్యార్థులకు, బోధనా సంస్థలకు, ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ రకాల సర్వే పరికరాలు, గణిత శాస్త్ర విషయాల పరికరాలు అవసరమవుతున్నాయి. కాకినాడలో యీ పరికరాల తయారీ యూనిటును నెలకొల్పవచ్చు. ఈ యూని టులో లోహ విభాగాలను తయారుచేస్తూ, డయల్స్, లెన్సులు యితర పరిశ్రమలనుండి పొందవచ్చు. ఈ పరిశ్రమకు కావలసిన ముడి పదార్థాలన్నీ స్థానికంగానే లభిస్తాయి.

క్రౌన్ కార్క్‌లు

పానీయాలు, ఏరేటెడ్ వాటర్ వంటి ద్రవాల ప్యాకింగ్‌లకు క్రౌన్‌కార్క్‌లు అవసరమవుతాయి. జిల్లాలో రు. 1.5 లక్షల

విలువగల క్రౌన్ కార్కులను ఉపయోగిస్తున్నారు. పరిసర జిల్లాలలో కూడా క్రౌన్‌కార్కులకు మంచి డిమాండు ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో క్రౌన్ కార్కులు తయారుచేయడంలేదు. అందు వల్ల జిల్లాలో ఒక యూనిటును నెలకొల్పవచ్చు.

అల్కాతిన్ బొమ్మలు

పిల్లల ఆటబొమ్మలు, బోధనా సంబంధమైన బొమ్మలను ప్లాస్టిక్ పదార్థాలతో తయారుచేయవచ్చు. అవి ఆరోగ్యకరంగాను, మన్నికగాను ఉంటాయి. అవి తయారుచేయడం చాలా సులువు. ముడి పదార్థాలు స్థానికంగానే లభిస్తాయి. యంత్ర పరికరాలకు కేవలం రు. 15000/-లు పెట్టుబడి పెట్టాల్సిఉంటుంది.

మధ్యోద్గామి పంపులు

నీటి పారుదలకు, గృహావసరాలకు పంపులద్వారా నీరు సరఫరా చేయడానికి మధ్యోద్గామి పంపులు అవసరం. జిల్లాలో వార్షికంగా రు. 75000/-ల విలువచేసే పంపులను ఉపయోగిస్తున్నారు. విద్యుచ్ఛక్తి సరఫరా జరగడంతో ఎగువ ప్రాంతాలలోను, ఏజన్సీ ప్రాంతాలలోను పంపుల డిమాండు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న ఫౌండ్రీలలోని ఒకదానిలోగానీ, ప్రత్యేక యూనిటులోగానీ మధ్యోద్గామి పంపులను తయారు చేయవచ్చు.

అల్యూమినియం గృహనిర్మాణ పరికరాలు

తలుపు గుడిదెలు, ఉవర్ బోల్టులు, డ్రాప్స్, హాండిల్స్ వంటి గృహ నిర్మాణ పరికరాలను అల్యూమినియంతో అందంగా తయారుచేయవచ్చు. అనోడైజ్ చేయడంద్వారా యీ వస్తువులకు రంగులువేసి నునుపుగా ఉండే విధంగా తయారుచేయవచ్చు. అవసరమైన యంత్రాలన్నీ దేశంలోనే లభిస్తాయి. నిర్మాణం పనులు ముమ్మరంగా కొనసాగుతున్న దృష్ట్యా జిల్లాలో ఒక యూనిటును నెలకొల్పవచ్చు.

బైస్కిల్ అనుబంధ పరికరాలు, విడిభాగాలు

బైస్కిల్ విడిభాగాలు, అనుబంధ పరికరాలకు బాగా డిమాండు ఉంది. ఎక్కువ ఉపయోగించడంవల్ల బైస్కిల్ భాగాలు స్వల్ప కాలంలోనే అరిగిపోతుంటాయి. వాటిని మార్చి విడిభాగాలను వేయడం చాలా అవసరం. అందువల్ల విడిభాగాలకు బాగా డిమాండు ఉంటుంది. బైస్కిళ్ళు తయారుచేసే యూనిటుకు కూడా విడిభాగాలు అవసరమవుతాయి. వారు దేశంలోని యితర పరిశ్రమల నుండి కొనుగోలు చేస్తున్నారు. సైకిల్ స్టాండ్లు, గేర్ కేసులు, గంటలు మొదలైన వాటిని తయారుచేసే యూనిటును నెలకొల్పవచ్చు. వార్షికంగా రు. 2-00 లక్షల విలువచేసే వస్తువులను ఉపయోగిస్తున్నారు.

పెద్ద పరిశ్రమలు

చెక్కబోర్డులు

నాణ్యమైన టేకు కలప చాలా ఖరీదు ఉంటుంది. ఇటువంటి టేకుకూడా తగ్గిపోతున్నది. విభాగాలు చేయడానికి, ఫర్నీచరు, ప్యాకింగ్ పనులకు టేకుకు బదులు చెక్కబోర్డులను వాడవచ్చు. కలపపొట్టు, అనవసరమైన కలపవంటి వాటితో చెక్కబోర్డులు తయారుచేయవచ్చు. కలప కోత మిల్లులు, కలప మార్కెట్లు, ఎక్కువగాగల రాజమండ్రిలో యీ పరిశ్రమను నెలకొల్పవచ్చు.

టేకునుండి లామినేటు చేసిన బోర్డులు

గోదావరి లోయలోను పరిసర ప్రాంతాలలోను నాణ్యమైన టేకులభిస్తుంది. నాణ్యమైన టేకు వ్యాపారానికి రాజమండ్రి ముఖ్యమైన కేంద్రం. నాణ్యమైన టేకును పొదుపుగా ఉపయోగించడానికి వీలుగా టేకును పొరలుగా మార్చి ఉపయోగించవచ్చు. లామినేటు రూపంలో ప్రెస్ చేయబడిన టేకుపొరలను ఫ్లష్‌డోర్లు, యితర ఫర్నీచరు వస్తువులను తయారుచేయడంలో ఉపయోగించవచ్చు.

రచయితలకు విజ్ఞప్తి

ప్రజలకు ఆసక్తికరమైన వర్తమాన పరిస్థితులను గురించి "ఆంధ్రప్రదేశ్" పత్రిక కోసం ప్రత్యేకంగా రాసిన రచనలు పంపించండి.

సాంఘిక, సాంస్కృతిక విషయాలను గురించిన రచనలూ, ప్రజలకు విజ్ఞాన ప్రదములైన రచనలు కూడా పంపవచ్చు. ప్రకటించిన రచనలకూ, ఫొటోలకూ పారితోషికం చెల్లించబడుతుంది.

పి. వామనరావు

"ఆంధ్రప్రదేశ్" పత్రిక ప్రధాన సంపాదకులు, సమాచార పౌరసంబంధ యాత్రిక శాఖ, హైదరాబాదు.

పోచంపాడు-సుందరభవిష్యత్తుకు సూచి





ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి జూలై 24 న పోచంపాడు ప్రాజెక్టు దక్షిణ కాలువలోకి నీటిని విడుదల చేసినప్పటి చిత్రం


తెలంగాణాలోని కరీంనగర్, నిజామాబాదు జిల్లాలో భూదేవిని నమ్ముకుని చెమటోడ్చి పనిచేసే రైతు సోదరులకు, ఒక చిన్నతరహా నాగార్జునసాగర్ ఆనకట్టలాటి నలభై కోట్ల రూపాయల పోచంపాడు ప్రాజెక్టు నిజంగా ఒక వరప్రసాదమనే చెప్పాలి. వారు కలలు గంటున్న సుందర సీమను చేరుకోవడానికి వేస్తోన్న సోపానపంక్తే ఆ ఆనకట్ట. వారి ఐశ్వర్యవంతమైన భావికి వెలుగిచ్చే వర్తమాన ఆశాజ్యోతి. నిజామాబాదు జిల్లాలో నాగరిక ప్రజా జీవితానికి దూరంగా, పావన గోదావరీ తీరంలో అత్యంత అణకువగా వొదిగివున్న చిన్న గ్రామం పోచంపాడు. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి నది ప్రవేశించిన దగ్గరనుంచి నలభయ్యో మైలువద్ద గోదావరి పక్కనే యీ గ్రామం వుంది. పోచంపాడువద్ద గోదావరి రెండుగా చీలింది. ద్వీపంలాగ ఏర్పడిన భూమికి అటు యిటూ యీ నది ప్రయాణిస్తూ పోతుంది. స్వాభావికమైన, ప్రకృతిసిద్ధమైన యీ గమనం ప్రాజెక్టు నిర్మాణానికి ఎంతగానో తోడ్పడుతుంది.


త్వరత్వరగా, అతి చురుకుగా నిర్మాణం పని జరుగుతున్నది. యీ ఆనకట్ట క్రింద కరీంనగర్, నిజామాబాదు, ఆదిలాబాదు జిల్లాల్లో 5.7 లక్షల ఎకరాల ఆయకట్టుకు సేద్యపు నీరు లభిస్తుంది.


ద్వీపంగా ఎర్పడిన భాగంతోసహా కుడి, ఎడమ పార్శ్వాల నిర్మాణం పనితోపాటు రాతి ఆనకట్ట, మట్టి ఆనకట్ట నిర్మాణం పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. 1969 డిశంబరు మాసాంతానికి రాతిపని 66.32 శాతం, మట్టిపని 41.90 శాతం పూర్తయ్యాయి.


ఇక కాలువల నిర్మాణం. గోదావరి దక్షిణకాలువ త్రవ్వకంపని 1–27 మైళ్ళ మధ్య వివిధ దశల్లో వుంది. 4,7,9,10,12, 13,14,19 మైళ్ళవద్ద కాలువ త్రవ్వకం పూర్తయింది. ప్రాజెక్టు పని ప్రారంభమయినప్పటినుంచి 1969 డిశంబరు వరకు మొత్తం పనిలో 24.77 శాతం పని పూర్తయ్యింది. 79 రాతి పనుల్లోనూ ఇరవయి నాలుగింటిలో పని ప్రారంభించబడింది. ఈ ఇరవైనాలుగింటిలో కూడా ఏడింటి విషయంలో పనులు పూర్తయిపోయాయి. మిగతా వాటి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. అత్యధిక ప్రాంతానికి సాగునీరు అందేలా యీ కాలువను 123 మైళ్ళ పొడవు వరకు పెంచుకు వెళ్లాలని భావిస్తున్నారు. ఇలా దీనిని పొడిగించేటప్పుడు గోదావరి వుపనది అయిన మానేర్ నదిని యీ కాలువ దాటవలసి వుంటుంది. మానేరు నదిమీద రిజర్వాయరును నిర్మించడంద్వారా యీ ఏర్పాటును చేయాలని ఉద్దేశించారు. ఇందువల్ల మానేరు నదిలోని 10 టి.ఎం.సి. ల నీటిని వుపయోగించుకుని దగ్గరదగ్గర అదనంగా 90,000 ఎకరాలకు సేద్యపునీటిని అందజేయడానికి వీలవుతుంది. పోచంపాడు ఆనకట్ట నిర్మాణ పని ప్రారంభించినప్పటినుంచి 1970 జనవరి మాసాంతంవరకు మొత్తం దీనిక్రింద రూ. 1,460 లక్షలు ఖర్చయ్యాయి. ఒక్క వర్తమానసంవత్సరములోనే 1970 జనవరి నెలాఖరు నాటికి ఖర్చుపెట్టిన సొమ్ము రూ. 356.60 లక్షలు వుంది.











1. నిర్మాణంలో వున్న పోచంపాడు ప్రాజెక్టు దృశ్యం
2. సిమెంటు-కాంక్రీటు కలిపే యంత్రం

3,4,6. అనుకున్న వ్యవధిలో ప్రాజెక్టు పూర్తికావడానికి మానవ శక్తి, యాంత్రికశక్తి కలిసి పనిచేస్తున్న వివిధ దృశ్యాలు

5. ప్రాజెక్టు వద్ద పని జరుగుతున్న దృశ్యం





మహాభారతము

తెప్పెగంటుల లక్ష్మణశాస్త్రి

"ఆ మాటనువిని గంగాదేవి భగీరథునితో, 'మహారాజా! నీ మాటప్రకారమే చేసెదను. సంశయములేదు. కాని, ఆకాశము నుండి నేను భూమికి ప్రవహించునప్పుడు నా ప్రవాహ వేగము ధరించుటకు పరమేశ్వరుడు దప్ప ఇతరుల కెవరికిని సాధ్యము గాదు. కనుక రాజా! నీవు ఆ మహేశ్వరుని తపస్సుతో సంతోష పరచుము. ఆ మహాదేవుడు, ఆకాశమునుండి ప్రవహించుచున్న నన్ను తన శిరస్సులో ధరించగలడు. కనుక నీవు ఆ దేవదేవుని ఆరాధించినచో అతడు నీ పితరుల హితమును గోరి నీకు సంతుష్టుడై నీ కార్యమును నెరవేర్చగలడు, అని చెప్పెను. భగీరథుడు గంగాదేవి యాజ్ఞను అనుసరించి పరమేశ్వరుని ఆరాధించి తపస్సుచేసి అతనిని సంతుష్టుని జేసెను. ఆ దేవుడు 'గంగనునేను శిరస్సుమీద ధరించెదను.' అని భగీరథునకు వర మిచ్చెను. ఆ ప్రకారమే ఆ దేవుడు భగీరథునితోను, తన పరివార ముతోను హిమాలయమునకు పోయెను. గంగను 'ప్రవహించుమని కోరుము' అని భగీరథునితో ననెను. భగీరథుని ప్రార్థనపై గంగ ఆకాశమునుండి శివజటాజూటముపై ప్రవహించెను. ఉద్ధృతమైన ఆ ప్రవాహవేగమును పరమశివుడు ముత్యాలహారమువలె అవలీలగా ధరించెను.

"మహారాజా! నురుగుతోగూడి భూమిపై వేగముగా పడి సముద్రమునుజేరుచున్న గంగానది మూడు ధారలుగా ప్రవహించు చుండెను. ఆ మూడు ధారలున్ను మూడు హంస పంక్తులవలె శోభిల్లుచుండెను. మదవతియగు స్త్రీవలె, ఒక చోట సర్పశరీరము వలె కుటిలగమన యగుచు, మరియొకచోట పైనుండి క్రిందకు పడుచు కొండచరియలతో ఢీ కొనుచున్నట్లుండెను. తెల్లనివస్త్రముతో కప్పబడినట్లు నురుగులతో పరివ్యాప్తమైయున్న ఆ గంగానది కొన్ని చోట్ల జల కలకల నాదములతో ఉత్తమ సంగీతమును గానముచేయు చున్నట్లుండెను. ఈ విధముగా అనేక రూపములను ధరించుచు గంగ ఆకాశము నుండి పడి భూతలమునుచేరి భగీరథ రాజుతో నిట్లనెను:

"మహారాజా! నేను ఇప్పుడు ఏ మార్గముగా పోవలెనో చూపుము. నీ కొరకే నేనీ భూతలమునకు దిగితిని." ఆ మాట విని భగీరథుడు సగర పుత్రులు మరణించిపడియున్న ప్రదేశము వైపుగా ప్రయాణమై పోయెను. సకలలోక పూజ్యుడైన పరమేశ్వరుడు గంగాధారణము చేసిన తరువాత తిరిగి కైలాసమునకు పోయెను. భగీరథుడు గంగతోపాటు క్రమముగా సముద్రమును చేరి ఆ జలముచేత సముద్రమును పూరించెను. గంగానదిని ఆతడు తన కూతురుగా చేసికొని ఆదరించెను. అప్పుడు భగీరథుడు పరిపూర్ణమనోహరథుడై పితృదేవతలకు తర్పణోదకములనిచ్చి వారికి పుణ్యలోకములను కల్పించెను.

యుధిష్ఠిర మహారాజా! గంగ, స్వర్గ, మర్త్య పాతాళ లోకములకు మూడు మార్గములుగా ప్రవహించి పోయినందున దానికి 'త్రిపథగా' అని పేరువచ్చెను. సముద్ర పూరణము కొరకు ఆ నది భూమికి తేబడెను. అగస్త్యుడు సముద్రమును పానము చేసిన విధము వాతాపిని చంపిన విధము ఈ మొదలైన సంగతు లన్నియు నీ కోరిక ప్రకారము నీకు చెప్పితిని" అని లోమశ మహాముని ధర్మజునకు చెప్పెనని వైశంపాయనుడు జనమేజయు నకు చెప్పి తరువాతి కథ జనమేజయ మహారాజునకు ధర్మజుని తీర్థయాత్రలను గూర్చి యిట్లు చెప్పదొడగెను:

"జనమేజయా! తరువాత ధర్మరాజు నంద-అపరనంద' యను నదులలో స్నానముచేసి యటనుండి 'హేమకూట' పర్వత మునకుపోయి యచట అద్భుతములు, అనూహ్యయములునగు విషయములను చూచెను. అచట వాయువు సహాయము లేకయే మేఘములు ఉత్పన్నములగుచుండెను. స్వయముగానే వడగండ్లు కురియుచుండెను. దుఃఖితమగు మనస్సుగలవారు ఆ పర్వతమును ఎక్కజాలకుండిరి. అచట ప్రతి దినము వాయువు వీచుచుండెను. వర్షము కురియుచుండెను. వేదధ్వని సర్వదా వినపడుచుండెనే కాని పఠించువారు కనపడరు. సాయం, ప్రాతః కాలములయందు అగ్ని దేవుడు కనపడుచుండెను. అచట ఎక్కువగా ఈగలు కుట్టు చుండెను గనుక ఆ మక్షికా బాధకు విసిగి అక్కడి జనము తమ యిండ్లకు తిరిగిపోఁగోరు చుండిరి. ఇట్టి అనేకములగు అద్భుత విషయములనుచూచి ధర్మరాజు లోమశునితో, మహాత్మా! ఈ పర్వతమునందు ఇట్టివిచిత్రములు ఏలకలుగుచున్నవో దయయుంచి చెప్పుడు.' అని వేడగా లోమశుడిట్లు చెప్పదొడగెను:

"ఈ 'ఋషభకూట' పర్వతమునందు 'ఋషభు'డను మునీశ్వరుడు ఉండెను. అతని ఆయువు అనేక శతవర్షములు ఉండెను. అతడు అతికోపిష్ఠుడుగా నుండెను. ఇతరులతనిని పిలిచి పలుక రించినపుడతడు కడుకోపించి ఆ పర్వతముతో, 'ఎవరైనను ఇచట మాట్లాడినచో వారిపైన వడగండ్లను కురియుము అనియు, వాయువును పిలిచి, 'ఇచట ఏవిధమైన శబ్దము వినపడ

కూడదు. ఇక్కడ చాలా సేపటినుండి యెవడో పురుషుడు మాట్లాడుచున్నాడు. అతనిని మేఘ గర్జనముతో వారించుము అని ఆజ్ఞాపించుచుండెను. ఈ విధముగానే ఆ మహర్షి క్రోధముతో కొన్ని కార్యములను ప్రతి షిద్ధములగు పనులను మరికొన్నిటిని చేయుచుండెను. రాజా ! పూర్వము అనేక దేవతలు నందా నదీతీరమునకు వచ్చి ఆ తీర్థమును సేవించుచుండిరి. అప్పుడు చాల మంది మానవులు వారిని దర్శింపగోరి అక్కడికి పోవుచుండిరి. ఇంద్రాది దేవతలు వారికి దర్శనమిచ్చుటకు ఇష్టపడకుండిరి. అందువలన విఘ్నస్వరూపమగు ఈ పర్వతమును సాధారణ జనమునకు పోవరాని దానిగా దేవతలు చేసియుండిరి. అప్పటి నుండి జనులు ఈ పర్వతముపైన ఎక్కుట అటుంచి తుదకు దీనిని జూచుటకు గూడ వారికి శక్తి చాలకుండెను. కనుక యుధిష్ఠిరమహారాజా ! తపస్సు చేయని వారు ఈ పర్వతమును చూచుటకు గాని, ఎక్కుటకుగాని శక్తులుకారు. కావున నీవు మౌనముగానుండుము. అక్కడ దేవతలు అనేక యజ్ఞములను చేసియుండిరి, వాని చిహ్నములు ఇప్పటికిని ఇక్కడ కానవచ్చుచున్నవి. ఇచటి గడ్డి దర్భల ఆకారములోను, భూమి దర్భలతో పరువబడినట్లుగాను, ఇక్కడి వృక్షములు గూడ యూప స్తంభములుగాను నేటికిని కనబడుచున్నవి. దేవతలు, ఋషులు ఇక్కడ నివసించుచుండుటచేత సాయం ప్రాతస్సమయములందు ప్రతిదినము వారుచేయు అగ్నిహోత్రములు కనబడుచుండును. ఈతీర్థములో స్నానము చేయుటచేత మానవుల పాపములన్నియు దూరమై పోవును కనుక రాజా ! నీవుగూడ సోదరులతో నిందుస్నానము చేయుము. ఆ పిదప విశ్వామిత్రుడు తపస్సు చేసిన 'కౌశికీ' నదికి పోవుదువుగాక."

యుధిష్ఠిరుడు లోమశుని ఉపదేశము ప్రకారమునంత నదిలో స్నానముచేసి అచటి నుండి కౌశికీ నదికి సపరివారుడై పోయెను. ఆ నది చరిత్రను లోమశుడిట్లు చెప్పదొడగెను :

"రాజా ఈ కౌశికీ నదీతీరమునందు 'విశ్వామిత్రాశ్రమము' కనబడు చున్నది. ఇదియే కాశ్యపగోత్రుడగు 'విభాండక' మహాముని యొక్క 'పుణ్యమను' అను నాశ్రమము విభాండకుని కొడుకు ఋష్యశృంగుడు' అను మహాతపస్వి తన తపోమహిమ వలన ఇంద్రునిద్వారా వర్షము కురిపించెను. ఆ దినములలో ఈ దేశములో అనావృష్టిచేత కరువు ఏర్పడియుండెను. అప్పుడు ఇంద్రుడు ఋష్యశృంగునివలని భయముచేత దేశమునందు వర్షము కురిసెను. కశ్యపపుత్రుడగు విభాండకుని కొడుకైనయామునీశ్వరుడు మృగి (ఆడులేడి) యొక్కగర్భమునుండి పుట్టెను 'లోమపాదుడు' అను రాజుయొక్క రాజ్యములో అద్భుత కార్యములను చేసియుండెను.

దేశములో ఇంద్రుడు వర్షములు కురిపిన తరువాత పైరులన్ని బాగుగా పండెను. దానికి 'లోమపాదుడు' చాల సంతసించి తనకూతురగు 'శాంతను', సూర్యుడు తన కూతురగు సావిత్రిని బ్రహ్మదేవునకిచ్చి నట్లుగా, ఇచ్చి వివాహము చేసెను.

అది విని ధర్మరాజు, మహాత్మా ! ఋష్యశృంగుడు మృగియందు ఎట్లు పుట్టెను ? మానవుడు పశుయోనితో సంసర్గము గలిగి యుండుట శాస్త్ర విరుద్ధము గదా ! అది లోకవ్యవహార దృష్ట్యా కూడ అసంభవమే ! ఇట్టి విరుద్ధయోని సంపర్కము వలన పుట్టిన బాలకుడు మహాముని యెట్లయ్యెను ? బాలకుని వలని భయమువలన, బల-వృత్రాదినాశకుడగు ఇంద్రుడెట్లు వానకురిసెను ? రాజపుత్రియగు శాంత మృగరూపములోనున్న మునిని ఎట్లు మోహించెను ? ఆమె సౌందర్యమెట్టిది! లోమపాద మహారాజు ధర్మాత్ముడని ప్రసిద్ధి కలదు గదా ! అటువంటి వాని రాజ్యములో ఇంద్రుడు వానలేల కురియలేదు ? ఇది యంతయు సవిస్తారముగా మహాత్మా ! నాకు చెప్పుము" అని లోమశుని అడుగగా లోమశ మహాముని యిట్లు చెప్పదొడగెను :

ఋష్యశృంగ చరిత్రము

"విభాండక మహాముని దేవతలవలె అతి సుందరుడుగా నుండెను. అతడొక మహాసరస్సులో ప్రవేశించి తపస్సుచేయుచుండెను. చాల కాలము వరకు మహాక్లేశమును అనుభవించుచుండెను. అతడొక్కప్పుడు దేవ వేశ్యయగు ఊర్వశిని చూచెను, ఆమెపై మోహముతోనుండగా నతని రేతస్సు స్ఖలితమయ్యెను. ఆ సమయములోనే దప్పిగొన్న ఒక మృగి అచటికివచ్చి ఆసరస్సునందు నీటితోపాటు ఆ వీర్యమును గూడ త్రాగెను. దానివలన ఆ మృగికి గర్భమేర్పడెను. అది పూర్వ జన్మములో నొక దేవ కన్యగా నుండెను. ఆమెకు బ్రహ్మదేవుడు 'నీవు మృగివై యుండి ఒక మహామునిని కనినతరువాత మృగయోనినుండి విముక్తిని పొందెదవు' అని చెప్పెను. బ్రహ్మ శాసనము అనివార్యమైనది కదా ! ఆ ప్రకారమే మృగీగర్భమునుండి ఋష్యశృంగుని జన్మమేర్పడినది. అతడు పెరిగి పెద్దవాడుగాక పూర్వమే బాల్యమునందే తండ్రివంటి ప్రభావముగలవాడై మహాతపశ్శాలియైయుండెను. రాజా ! అతని శిరస్సుపైన నొక శృంగము ఉండెను. గనుక అతనికి 'ఋష్యశృంగుడు' అని పేరువచ్చెను. అతడు తనతండ్రిని దప్ప ఇతర మనుష్యుల నెవరిని గూడ చూచియుండలేదు. కనుక అతని మనస్సు సర్వదా బ్రహ్మచర్యములో నుండెను.

ఆ కాలమునందే దశరథునకు మిత్రుడగు 'లోమపాదుడు' అనురాజు 'అంగ' దేశమును పాలించుచుండెను. ఒక సారి ఒక బ్రాహ్మణునితో అసత్య వ్యవహారమును చేసియుండెను. అందువలన బ్రాహ్మణులతనిని త్యజించి యుండిరి. ఆ రాజు పురోహితులపై దోషారోపణ చేసెను. అందువలన ఇంద్రుడు అతని రాజ్యములో వాన కురియకుండెను, ఈ యనావృష్టి కారణముగా ప్రజలు చాల బాధపడుచుండిరి. అప్పుడారాజు తపస్విజనముతో, ఇంద్రుడు వర్షము కురియుటకు ఉపాయమును గూర్చియడుగుచుండెను. వారిలో నొకముని, 'రాజా! నీయెడల బ్రాహ్మణులు కుపితులై యున్నారు. కనుక ప్రాయశ్చిత్తమును చేసికొనుము. ఋష్యశృంగ మహామునిని తోడ్కొని రమ్ము. వనవాసియగు నతడు బ్రహ్మచర్యములో నుండి స్త్రీల ముఖము నెరుగడు, అతడెప్పుడును సరళ స్వభావుడై యుండును. అతడు నీ దేశములోనికి వచ్చినచో పర్జన్యుడు తప్పక వర్షము కురియును. అందులో ఏ మాత్రము సందేహము లేదు.' అనెను,

"ఆ మాటవిని యారాజు ప్రాయశ్చిత్తము చేసుకొని బ్రాహ్మణులను ప్రసన్నులనుచేసివచ్చి మంత్రులతో ఆలోచించిఋష్యశృంగ మునిని తోడ్కొని వచ్చుటకు ప్రయత్నముచేసెను. మంత్రుల సలహాపై లోమపాదుడు వేశ్యాంగనలను కొందరిని పిలిచి వారితో 'ఋష్యశృంగుని తోడ్కొని రండు' అని చెప్పెను. ఆమాట వినిన వేశ్యలు ఇటు రాజ భయము, అటు ముని శాపభయము గలవారై ఆ పనికి పూనుకొనలేక విచారపడు చుండిరి. వారిలోనొక వృద్ధ వేశ్య ముందుకువచ్చి 'రాజా! ఆ ముని ఈ దేశమునకు తోడ్కొని వచ్చుటకు నేను ప్రయత్నించెదను. నా కోర్కెలన్నియు నీవు తీర్చినచో ఈ పనిని చేసేను.' అని చెప్పగనే ఆరాజు మంత్రులకు 'ఆమె కోరికలను తీర్చుడని ఆజ్ఞయిచ్చెను. మంత్రులామెకు రత్నములు, ధనము ను ఇచ్చిరి.

"అప్పుడా వృద్ధవేశ్య రూపయౌవన సంపన్నులైన స్త్రీలను కొందరిని వెంటబెట్టుకుని వనమునకు పోయెను. ఒక నావపైన సుందరమగు నాశ్రమమును నిర్మించెను. దానిని పుష్పలతాదులతో సుందరముగా నలంకరించెను. ఋష్యశృంగుడు ఆశ్రమములో నున్న జాడతెలుసుకొని ఆ వృద్ధాంగన, వేశ్యలలో తన వలెనే అతి కుశలురాలైన తనకూతురును మున్యాశ్రమమునకు పంపెను. ఆమె అచటికి పోయి యతనిని చూచి, "మునీ! మీ కందరికి కుశలమా? మీ తపస్సు నిర్విఘ్నముగా సాగుచున్నదా? నిన్ను చూచుటకే నేనిక్కడికి వచ్చితిని' అని యనెను. అదివిని ఋష్యశృంగుడు, 'బ్రహ్మన్! నీవు మహాప్రకాశమానుడవై కనపడు చున్నావు. మహాత్ముడవగు నీకు పాదవందనముచేసెదను. నిన్ను పూజించి యాతిథ్యమిచ్చెదను. లేడి చర్మము పరచిన యీ కుశాసనముపైన కూర్చొనుము. నీ యాశ్రమమెక్కడ? నీ పేరేమి? దేవతలవలె ప్రకాశించుచున్న నీవు ఏ తపోవ్రతముచేయుచున్నావు' అనెను. ఆ మాటకు వేశ్య, మునీశ్వరా! ఈ పర్వతమునకు అవల మూడు యోజనముల దూరములో నా యాశ్రమముకలదు. నా ధర్మము ప్రకారము, నీవు నాకు అభివాదము చేయకూడదు. నీవిచ్చు పాద్యాదులను నేను స్పృశించకూడదు. నీకే నేను నమస్కారము చేసి పూజచేయవలెను. ఇది మా ధర్మము. నా వ్రతము ప్రకారము నీవు నన్ను ఆలింగనము చేసుకొనవలెను' అని యనెను. అప్పుడు ఆ ముని 'అనేక వన్య ఫలములను నీకు ఇచ్చెదను. ఆతిథ్యమును స్వీకరింపుము' అనెను. అది విని వేశ్యాంగన ఆ పండ్లను తీసికొనక తనవద్దనున్న అమూల్యభక్ష్య పదార్థములను ఫలములను అతనికి ఇచ్చెను. తరువాత ఆమె అతనికి అమూల్యాభరణములు వస్త్రములు, మాల్యములు, ఉత్తమములగు పానీయములను ఇచ్చి తృప్తిపరచెను.

"తరువాత ఆమె అతనియెదురుగా బంతియాట ఆడుచు తన ముఖ్యాంగములను అతనికి స్పష్టముగా కనబరచుచు అతనిని పలుమార్లు ఆలింగనము చేసుకొనెను. ఇట్లు అనేక హావభావ నృత్యములచేత అతనిని చాలప్రలోభ పరచెను. అతనిలో వికారము కలిగినట్లు ఆమె కనిపెట్టి అతని శరీరమును పలుసార్లు పినుకుచు అగ్నిహోత్రము చేయవలెనను నెపముతో ఆమె అతడు చూచు చుండగా వెడలిపోయెను.

"ఆమె వెడలిపోయిన తరువాత ఋష్యశృంగుకు ఆమెయందు అనురాగముగలవాడై వికలుడుగా నుండెను ఆమెనే తలచుచు నిట్టూర్చు చుండెను. అంతలో నచటికి విభాండక మహాముని వచ్చెను. అట్టి అవస్థలో నున్న పుత్రుని చూచెను. 'నాయనా నీవిట్లు దీనుడవై యేల ఉన్నావు? నేడు నీ వద్దకు ఎవరు వచ్చియుండిరి' అని యడిగెను. ఆ మాట విని ఋష్యశృంగుడు అతనితో "నేడొక మహాముని వచ్చియుండెను సువర్ణవర్ణము గలిగియుండెను. జడలు ధరించి యుండెను. దేవతవలె ప్రకాశించు చుండెను. రూప సౌందర్య శోభితుడగు నతడు సూర్యునివలె తేజరిల్లుచున్న బంగారు త్రాడు కంఠమలో ధరించి యుండెను. కంఠము క్రిందుగా మనోహరములై రోమములులేని రెండు పిండములుండెను. మధ్యము వంగి, పెద్ద కటిప్రదేశముగలిగి, నడుముచుట్టు సువర్ణమేఖలయుండెను. అతని చేతులకు, పాదములకు ధ్వనించుచున్న ఆభరణములుండెను. అతడు ఆడుచుండగా ఆయాభరణములు కూజించుచుండెను. అట్టి రూపముగాని, వస్త్రాభరణములుగాని నాకులేవు. అతి సుందరముగా నున్న యతని ముఖము నా మనస్సును ఆహ్లాద పరచెను. గండు కోయిలవలె ఇంపుగా మాట్లాడిన అతని వాణి నా యంతరాత్మను కలతపెట్టెను. వసంత ఋతువులో మలయ మారుతము సోకి లతలు ఆడినట్లుగా అతడు నాట్యమచేసెను. రెండుగా చీలి సుసంస్కృతములుగా అతని జటలుండెను. అతడొక ఫలమును (బంతిని) చేతబట్టుకొని యుండెను. దానినతడు మాటిమాటికి భూమిపై కొట్టగానదిపైకిఎగురు చుండెను. అట్లతడు చేయుచున్నప్పుడతని శరీరము మనోహరముగా నుండెను. అట్లు ఆడుచు నతడు నలువైపుల తిరుగుచుండెను. వాయువుచేత, లతయూగిల్లు చున్నట్లుగా నతడు ఊగులాడు చుండెను. తండ్రీ! దేవతవలెనున్న ఆ బ్రహ్మచారిని చూచి నప్పుడు నా మనస్సులో ప్రేమ, ఆనందము కలుగుచుండెను. అతని యెడల నాకు ఆసక్తియు కలుగుచుండెను. పలుమార్లు నా శరీరమును ఆలింగనము చేసికొనెను. నా జటలు పట్టుకొని నా ముఖమును వంచి తన ముఖమును నా ముఖముపైన ఉంచి ఒక శబ్దముచేసెను. దానితోనాకు చాలా ఆనందమయ్యెను. నేనిచ్చిన ఫలములను అతడు గ్రహించలేదు. ఇది నా వ్రతమనెను. అతడు మధుర ఫలములను నాకు ఇచ్చెను. అవి మన ఫలముల వంటివికావు. అతి రుచ్యములుగా నుండెను. మధుర జలమును గూడ త్రాగుటకు నాకిచ్చెను. ఆనీరు త్రాగుచుండగా అత్యంత హర్షమును పొందితిని. నేను నిలుచుచున్నభూమి చలించు చున్నట్లు నాకపుడు తోచెను. అతడు ఉపయోగించిన మాల్యములను ఇక్కడనే వైచి వెడలిపోయెను. అప్పటినుండి నేను మైమరచిన వాడువలెనున్నాను. నా శరీరము దహించుచున్నట్లున్నది. అతని వద్దకే పోవుటకు ఇష్టపడుచున్నాను అతడు సర్వదా నా వద్ద నుండుటకు కోరుచున్నాను. తండ్రీ! అతనికడకే పోయెదను. అతని ఆ బ్రహ్మచర్య వ్రతమెట్టిది? అట్టి వ్రతమునే నేనుగూడ ఆచరించదలచు చున్నాను. అతనితోనే ఉండి సర్వదా అట్టివ్రతమును చేయగోరుచున్నాను. అతనిని చూడకున్నచో నా మనస్సు పరితపించుచున్నది" అని చెప్పెను. అది విని విభాండకుడిట్లనెను :—

"పుత్రా ఇటువంటి అద్భుత రూపములను ధరించి రాక్షసులు మన తపస్సును భంగ పరచుటకు వచ్చుచుందురు. పెక్కు ఉపాయములచేత వారు మనను ప్రలోభ పరచి పుణ్యలోకము నుండి మనను పదభ్రష్టుల జేయ జూచుచుందురు. వారిని మనము దగ్గరకు రానీయకూడదు. వారిని చూడగూడదు. వారు ఇచ్చు మాల్యాభరణాదులు అతి పాపములు, వానిని స్మరింపగూడదు. వారు రాక్షసులని" చెప్పి విభాండకుడు ఆ వేశ్యను వెతుకుటకు పోయెను. మూడు దినములు వెదకి తెలిసికొన జాలక తిరిగి ఆశ్రమమునకు వచ్చెను.

"విభాండకుడు ఫలమూలాదులను తెచ్చుటకు వనమునకు పోయిన అదను జూచి తిరిగి ఆ వేశ్యాంగన ఋష్యశృంగుని మోహపరచుటకు ఆశ్రమమునకు వచ్చెను. ఆమెను చూచిన వెంటనే ఆమె కడకు పోయి, నా తండ్రి తిరిగి వచ్చులోపల, నేను నీ ఆశ్రమమునకు నీతో వచ్చెదను' అనెను. వెంటనే అతనిని ఆమె తన నావపైకి తీసుకొనిపోయెను. అనేక హావ భావములచే అచటి అంగనలు అతనిని లోభపెట్టుచు నావను విడిచి నేరుగా అతనిని అంగరాజు వద్దకు తోడుకొని పోయిరి. అప్పుడా రాజు అతనిని నావనుండి దించి అచటి మైదానములో సంచరింప జేసి అచటనొక పెద్ద ఆశ్రమము నిర్మింపజేసెను. ఆ వనమునకు 'నావ్యాశ్రమము' అని పేరు పెట్టెను. అతనిని అంతఃపురములో నుంచెను. అంతటితో ఇంద్రుడు ఆ దేశములో వానలు కురిసెను.

"అప్పుడు లోమపాద మహారాజు పరిపూర్ణకాముడై 'శాంత' యను తన పుత్రిని ఋష్యశృంగునకు ఇచ్చి వివాహము చేసి అతనికి కోపము రాకుండు ఉపాయములను చేసెను. తరువాత తన రాజ్యములోని భూమి సాగుచేయించి పుష్కలముగా పంటలు పండించెను. ఆ రాజు రైతుల నందరిని పిలిచి యిట్లనెను :— 'ఒకవేళ విభాండక మహాముని తన పుత్రుని వెదకుచు మీ వద్దకు వచ్చి అడిగినతో అతనితో, 'ఇదంతయు నీ కొడుకు భూమియే. ఈ పశువులు గూడ అతనివే. మీ యాజ్ఞ నెరవేర్చెదము, సెలవిండు మీకు దాసులము' అని చెప్పుడు".

"విభాండకముని స్వాశ్రమమునకు తిరిగివచ్చి పుత్రుని గానక అతి క్రుద్ధుడై, 'యిది యంతయు లోమపాదుని చర్య అయి యుండునని తలచి వెంటనే 'చంపా' నగరమునకు పోయి అంగ రాజ్యమును దగ్ధము చేసెదనని నిశ్చయించి వెడలిపోయెను. ఆ దేశములోని ప్రజలు, రైతులు అతనిని చూచి మిక్కిలి ఆదరించి పూజించి ఆతిథ్యమిచ్చి శాంతపరచుచు వచ్చిరి. అట్లు సంతుష్టుడై యతడు అంగపతి వద్దకు పోయెను. అచట తన కొడుకును అతనితో మెరపువలె మెరయుచున్న కోడలగు శాంతనుగూడ చూచెను. పుత్రుడు అనుభవించుచున్న వైభవమును, ఆనందమును చూచి విభాండకుడు శాంతుడై కోపమునకు బదులు లోమపాదుని పై కృపజూపెను. ఋష్యశృంగుని చూచి, పుత్రా ! నీవు ఒక కొడుకును గని, లోమపాదుని యిష్టార్థములను తీర్చి తిరిగి వనమునకు రమ్ము' అనెను.

"తండ్రియాజ్ఞ ప్రకారమే ఋష్యశృంగుడు తనకర్తవ్యము అంగరాజ్యములో ముగించుకొని తిరిగి వనమునకు తండ్రికడకు పోయెను. అతనితో శాంతకూడ పోయి వారికి పరిచర్యలు చేయుచుండెను. అరుంధతి వసిష్ఠుని, లోపాముద్ర అగస్త్యుని, దమయంతి నలుని, శచీదేవి యింద్రుని, నారాయణియగు ఇంద్రసేన ముద్గల మహర్షిని, సీత రామచంద్రుని, ద్రౌపది మీ యైదుగురిని సేవించినట్లే శాంతగూడ సర్వదా ఋష్యశృంగుని ఆధీనములో ఉండి వనవాసముచేయుచు అతనిని సేవించుచుండెను."

అనిచెప్పి లోమశుడు, 'ధర్మజా! ఇదియే ఆ ఋష్యశృంగుని ఆశ్రమము. ఈ తీర్థములో స్నానముచేసి యితరతీర్థములను సేవించుటకు ముందుకు సాగిపొమ్ము.' అని చెప్పెను.

(సశేషము)

పాఠకుల లేఖలు

మీ (మా) ఆంధ్రప్రదేశ్ మాసపత్రికలో ఆరుద్రగారు వ్రాసిన "గాంధీ చరిత్ర — తోలుబొమ్మలాట" చదువుతుంటే కులపెద్దల మీద ఏవగింపు కలుగుతున్నది. తెల్లవారి నిరంకుశ పాలన నుండి స్వాతంత్ర్య సముపార్జనకు కంకణం కట్టుకున్న 'జాతిపిత'గా గాంధీజీ అందరికీ తెలుసుగాని, కులపెద్దల మాట పెడచెవిని పెట్టిన 'ధీశాలిగా' మీ పత్రిక ద్వారా తెలుసుకొని జాతిపిత గుణగణాలను గురించి హర్షిస్తున్నాను. బాల్యంలోనే హరిజన బాలుని స్నేహం చేసిన సంఘటన గాంధీజీ భవిష్యత్ జీవితానికి దర్పణంగా వున్నది.

ఇట్లు
పి. సూర్యనారాయణ
అనకాపల్లి

జూలై సంచిక చూశాను తృప్తికరంగా ఉంది. ఫొటోలు కమనీయ దృశ్యములై ఉన్నాయి. శివారెడ్డిగారి గేయమూ, ఆరుద్ర గారి తోలు బొమ్మలు పత్రిక్కి హైలెట్స్. "చైతన్య మూర్తులు" శీర్షికలో గొప్పవారి విషయాలు బాగున్నాయి. ఇక పోతే క్రొత్తరచయితలకు మీరు తగిన ప్రోత్సాహమూ, అవకాశాలూ కల్గజేయాలని కోరుచున్నాను.

రేణుశ్రీ
అనంతపురం—2

ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక జూలై, ఆగస్టు సంచికలలో ప్రచురించిన "తరాల తారతమ్యాలు" చాలా బాగున్నది. ఇటువంటి విజ్ఞాన విషయాలు మీ పత్రిక ద్వారా మా యువతరం వారికి అందజేసినందుకు మిమ్ముల అభినందించక తప్పదు.

ఇట్లు
ఆర్. శ్రీనివాసరావు
మహబూబునగరు




కేంద్ర విద్యా మంత్రి డా. వి. కె. ఆర్. వి. రావు జూలై 12 న హిందీ మహా విద్యాలయంలో విజ్ఞానశాస్త్రం-వాణిజ్యం విభాగానికి దీపం వెలిగించి ప్రారంభోత్సవం చేస్తున్న దృశ్యం




వెనుకబడిన కమిషన్ అధ్యక్షుడు శ్రీ కె. ఎన్. అనంత రామన్ జూలై 20 న ముఖ్య మంత్రికి వెనుకబడిన తరగతుల నివేదికను సమర్పిస్తున్న దృశ్యం


వార్తా చిత్రాలు




ముఖ్య మంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి జూలై 11 న జూబ్లీ హాలులో 'అణు శక్తి, అంతరిక్ష పరిశోధన'కు సంబంధించిన ప్రదర్శనకు ప్రారంభోత్సవం చేసిన అనంతరం ప్రదర్శనలో ఒక నమూనాను తిలకిస్తోన్న దృశ్యం



ముఖ్య మంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి జూన్ 16 న, ఉస్మానియా విశ్వ విద్యాలయానికి సంబంధించిన జర్నలిజం శాఖాధిపతికి స్వర్గీయ ఖాసా సుబ్బా రావు చిత్ర పటాన్ని బహూకరిస్తున్న దృశ్యం



ఆంధ్ర రాష్ట్ర చర్మకార సంఘ సమావేశానికి జూలై ౮వ ముఖ్యమంత్రి హైదరాబాదులో ప్రారంభోత్సవం చేశారు. చర్మకార సంఘం అధ్యక్షుడు శ్రీ బి. శ్రీనివాస రావుకూడా యీ చిత్రంలో చూడవచ్చు



ముఖ్య మంత్రి జూన్ 20 న హైదరాబాదులోని జూబ్లీహాలులో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శుల, గిరిజన పరిశోధనా, శిక్షణా సంస్థల అధిపతుల సమావేశానికి ప్రారంభోత్సవం చేశారు

వార్తాచిత్రాలు



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. టి. రాజు ఐ. సి. ఎస్. జూలై ౮ న అడ్మిరల్ నందాకు విందు భోజనం ఏర్పాటుచేశారు. ఈ విందుకు ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ అధ్యక్షులు శ్రీ ఎస్. ఎ. అయ్యంగార్ కూడా హాజరయ్యారు



ఉపముఖ్య మంత్రి శ్రీ కె.వి. నరసింగ రావు జూన్ 23 న హైదరాబాదులోని మానసిక వ్యాధులకు సంబంధించిన సంస్థను సందర్శించారు



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సిబ్బందికి సంబంధించిన సీనియారిటీ, నిర్ణాయక జీతం, తదితర విషయాలకు చెందిన ఇబ్బందులను పరిశీలించే నిమిత్తం కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన సంయుక్త కార్యదర్శుల బృందం జూన్ 10 న హైదరాబాదులో సమావేశమైంది.

రాయలసీమ సత్వరాభివృద్ధి

అనావృష్టికి నిలయమైన రాయలసీమ ప్రాంతం ఆర్థిక సత్వరాభివృద్ధికి యీ సంవత్సరం అదనంగా రూ 4 కోట్లు కేటాయించారు. ప్రస్తుత వార్షిక ప్రణాళిక క్రింద యీ ప్రాంతం అభివృద్ధికి నిర్దేశించిన రు. 14. 05 కోట్లకు అదనంగా యీ విధులను కేటాయించారు.

రాయలసీమలో కరువు నివారణకు దీర్ఘ కాలిక ప్రణాళికను రూపొందించే ఉద్దేశంతో రాయలసీమ ప్రణాళిక అభివృద్ధి మండలిని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మండలి ఏర్పడినప్పటి నుండి యీ ప్రాంతంలో వివిధరంగాలలో అభివృద్ధిని సాధించడానికిగల అవకాశాలు గూర్చి. పథకాలను గూర్చి పరిశీలిస్తున్నది. మండలి సూచనపై రాష్ట్రప్రభుత్వం 1970 మార్చిలో రాయలసీమ ప్రణాళిక అభివృద్ధిని గూర్చిన గోష్ఠి నిర్వహించింది. ఈ చర్చాగోష్ఠిలో వెల్లడి అయిన అభిప్రాయాలకు అనుగుణంగా రాయలసీమ ప్రాంత అభివృద్ధి నిమిత్తం బృహత్ప్రణాళికలు రాష్ట్రప్రభుత్వం రూపొందిస్తున్నది.

తక్షణచర్యగా ప్రస్తుత వార్షిక ప్రణాళిక క్రింద కేటాయించిన రూ. 14.05 కోట్లకుతోడు అదనంగా రూ. 4 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. రాయలసీమ ప్రణాళిక అభివృద్ధిమండలికి చెందిన కార్యనిర్వాహక సంఘం 1970 మార్చిలో సమావేశమయి ప్రభుత్వం మంజూరుచేసిన అదనపు నిధుల వినియోగము గూర్చి పరిశీలించి, దిగువ తెలిపిన వివిధ కార్యక్రమాలకు నిధులను కేటాయించింది.

గ్రామీణ విద్యుదీకరణ

రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలో, ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో తలసరిసగటు విద్యుచ్ఛక్తి వాడకంచాలా తక్కువగా ఉన్నది. రాష్ట్రంలోని ఇతరప్రాంతాలతో సమంగా అభివృద్ధి పరచడానికి ప్రత్యేకమైన పథకాలను అమలు జరపాల్సిన అవసరం ఉంది. నాలుగవ ప్రణాళికా కాలంలో రాయలసీమలో 1200 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయాలని ప్రతిపాదించారు. 1970_71 లో రూ.4 కోట్లమొత్తంనుండి గరిష్ఠ పరిమితిలో 1.95 కోట్లు గ్రామీణ విద్యుదీకరణకు కేటాయించారు.

సేద్యపు నీటిపారుదలకు ప్రాముఖ్యత ఇచ్చి రూ. 43.25 లక్షలు కేటాయించారు. రక్షిత గ్రామీణ మంచినీటిసరఫరా పథకాలకు రు 37.25 లక్షలు కేటాయించారు.

పరిశ్రమలు

ఈ ప్రాంతంలో ఖనిజ సంపద_ముఖ్యంగా ముండి యినుము బాగాలభిస్తుంది. ఆస్బెస్టాస్‌కు అనంతపురం, కడప జిల్లాలుముఖ్య కేంద్రాలు. అనేకప్రాంతాలలో మేలిరకం బంకమన్ను, స్లేట్‌రాయి లభిస్తుంది. ఈప్రాంతంలోని అనేకమందివ్యవసాయంతోపాటుచేనేత, సిల్కునేత, పట్టుపరిశ్రమ, ప్రత్తి, పూలతివాచీలు,నూనెపరిశ్రమ ఇత్తడి సామాగ్రి, చేతిగాజులు, వెదురు పనులు వంటి కుటీర లఘుపరిశ్రమలను నిర్వహిస్తున్నారు. ఈప్రాంతంలోని పారిశ్రామిక వనరులను వినియోగించడానికి వీలుగాప్రస్తుత సంవత్సరంలో రు.6 లక్షలు కేటాయించారు.

బడుగువర్గాల అభివృద్ధికి రు. 20 లక్షలు కేటాయించడం యీకార్యక్రమాలలో ప్రత్యేక అంశంగా పేర్కొనవచ్చు. ఈ కార్యక్రమాలన్నిటిని అమలు జరిపినప్పుడు ఆర్థిక రంగంలో రాయలసీమ గమనార్హమైన అభివృద్ధిని సాధించగలుగుతుంది.

తెలుగుసీమ

రాజ రాజ నరేంద్రు_రాజ్యపాలనయందు
యాంధ్ర వైభవ దీప్తి యలరినటుల
కాకతీయుల పతాకాంచల చ్ఛాయలో
తెలుగు ప్రజలు హాయి దేలినటుల
రాయల సామ్రాజ్య_రామ రాజ్యము నందు
లలిత కళల వెల్గు_వెలలి నట్టుల

ఖడ్గతిక్కనార్యు కరవాల కాంతిలో
ఆంధ్ర తేజద్యుతు లలరినటుల
నాటి మహనీయ విభవంబు దీటుగాగ
తీర్చి దిద్దగ వలయు నీ తెలుగు సీమ
తెలుగు బిడ్డల ఐక్యత నిలిపి మరల
వెలుగు బాటలో నడిపింప వలయు నేడు

వి. బ్రహ్మానందం.

"దేశభక్త"

కొండా వెంకటప్పయ్య

—ఎన్. జి. రంగా



కలకత్తా కాంగ్రెసు మహాసభలో భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణానికి అంగీకరించిన తరువాత ఆంధ్ర సంఘం ఆంధ్ర ప్రాంత కాంగ్రెసు సంస్థగా మారింది. అప్పుడు "దేశభక్త" కొండా వెంకటప్పయ్య పంతులు సహజంగానే ఈ సంస్థ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం, సాంబమూర్తి, సీతారామ శాస్త్రి, ఆంధ్రరత్న, డా. పట్టాభి, ముట్నూరి కృష్ణారావు, దేశోద్ధారక నాగేశ్వరరావు, కాశేశ్వరరావు, ఉన్నవ వంటి ఉద్దండులు ఆయనకు సన్నిహితంగా వచ్చి ముఖ్య సహచరులయ్యారు. వీరందరూ కలిసి, 1921–22లో సహాయ నిరాకరణ, పన్నులనిరాకరణ మొదలైన సత్యాగ్రహోద్యమకార్యక్రమాలు ముమ్మరంగా సాగిన కాలంలో ఆంధ్రులకు శక్తివంతమైన, ఉత్తేజపూరితమైన నాయకత్వాన్ని ప్రసాదించారు.

1920 పూర్వపు మద్రాసు శాసన మండలి సభ్యుడుగా కొండా వెంకటప్పయ్యగారు, అప్పుడప్పుడే వర్ధిల్లుతున్న పౌర గ్రంథాలయోద్యమానికి తొలిగ్రాంటు పొందడంలో కృతకృత్యులయ్యారు. మళ్ళీ శాసనసభ్యుడు కావటానికి ఆయన 1936 వరకూ వేచివుండవలసివచ్చింది. ఆ హోదాలో ఆయన బీదప్రజల, రైతుల పక్షాన నిలిచారు. ప్రజాజీవితంలో ఉన్నత ప్రమాణాలను పరిరక్షించడానికి పాటుపడ్డారు.

మాంట్‌ఫోర్డ్ సంస్కరణల ననుసరించి జరిగే మొదటి ఎన్నికలో అభ్యర్థిగా నిలిచిన కొండా వెంకప్పయ్యగారు, గాంధీజీ ఆదేశానుసారం తమ అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకున్నారు.

సహాయ నిరాకరణోద్యమం సందర్భంలో, నూతనంగా ఏర్పాటైన ఆంధ్ర ప్రాంత కాంగ్రెసు సంఘం అధ్యక్షునిగా వెంకటప్పయ్య గారు బాగా ఖ్యాతిలోనికి వచ్చారు. ఈయన ఆశీస్సులతోనే పెదనందిపాడు ప్రాంతంలో కీ. శే. పర్వతనేని వీరయ్య నాయకత్వం క్రింద పన్నుల నిరాకరణోద్యమం ప్రారంభమైంది. ఈ ఉద్యమం సందర్భంలో "దేశభక్త" ను అరెస్టు చేసినప్పుడు, గాంధీ మహాత్ముడు, ఈ ఆంధ్రనాయకుడు తన ఉద్యమాన్ని స్వాతంత్ర్య పథంలో మరింత ముందుకు తీసుకొని వెళ్ళారని హర్షం వెలిబుచ్చారు.

వెంకటప్పయ్యగారు ఆంధ్ర ప్రజలకు రాజకీయ అంశాలను గురించిన పరిజ్ఞానం కలిగి చదలచారు. ప్రజల మాతృభాష అయిన తెలుగు ఉత్తమ గ్రంథాలను వెలువరించడానికి తోడ్పడదలచారు.

మచిలీపట్నంలో "కృష్ణా పత్రిక" ను స్థాపించడంలో డాక్టరు పట్టాభి, ముట్నూరు కృష్ణారావుగారలతో సహకరించారు. ఆ పత్రికకు తొలి సంపాదకులయ్యారు. ఆయన ఆంధ్రోద్యమాన్ని గురించి ఒక చిన్న పుస్తకం వ్రాశారు. ఆగ్నేయ యూరపు ప్రజల (అప్పుడు బాల్కనులని వ్యవహరించబడేవారు) స్థానిక భాషలను, సాహిత్యాలను అభివృద్ధి పరచడం ద్వారా అక్కడ జాతీయస్థాయిలో అభివృద్ధిని ఏ విధంగా సాధిస్తున్నదీ వివరించారు. ప్రజా జీవితానికి సంబంధించిన వివిధ అంశాలపై తెలుగులో మంచి పుస్తకాలను విరివిగా ప్రచురించడంలో ఆయన కె. వి లక్ష్మణరావు, ఆచంట లక్ష్మీపతి, దేశోద్ధారక ప్రభృతులతో సహకరించారు.

కొండా వెంకటప్పయ్యగారు గుంటూరు జిల్లా, (ప్రస్తుతం ఒంగోలు జిల్లా) ఒంగోలుతాలూకాలోని ఏడుగుండపాడులో జన్మించారు. ఇది కర్షకోద్యమానికి ఆటపట్టుగా రూపొందింది.

భారత దేశానికి స్వాతంత్ర్యం లభించినప్పుడు నేను ఆంధ్ర ప్రాంత కాంగ్రెసు కమిటీ అధ్యక్షుని హోదాలో వెంకటప్పయ్య గారిని కలుసుకొని ఆయనకు అభినందనలు తెలియజేశాను. వార్ధక్య భారంతో కృంగిపోతున్నప్పటికీ ఆయన కళ్లలో కాంతి గోచరించింది. శుష్కించిన దేహం ఉద్రేకంతో కదలాడింది. ఆయన హీన స్వరంలో వెనుకటి గాంభీర్యం ధ్వనించింది.

వెంకటప్పయ్యగారు భావోద్రేకంలో ఆంధ్రుల లక్ష్యాన్ని పుణికిపుచ్చుకున్నారు. ఎనభై సంవత్సరాలుదాటి దాదాపు కదలలేని స్థితిలో వున్నప్పటికీ ఆయన ప్రకాశం విషయంలో నెహ్రూను, సర్దార్‌కు నచ్చజెప్పటానికి ఢిల్లీదాకా వెళ్లారు.

నెల్లూరు జైలులో దేశభక్త, దేశోద్ధారక, రాజాజీలతో కలిసి వున్నప్పుడు వారు అక్కడ గడిపిన నిరాడంబరమైన, మార్గదర్శకమైన జీవితాన్ని చూసి నేను ముగ్ధుడనయ్యాను. యువకరక్తంతో సహనాన్ని కోల్పోయి తోటి కార్యకర్తలు ఏమన్నా అతే పట్టించుకునేవారుకారు. తోటి కార్యకర్తల శ్రేయస్సు విషయంలో వారి మధ్య భిన్నాభిప్రాయాలకు తావులేదు. వారు మన జాతీయ నాయకులలో అగ్రశ్రేణికి చెందినవారు. వెంకటప్పయ్యగారికి ప్రజాస్వామ్యంలో అచంచలమైన విశ్వాసం వుండేది.

1936_39 లో మద్రాసు రాష్ట్రంలో తొలి కాంగ్రెసు మంత్రివర్గం అధికారంలో వున్నప్పుడే వెంకటప్పయ్యగారు ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి పట్టుపట్టారు. జవహర్ - వల్లభాయ్ - పట్టాభి నివేదికలో, పూర్తిగాకానీ, పాక్షికంగాకానీ మద్రాసు రాజధానిగా ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి సంబంధించిన ప్రసావన లేకపోవడం వల్ల ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్షునిగా విజయవాడలో నేను ఏర్పాటు చేసిన నిరసన సభకు అధ్యక్షత వహించడానికి ఆయన తన అస్వస్థతను సైతం లెక్కచేయకుండా ఓపిక చిక్కబట్టుకొని వచ్చారు. ఆయన 84 సంవత్సరాల నిండు జీవితం గడిపి తనువు చాలించడానికి పూర్వమే ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం జరిగివుంటే ఆయన ఆత్మ ఎంతో సంతృప్తి జెంది వుండేది పొట్టి శ్రీరాములు గారిని ఆంధ్ర రాష్ట్ర నిర్మాతగా ఎలా మనం గౌరవిస్తున్నామో దేశభక్త వెంకటప్పయ్యగారిని అఖిలభారత జనకుడుగా కీర్తిస్తున్నాము. వెంకటప్పయ్యగారు ఉదారస్వభావుడు. దూరదృష్టి కలిగినవాడు. జాతీయస్థాయిలో నాయకత్వం సంపాదిస్తున్న తన సహచరులకు ఆయన హృదయపూర్వకంగా చేయూతనిచ్చి ప్రోత్సహించారు.

మన రాజకీయ జీవితం ఉన్నత నైతిక సూత్రాలకు కట్టుబడివుండాలనీ, మంత్రులు యితర రాజకీయ నాయకులు ఆదర్శప్రాయులుగా వుండాలనీ వెంకటప్పయ్యగారు అభిలషించారు. ఆయన నిసలైన గాంధేయవాది.

వెంకటప్పయ్యగారు, కంట్రోళ్ల వ్యవస్థపట్ల తమ నిరసన తెలియజేస్తూనూ, అవినీతిపట్ల, నైతికస్థాయి పడిపోతుండడంపట్ల తమ ఆవేదనను వెల్లడిస్తూనూ బాపూజీకి వ్రాసిన జాబు జ్ఞప్తి కుంచుకొనదగినది. కొండా వెంకటప్పయ్యగారు దేశానికి చేసిన హెచ్చరికతో గాంధీజీ ఏకాభిప్రాయాన్ని ప్రకటించారు ఆ విషయాన్నే ఆయన ఒక ప్రార్థనా ప్రసంగంలో చెప్పారుకూడా.

1934 లో నిడుబ్రోలులో రైతు సంఘం తొలి సమావేశానికి వెంకటప్పయ్యగారు ప్రారంభోత్సవం చేశారు. ఆ సందర్భంలో నేను 1934లో ప్రచురించిన ఆధునిక రాజకీయ సంస్థలు అనే గ్రంథాన్ని ఆయనకు అంకితం చేశాను. ★

తెలంగాణా పితామహుడు

శ్రీ కె. వి. రంగారెడ్డి అస్తమయం

అకలంక దేశభక్తుడు, తెలంగాణా పితామహుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి శ్రీ కొండా వెంకట రంగారెడ్డి గారు 1970 జూలై 24 వ తేదీన హైదరాబాదులో కాలధర్మం చెందారు. తుది క్షణం వరకు తన ప్రజాభ్యుదయ చింతనలో జీవితం గడిపిన మహాపురుషుడు శ్రీ రెడ్డిగారు.

శ్రీ రెడ్డిగారు 1891 డిశెంబరు 10 వ తేదిన హైదరాబాదు జిల్లాలోని ధర్మసాగర్ గ్రామంలో జన్మించారు. హైదరాబాదులో 'లా' పరీక్షలో ఉత్తీర్ణులైన తరువాత 1909 లో మహబూబ్‌నగర్ లో న్యాయవాదిగా ప్రాక్టీసు పెట్టారు.

19 6_37, 1938_39 సం॥లలో మాజీ హైదరాబాదు లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో సభ్యులు. శ్రీ రంగారెడ్డిగారు 1950 లో పార్లమెంటు సభ్యులై 1952 వరకు ఉన్నారు. శ్రీ బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలో రెవిన్యూ మంత్రిగా పనిచేశారు.

1956 లో ఆంధ్రప్రదేశ్ అవతరణానంతరం శ్రీ సంజీవరెడ్డి మంత్రి వర్గంలో హోమ్‌మంత్రిగా పనిచేశారు. శ్రీ కళా వెంకటరావు మరణానంతరం తిరిగి రెవిన్యూ శాఖను స్వీకరించారు. శ్రీ డి. సంజీవయ్య మంత్రివర్గంలో వీరు ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు,

మాజీ హైదరాబాదు సంస్థానంలో రెవిన్యూ మంత్రిగా ఉండగా భూసంస్కరణలను ఆమలు జరపడానికి కృషిచేసారు వీరి హయాంలో వేలాది ఎకరాలు పేదలకు పంచిపెట్టబడ్డాయి. వక్ఫ్ ముస్లిం చట్టం ఆమోదించబడడానికి వీరు చాలావరకు కారకులు శ్రీ రెడ్డిగారు తెలంగాణా ప్రాంతీయ సంఘంలో ముఖ్య పాత్ర వహించారు శ్రీ రెడ్డిగారు 1950 లో తెలంగాణా కాంగ్రెసు కమిటీ అధ్యక్షులుగా, ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కమిటీ అధ్యక్షులుగా కూడా పనిచేశారు.

చైతన్యమూర్తులు



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్

జననం: సెప్టెంబరు 5, 1888

ఆనాటి మధురాపురం రాధాకృష్ణుడు తత్వవేత్త, ఆచార్యుడు, రాయబారి, రాజకీయ చతురుడు. నామసామ్యమే కాక జీవిత సామ్యం కూడా గల ఈనాటి సర్వేపల్లి రాధాకృష్ణుడు తత్వవేత్త, ఆచార్యుడు, రాయబారి, రాజకీయ ధురంధరుడు. ప్రాచీన ఆధునిక విజ్ఞాన సర్వస్వాన్ని ఆపోశనం పట్టిన ఆధునిక అగస్త్యుడు రాధాకృష్ణన్. హృదయాన్నీ, మేధస్సునూ రెండు గుర్రాలుగా చేసి జీవన రథాన్ని నడిపించే మహాసారథి. వక్తగా, రచయితగా సమ్మానం పొందిన సవ్యసాచి.

ఆచార్యునిగా ఉండినప్పుడు రాజకీయాలలో ప్రత్యక్షంగా పాల్గొనకపోయినా ఆంగ్లేయ పాలనలోని అవకతవకలను నిర్భయంగా విమర్శించడంలో వెనుదీయలేదు. ఆక్స్ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఆచార్య పీఠాన్ని అధిష్ఠించడానికి పయనమైనప్పుడు మాతృభూమి వియోగానికి వేడికన్నీరు విడిచిన దేశాభిమాని. ఆంగ్లదేశంలో స్థిరనివాసం ఏర్పరచుకో వలసిందిగా అభ్యర్థించబడినా దానిని అంగీకరించని దేశభక్తుడు.

ఆధ్యాత్మికంగా ఆకాశమంత ఎత్తు ఎగిరినా దంతపుమేడ కట్టుకొని అక్కడే ఉండిపోక భూమికి దిగివచ్చి దివ్యమైన లౌకిక జీవనం గడిపిన కర్మయోగి రాధాకృష్ణుడు.

రాజకీయ రాయబారిగా ఆయన ప్రతిభ ప్రశంసితమైనది. రష్యా నియంత స్టాలిన్ దర్శనం అంతర్జాతీయ ప్రముఖులకే అపురూపమైపోయింది. ఏ రాయబారికీ దర్శనమియ్యని స్టాలిన్ రాధాకృష్ణుని రెండుసార్లు సమ్ముఖానికి రప్పించుకున్నారు. రాధాకృష్ణుడు రాయబారి పదవిలో చేరినప్పుడు ఆయనకు స్టాలిన్‌తో ఒకగంట సమావేశం జరిగింది. అప్పుడు భారత రాయబారి రష్యానియంతతో అన్నమాటలు: "మా దేశంలో అశోకుడనే చక్రవర్తి ఉండేవాడు. యుద్ధంలో జయంపొంది కూడా మరి యుద్ధాలు చేయనని సన్యాసి అయ్యాడు. మీరు దౌర్జన్యంలో ఈదుకొని అధికారంలోకి వచ్చారు. మీ గతి ఏమవుతుందో ఎవరు చెప్పగలరు?" ఆనాడు కౌరవసభలో పాండవ రాయబారి కృష్ణుడు పలికిన వజ్రకఠోరమైన నిష్ఠుర వాక్యాలకు ప్రతిధ్వనులవంటివి కావా భారత రాయబారి రాధాకృష్ణుడు రష్యానియంత స్టాలిన్‌తో అన్నమాటలు!

రాధాకృష్ణుడు భారతదేశానికి తిరిగివచ్చేటప్పుడు మరొక్క సమావేశమైంది. ఆయన స్టాలిన్ చెక్కిలినొక్కి వీపుతట్టి శిరస్సు మీదుగా తన హస్తాన్ని చాచాడు. అంతటి స్టాలిన్ ద్రవించిపోయాడు. "నన్ను రాక్షసునిగా కాక మానవునిగా ఆదరించినవారు మీరొక్కరే. మీరు వెళ్ళిపోతున్నందుకు నాకు విచారంగా ఉంది. మీరు చిరకాలం జీవించాలని నా కోరిక. నేను ఇక అట్టే కాలం బ్రతుకను." అన్నాడు స్టాలిన్. ఆ చతురత, నిర్భయత, నిస్సంకోచం రాధాకృష్ణునికే చెల్లు.

రాష్ట్రపతిగా తన దేశీయులను ఉద్దేశించి ప్రసంగించినప్పుడు కూడా ఆయనలో ఈనిష్కాపట్యమూ, ఈ నిర్మొగమోటమూ కనిపిస్తాయి. "మనం భోజనం చేస్తాం. బట్టలు ధరిస్తాం. సౌఖ్యాలు అనుభవిస్తాం. ఈ సామగ్రిని ఉత్పత్తి చేసేవారు దుర్భరమైన ఆర్థికస్థితిలో, అనారోగ్యమైన పరిసరాలలో క్రమశః చస్తూఉంటే మనకు సహజంగా కలిగే సానుభూతిని అణిచివేసుకొంటూ ఉన్నాం. ఎందుచేత? అలాంటి అనుభూతివల్ల మనకు ప్రతిఫలం ఏమీ ఉండదు కనుక."

విజ్ఞాన భాస్కరునిగా విరాజిల్లుతున్న ఈ విద్వాంసుని తేజస్సు మన అంధకారాన్ని పోగొట్టుగాక!

త్రిపురనేని గోపీచంద్

(జననం : సెప్టెంబరు 8, 1910)

"నాకు జీవితం మీద ఆశఉంది కాని తెలివిగా బ్రతకడం చేతకాదు. బంధాలు చుట్టుకొంటూ వెడుతూ ఉంటే ఊపిరి సలపని పరిస్థితి వస్తుంది. అందరూ ఆశలు వదలుకొన్నప్పుడు ఒక అద్భుతం జరుగుతుంది. ఎవరో ఒకరు వీపుమీద చరుస్తారు. నేను తుళ్లిపడి లేస్తాను. ఒళ్ళు విరుచుకుంటాను. ఈ విదిలింపుల జల్లులే నా పుస్తకాలు." అంటాడు గోపీచంద్.

"కవనార్థం బుదయించినాము సుకవితాకార్యంబె మావృత్తి" అన్నారు తిరుపతి కవులు. రచన కోసమే పుట్టాడు. రచన కోసమే బ్రతికాడు గోపీచంద్. జీవన భృతి కోసం ఆయన ఏ వృత్తి (ఉద్యోగం) చేసినా ఆయన అసలు వృత్తి రచన. ఆయన

అసలు జీవనం రచన. జీవితాన్ని సాహిత్యంగా సానబట్టి సాహిత్యమే జీవితంగా గడిపిన జిజ్ఞాసువు గోపీచంద్.

ఆయన కథానికలలో, నవలల్లో, వ్యాసాలలో ఉన్నతమైన భావనాశక్తి, నిశితమైన పరిశీలనా శక్తి మనస్తత్వ వివేచనం విశేషంగా కనిపిస్తాయి. సాహిత్యాన్ని సంఘ శ్రేయస్సు కోసం సాధనంగా వినియోగించిన విశిష్ట రచయిత గోపీచంద్.



గాడిచర్ల హరి సర్వోత్తమ రావు

(జననం : సెప్టెంబరు 14, 1883)

“దేశభక్తి దుష్టుని అంతిమ ఆశ్రయం” అన్నాడు ప్రఖ్యాత ఆంగ్ల పండితుడు జాన్సన్. దేశభక్తి సజ్జనుని ప్రథమ ధర్మం అని భావించాడు హరి సర్వోత్తమ రావు.

రాజమహేంద్రవరములో విద్యార్థిగా ఉన్నప్పుడే పావన గోదావరి సలిలాలలో అవగాహనంచేసి దేశభక్తిలో మునకలువేసిన తెలుగుడాయన. గౌతమ మధుర శీతల జలాలను సేవించి ప్రజాసేవాసక్తినీ సాహిత్యానురక్తినీ సంతరించుకున్న సాత్వికుడాయన.

ప్రముఖ జాతీయ నాయకుడు, ప్రసిద్ధవక్తయైన బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసాలు విన్న ప్రజలకూ, విద్యార్థులకూ ఆవేశం కలిగింది. రాజమండ్రి కళాశాల ప్రధానాధ్యాపకుడు మార్క్ హంటర్ ఔద్ధత్యాన్ని విరసించి సమ్మె చేశారు. వారికి హరి సర్వోత్తమ రావు నాయకుడు. ఆయన ఆంధ్ర దేశములోని విద్యార్థులకు నాయకుడయ్యాడు. అప్పటి మదరాసు రాజధానిలోని తిరునల్వేలిలో అమాయకులైన ప్రజలపై పోలీసులు కాల్పులు జరపగా సర్వోత్తమ రావు తన తెలుగు మాస పత్రిక స్వరాజ్యలో బ్రిటీషు పాలకుల ద్వేషత్వాన్ని ఖండించినందుకు ఆయనకు మూడు సంవత్సరాల కఠిన శిక్ష పడింది. ఆయనే ఆంధ్రలో మొదటి రాజకీయ ఖైదీ. తరువాతి కాలంలో రాజకీయ ఖైదీలకు కల్పింపబడ్డ జైలు సౌకర్యాలు ఆ కాలంలో లేవు. ఆ నాటి కారాగారాలు భూలోక నరకాలు. ఆయన జైలులోపడిన బాధ వర్ణనాతీతం.

వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్నందుకున్న ఆయనకు ఉద్యోగార్హత లేకుండా చేసింది బ్రిటిషు ప్రభుత్వం. ముప్పై ఏళ్ళ తరవాత మన ప్రభుత్వం ఆ నిషేధాన్ని తొలగించింది. ఐతేనేమి ఆ ముప్పై ఏళ్ళలోకాని ఆ తరవాత కాని ఆయన ఉద్యోగం చేయలేదు. స్వయంగా కృషి వల్లనే జీవనం గడిపారు.

అనిబెసెంట్ స్థాపించిన హోమ్ రూల్ లీగ్‌కు ఆంధ్ర రాష్ట్ర కార్యదర్శిగానూ, ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసుకు కార్యదర్శిగానూ, భారత కాంగ్రెసు సంఘంలో సభ్యునిగాను ఇంకా ఎన్నో విధాల రాజకీయ సేవ చేశాడాయన.

ఇక సాహిత్యాది సేవ. ఆంధ్ర దిన పత్రికకు ఆయన ప్రథమ సంపాదకుడు. విజ్ఞాన చంద్రికా మండలిలో పని చేశాడు. కొమర్రాజు లక్ష్మణరావు ఆంధ్ర విజ్ఞాన సర్వస్వంలోనూ ఆ తరవాత తెలుగు భాషా సమితి ప్రచురించు విజ్ఞాన సర్వస్వంలోను ఆయన కృషి ఎంతో ఉంది.

మదరాసులో పాకీ పనివారి సంఘానికీ, అచ్చుపనివారి సంఘానికి అధ్యక్షునిగావుండి కార్మిక సంక్షేమానికి పాటుపడ్డారు. కర్నూలు జిల్లా ప్రతినిధిగా మదరాసు శాసన సభలో సభ్యునిగా వుండి రైతుల శ్రేయస్సుకోసం కృషి చేశారు.

ఆయన పని చేయని ప్రజాహితరంగం లేదనే చెప్పాలి. సహకారం, పంచాయతీ వ్యవస్థ, పత్రికా రచన, నాటక కళ, వ్యవసాయం, పశుపోషణ, కార్మిక పారిశ్రామిక రంగాలు, ప్రయోజన విద్య, గ్రంథాలయోద్యమం — అన్నింటిలోను ఆయన చేసిన సేవ అకుంఠితం.

ఆయన అకుతోభయుడు. ఆత్మాభిమాని, ఖండితవాది. అనిబెసెంట్, గాంధీజీవంటివారితో కూడా అభిప్రాయభేదంవచ్చినపుడు నిష్కర్షగా వాదించగల ధీశాలి. చివరివరకూ కర్మయే ఆహారంగా, సేవమే బలవర్ధకౌషధంగా సేవించిన స్థిరసంకల్పుడు సర్వోత్తమ రావు.



గురజాడ అప్పారావు

(జననం : సెప్టెంబరు 21, 1862)

ప్రాచీన కాలంలో ఋష్యాశ్రమంలో వాల్మీకి నోటి నుంచి అనుష్టుప్ఛందస్సు ఆవిర్భవించింది. అర్వాచీనకాలంలో ఆనంద

గజపతి సంస్థానంలో గురజాడ నోటినుంచి మౌక్తిక ఛందస్సు (ముత్యాల సరం) జాలువారింది.

ప్రాచీన సంస్కృత వాఙ్మయంలో వాల్మీకి ఆది కవి. అర్వాచీన ఆంధ్ర సాహిత్యంలో గురజాడ ఆది కవి. గీర్వాణ కవితా శాఖ మీద అరూఢమై వాల్మీకి కోకిల రామ భక్తిని రంజింపజేసింది. తెలుగు కోయిల పాట వినండి

ఆకులందున అణగిమణగీ
కవిత కోకిల పలుకవలెనోయ్
పలుకులను విని దేశమం
దభిమానములు మొలకెత్తవలెనోయ్.

కరుణ రస పోషణలో కన్నాకు అని ఖ్యాతి పొందినవాడు భవభూతి. అప్పారావు కన్యక, పుత్తడి బొమ్మ పూర్ణమ్మ గేయకథలు చదివితే, వింటే ఎవరిహృదయంకరిగి పోదు?

పట్నమేలే రాజు పోయెను
మట్టి కలిసెను కోట పేటలు
పదం పద్యం పటి నిలిచెను
కీర్తులపకీర్తుల్.

*   *   *

కన్నుల కాంతుల కలవల చేరెను
మేలిమి చేరెను మేని పసల్
హంసల జేరెను నడకల బెడగులు
దుర్గను చేరెను పూర్ణమ్మ.

శృంగార రసం తెలుగు కవుల పెరటి బావుల నిండా దండి దండిగా లభిస్తుంది. మరి హాస్యరసం అక్కడక్కడ మందుకు దొరికినట్లు దొరుకుతుంది. కన్యాశుల్కం హాస్యరసానికి తరిగి పోని చెలమ.

కడుపుబ్బించే ఘట్టాలు ఆ నాటకంలో ఒకటా రెండా?

కథానికా రచనకు ఒరవడి పెట్టిన కీర్తి కూడా గురజాడదే.

తెలుగు జాతికి మేలుకొలుపు పాడుతూనే గురజాడ ఏభై మూడు ఏళ్ళ వయస్సులో శాశ్వతంగా నిద్రపోవడం దౌర్భాగ్యం.



చిలకమర్తి లక్ష్మీనరసింహం
(జననం: సెప్టెంబరు 26, 1867)

కన్నుల చిమ్మచీకటిలో బంగారు పంట పండించిన సాహితీ కర్షకుడు చిలకమర్తి.

ఆయన రచించిన గయోపాఖ్యాన నాటకం ఏనాడో లక్ష ప్రతులకు పైగా అమ్ముడుపోయిన గ్రంథం. ఇలాంటి సౌభాగ్యం ఎన్ని తెలుగు పుస్తకాలకు లభించింది? "అల్లుడా రమ్మని ఆదరం బున బిల్వ బంపు మామనుబట్టి చంపగలమె!" లాంటి, అందులోని పద్యాలు ఒకనాడు తెలుగునేల నాలుగు మూలలా మారుమోగాయి.

వివిధ సాహిత్య ప్రక్రియలను చేపట్టి పది సంపుటాలు వ్రాయడం అలా ఉంచి స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఆయన ఉపన్యాసాలతో, పద్యాలతో ప్రజలను ఉద్రూత లూగించి ఉత్తేజితులను చేసిన సందర్భాలు చిరస్మరణీయాలు.

చెరసాలల్ పృథుచంద్రశాలలె యగున్
చేదోయి గీలించు న
య్యర దండల్ విరిదండ లయ్యెడును
హేయంబైన చోడంబలే
పరమాన్నం బగు మోటకంబళులు దాల్పన్
పట్టు సెల్లా లగున్
స్థిరుడై యే నరు డాత్మదేశమును భక్తిం
గొల్చు నవ్వానికిన్.

చిలకమర్తి సంస్కర్త. సంఘ సేవకుడు. హరిజనోద్యమం బయలుదేరడానికి ఎంతో పూర్వమే 1909లో హరిజనుల కోసం ఒక పాఠశాలను స్థాపించాడు. సంఘ దురాచారాలను దుయ్యబట్టాడు. సంస్కరణోద్యమంలో వీరేశలింగానికి నమ్మిన శిష్యునిగా పని చేశాడు.

చిలకమర్తి ఆత్మాభిమాని. పేద ఐనా స్వాతంత్ర్య ప్రియుడు. అవి వందేమాతరం రోజులు. ఆయన దేశమాత అనే పత్రికను ప్రచురించేవాడు. ప్రభుత్వాన్ని విమర్శించకుండా ఉండేటట్లు ఆయనకు తొమ్మిదివేల రూపాయలు ఇస్తామని అధికారులు ఎరచూపారు. ఐనా ఆ మహనీయుడు డబ్బుకు ఆశపడి తన వాక్స్వాతంత్ర్యాన్ని అమ్ముకోలేదు.

అంధత్వమూ, ఇతర అంగవైకల్యంతో పాటు పేదతనం కూడా పీడిస్తూ ఉన్నా ఆయన ఎంతో సాహిత్య సేవ, సంఘసేవ, దేశ సేవ చేశాడు.

అవసాన దశలో ఆయన దారిద్ర్యాన్ని అనుభవిస్తూ మిత్రుల ఆదరణతో ఎలాగో కాలంగడిపి తనువు చాలించడం బాధాకరమైన విషయం.

నవాబ్ దీన్ యార్ జంగ్
(జననం: సెప్టెంబరు 26, 1893)

అరేబియాలోని ఉపద్రవాన్ని తట్టుకోలేక కొందరు ముస్లిములు భారత దేశానికి వలస వచ్చారు, 14 వ శతాబ్దిలో. వారి సంతతి వాడైన మౌల్వీ ఇద్రిస్ 18 వ శతాబ్దంలో నెల్లూరులో

స్థిరనివాసం ఏర్పరుచుకున్నాడు. ఆయన కుమారుడు అబ్దుల్లా ఒంగోలు దురాధిపతిగా ఉండేవారు. ఆయన నాల్గవ తరంవాడు అలీ ఉద్దీన్ అహ్మద్_నవాబ్ దీన్ యార్ జంగ్‌గా ప్రఖ్యాతి పొందినవాడు.

మానవసేవ

అలీ ఉద్దీన్ నిజామ్ ప్రభుత్వంలో డెప్యూటీ కలెక్టరుగా నియమింపబడి ట్రైనింగుకు బళ్లారి వెళ్లాడు. అప్పుడు అక్కడ ప్లేగు వ్యాధి ప్రబలింది. ఉద్యోగమూ, అధికారమూ అని గర్వపడకుండా అలీ ఉద్దీన్ రోగులకు సేవచేశాడు. 'దేవదూత' అని ప్రశంస పొందాడు. తోటి ఉద్యోగులు భయంకర వ్యాధి అని భయపెట్టినా రోగులను చూడవలసిన బాధ్యత తనది కాదని వారించినా ఆ యువకుడు వినలేదు. కష్టంలో ఉన్నవారికి సేవ చేయడమే తన కర్తవ్యం అన్నాడు. ఆయన తరవాతి కాలంలో ఏపదవిలో ఉన్నా ఉద్యోగ ధర్మంతోపాటు మానవసేవాధర్మం కూడా నిర్వహించేవాడు.

అలీ ఉద్దీన్ రెవెన్యూశాఖలోనూ, న్యాయశాఖలోనూ పని చేశాడు. తరవాత ధర్మాదాయ శాఖకు డైరెక్టరయ్యారు. ఈ శాఖలో పనిచేయడం వల్ల వివిధ మతాలకే కాక వివిధ వర్గాల వారికి కూడా సేవచేసినట్లువుతుందని ఆయన విశ్వసించాడు. ఇటికలూ సున్నంతో కట్టిన దేవాలయాలనూ, మసీదులనూ, చర్చిలనూ, గురుద్వారాలనూ కాపాడి వాటి వ్యవహారాలను పరిశీలించడమేకాదు వివిధ వర్గాలమధ్య సామరస్యాన్ని నెలకొల్పడం కూడా తన శాఖ ధర్మం అని ఆయన ఉద్బోధించాడు.

హజ్రత్ యూసుఫ్ సాహెబ్ హజ్రత్ శరీఫ్ సాహెబ్‌ల దర్గా, జామామసీదు, మక్కామసీదు మొదలైన ముస్లిమ్ పవిత్ర స్థలాల విషయంలోనే కాక సీతారామ్‌బాగ్, చిక్కడపల్లి, యాదగిరిగుట్ట మొదలైన చోట్లగల హిందూ దేవాలయాల సమానమైన శ్రద్ధ వహించి అన్ని సంస్థలను విషయాలలో కూడా అభివృద్ధి పరిచాడు దీన్ యార్ జంగ్.

ఆయన పోలీసు శాఖాధిపతిగా ఉండినప్పుడు రజాకారుల ఉపద్రవంలో ఎంతో నేర్పుతో, ధైర్యంతో వ్యవహరించి అల్లరులు జరగకుండా చాలా కృషి చేశాడు.

పోలీసు చర్య తరావాత మేజర్ జనరల్ చౌధరీ ఆధిపత్యంలో దీన్ యార్ జంగ్ రెవెన్యూ పోలీసు శాఖలను పర్యవేక్షించే సభ్యునిగా నియమింపబడాడు.

భారత దేశాన్ని మాతృదేశంగా చేసుకొని ఇస్లామ్ బోధించే శాంతి సౌభ్రాత్రాలకు దోహదం చేస్తూ ప్రజాసేవ చేయడమే ఆయన ఆశయం. స్వాతంత్ర్యం రాకముందు సంస్థానాలలో అధికారులు ప్రభువు ఆదరాన్నీ ప్రజల అభిమానాన్నీ కూడా చూరగొనడం అంటే అసిధారావ్రతమే. అట్టి అసిధారావ్రతాన్ని సాధించినవాడు దీన్ యార్ జంగ్.

-కల్యాణసింగ్

సురవరం ప్రతాపరెడ్డి

పత్రికా రచయితగానూ, నవలా రచయితగానూ, చరిత్ర విమర్శకునిగానూ ఖ్యాతి గాంచిన కీ. శే. సురవరం ప్రతాపరెడ్డి గారు మహబూబ్‌నగర్ జిల్లా, ఆలంపురం తాలూకాలో ఇటిక్యాలపాడు గ్రామంలో 1896 జూన్ 24 వ తేదీన జన్మించారు.

నిజాం కళాశాల (అప్పుడిది మద్రాసు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా వుండేది) లో గ్యాడ్యుయేషను పూర్తిచేసిన తరువాత లా డిగ్రీ పుచ్చుకునే నిమిత్తం మద్రాసు వెళ్ళారు. హైదరాబాదుకు తిరిగి వచ్చిన తరువాత న్యాయవాద వృత్తి ప్రారంభించారు. అయితే ఆనాటి స్థానిక పరిస్థితులూ, రాజకీయాలూ ఆయన దృష్టిని ఆకర్షించాయి. అంతే కాక తెలుగు సాహిత్యం పట్ల ఆయనకు మంచి అభిరుచి ఏర్పడింది. ఫలితంగా న్యాయవాద వృత్తిని విడిచిపెట్టి 1925 వ సంవత్సరంలో "గోల్కొండ పత్రిక" అనే ఏకైక తెలుగు పత్రికను ద్వైవార సంచికగా ప్రారంభించారు. అనేక సంవత్సరాలపాటు సేవచేసిన పిమ్మట ఈ పత్రిక దురదృష్టవశాత్తు నిలిచిపోయింది. రెడ్డి విద్యార్థి వసతి గృహం, గ్రంథాలయం ప్రతాపరెడ్డిగారి దూరదృష్టికీ, ఆయన జరిపిన నిర్విరామ కృషికీ సజీవ తార్కాణాలుగా నిలిచివున్నాయి.

"గోల్కొండ పత్రిక" ద్వారా రాజకీయ రంగంలో తమ లక్ష్యాలను సాధించడమే కాకుండా, తెలుగు సాహిత్యానికీ, ప్రజల సాంఘిక, సాంస్కృతిక వికాసానికీ అమోఘమైన సేవలుచేయడం ద్వారా ప్రతాపరెడ్డిగారు తెలంగాణా ప్రజల అభిమానాన్నీ, విశ్వాసాన్నీ చూరగొన్నారు.

"పోలీసు చర్య" జరిగిన వెంటనే శ్రీ ప్రతాపరెడ్డి, "ప్రజావాణి" అనే పత్రికను ప్రారంభించారు. అయితే అనేక కారణాలవల్ల ఆ పత్రిక ప్రచురణ ఆగిపోయింది.

1927 లో నిజామాబాదులో జరిగిన ప్రథమ ఆంధ్ర మహాసభకు ఆయన అధ్యక్షులుగా ఎన్నికైనారు. ఆంధ్ర మహాసభకు సంబంధించిన అన్ని విషయాలు ప్రజలముందు బహిరంగంగా చర్చలు జరగాలని ఆయన పట్టుదల వహించారు.

1952 లో జరిగిన ప్రథమ సార్వత్రిక ఎన్నికలలో వనపర్తి నియోజకవర్గంనుండి హైదరాబాదు శాసనసభకు ఆయన ఎన్నికైనారు.

శ్రీ ప్రతాపరెడ్డి పేరులేని, ఆయనకు సంబంధంలేని యే సంస్థగానీ, ఉద్యమంగానీ లేదంటే అతిశయోక్తి యేమీకాదు. తెలంగాణాలో యిప్పుడు అభివృద్ధి దశలో ఉన్న అన్ని సంస్థలు ఆయన సలహా సంప్రదింపులతోనే ప్రారంభమైనాయి

పెదపాలెంలో జరిగిన ఆంధ్రగ్రంథాలయ మహాసభలకు ఆయ్యన అధ్యక్షత వహించారు. ఆంధ్ర గ్రంథాలయ ఉద్యమానికి ఆయన తన జీవితాంతమూ కృషిచేశారు. 1940 లో ప్రచురించబడిన తన "గ్రంథాలయోద్యమం" అనే పుస్తకంలో యీ విషయాలను ఆయన విపులంగా వివరించారు.

ఆంధ్రసారస్వత పరిషత్తు స్థాపనకు ఆయన మూలకారకుడు. 1944_45 లో యీ సంస్థ అధ్యక్షులుగా కూడా ఆయన వ్యవహరించారు. హైదరాబాదు ఆయుర్వేద సంఘం అధ్యక్షులుగా ఉండగా ప్రత్యేకమైన కొన్ని రోగాలకు ఆయుర్వేద వైద్యం ఎంత అమోఘంగా పనిచేసేదో తెల్పుతూ అనేక కరపత్రాలను ఆయన ప్రచురించారు.

వాస్తవమైన నాయకునిగా, ప్రముఖ పత్రికా రచయితగా, నవలాకారుడుగా శ్రీ సురవరం ప్రతాపరెడ్డి పేరు చిరస్థాయీగా నిలిచి ఉంటుంది. ★

హైదరాబాదు అందాన్ని పెంచిన నెహ్రూ జూలాజికల్ పార్కు

"నిజంగా యిదొక సుందరసీమ. చక్కగా, ఎంతో ఆదర్శ వంతంగా దీన్ని అభివృద్ధి చేశారు. జంతువుల్ని చాలా చక్కగా ఉంచారు. ఈ పార్కును యింత చక్కగా అభివృద్ధి పర్చినందుకు అటవీ శాఖాధికారిని, యితర అధికారులనూ అభినందిస్తున్నాను." అన్నారు భారత రాష్ట్రపతి శ్రీ వి.వి. గిరి గారు, 1969 అక్టోబరులో యిక్కడ వన్యప్రాణి సప్తాహానికి ప్రారంభోత్సవంచేస్తూ.

నిజానికి నెహ్రూ జంతుప్రదర్శన శాల పని 1959 లోనే ప్రారంభమయినప్పటికీ 1963 అక్టోబరులో మాత్రమే ప్రజలు సందర్శించడానికి వీలుగా దీనిని తెరిచారు. ఈ పార్కు అర్ధ చంద్రాకారపు ఆర్చీల అందమైన గట్టుతో అత్యంత మనోహరంగా కనిపించే మీర్ ఆలం చెరువును ఆనుకొని, ప్రకృతి రమణీయతకు నిలయమైన కొండలతో గుట్టలతో, చిట్టడవితో మూడువందల ఎకరాల మేరకు విస్తరించి వుంది. చారిత్రాత్మకమైన చార్‌మినార్‌కు రెండు కిలో మీటర్ల దూరంలోనే వున్నదిది. ప్రస్తుతం భారత దేశంలో వున్న యీమాదిరి పార్కులలో యిదే పెద్దది.

జంతువులు, పక్షులు

ఈ జంతుప్రదర్శనశాలలో 202 రకాలకు చెందిన మొత్తం 1,600 జంతువులు, పక్షులు వున్నాయి. ప్రకృతిని ప్రేమించే సౌందర్యోపాసకులకు కళ్ళకు అడుగడుగునా యిక్కడ విందు భోజనమే. ఎక్కడచూసినా స్వతస్సిద్ధంగా పెరిగిన తరుల తాగుల్మాలు నీటి మడుగులు! ఇక్కడ అడవి జంతువుల్ని వాటి పరిస్థితులకు, స్వభావాలకు అనుగుణంగా స్వేచ్ఛగా తిరగడానికి వీలుగా విశాలమైన ప్రాంగణాలలో ప్రకృతి మధ్య స్వతస్సిద్ధమైన పరిసరాలను కృత్రిమంగా సృష్టించి వుంచారు.

పెద్దపులుల్ని, నీటిగుర్రాన్ని, సింహాలని యిదే మాదిరి ప్రాంగణాలలో వుంచారు. స్వతస్సిద్ధమైన అడవి మధ్య అవి వున్నట్లు అనిపించడానికై కృత్రిమంగా గుట్టలు, గుహలు కట్టి, గడ్డిదుబ్బుల్ని, చెట్ల గుబురుల్ని పెంచారు. చూసేవారికి అవి నిజంగా అడవి మధ్యనే వున్నట్లు అనిపించక మానవు.

ఈ జంతు ప్రదర్శన శాలలో ప్రత్యేకించి చెప్పుకోదగిన జంతువులు అనేకంవున్నాయి. ప్రత్యేకంగా మనదేశంలో మాత్రమే వుండే మచ్చల చిరుతపులులు, చెల్లెక్క ఎర్రని పండాలు, ఎర్ర కంగారు జంతువులు, దేశవిదేశాలకు చెందిన రంగురంగుల పక్షులు, రకరకాల కోతులు, పాములు, యింకా ఎన్నెన్నో రకాల జంతువులు, పక్షులు వున్నాయి. భారతదేశంలోని ఒకేఒక కారెనుము జంట (వరంగల్లు అడవులలో పట్టినది) యీ జూలో వుంది.


పిల్లల విభాగం


ఈ విభాగంలో పిల్లలు ఆడుకోవడానికి ఉయ్యాలలు, జారుడు బల్లలు వున్నాయి. పిల్లలు అడవి జంతువుల మీద ప్రేమను పెంచుకోవడానికి వీలుగా వారు ఆడుకోదగ్గ సాధు జంతువులు, పెంపుడు జంతువులు కొన్నింటిని కూడా యిక్కడ ప్రదర్శిస్తున్నారు. సాయంకాలపు వేళల్లో ఏనుగు సవారీ, ఒంటె సవారీ ఏర్పాట్లు వున్నాయి. ఇక్కడ ఒక మేక రిక్షాలో కూర్చొని వుండగా మరో మేక రిక్షా తొక్కడం-యిక్కడి ప్రత్యేక ఆకర్షణ. పిల్లలు ఆడుకోడానికి వీలుగా ఒక రైలు కూడా వుంది. అందంగా అలంకరించబడ్డ యీ రెండు టన్నుల బరువుగల రైలు పార్కుచుట్టూ బ్రిడ్జీలమీద నుంచి, సొరంగాలలోంచి ప్రయాణం చేస్తుంది. దీన్ని భారత రైల్వేల వారు బహుమతిగా యిచ్చారు.


ఇరవై మంది విహారయాత్రికులకు కావలసిన కనీస అవసరాలతో కూడిన చక్కటి హౌస్‌బోట్లు రెండు మీర్ ఆలం చెరువులో ఏర్పాటు చేశారు. రోజుకు 15 రూపాయిలు మాత్రమే ఇందుకు చెల్లించవలసి వుంది. ఇవి కాక సరదాగా విహరించడానికి మోటారు లాంచీలు కూడా వున్నాయి. అన్ని హంగులతో కూడిన రెండు అతిథి గృహాలు సైతం యీ చెరువు వడ్డున ఉన్నాయి. సరసమైన ధరలకు వీటిని అద్దెకిస్తారు. వెదురు బొంగులతో కలపగృహాన్ని కూడా యిటీవల నిర్మించారు. ఇది కూడా అతిథిగృహంగా వుపయోగిస్తుంది. పట్టణంలో వినిపించే నాగరిక యంత్రాల రణగొణ ధ్వనికి, కంగారుకూ దూరంగా యిక్కడ ప్రశాంతంగా, హాయిగా గడిపి వెళ్ళడానికి అనువైన ప్రదేశమిది.

మరొక ఆకర్షణ

ఇక్కడి నేచరల్ హిస్టరీ మ్యూజియం ఒక ప్రత్యేక ఆకర్షణ. చక్కగా సహజ పరిస్థితులను సృష్టిస్తూతయారుచేసినపెద్ద పెద్దఅద్దాలబీరువాలల్లో, చనిపోయినరకరకాల జంతువుల్ని వుంచారు. నిజంగా ప్రాణంవున్న జంతుల్లా భ్రమకలుగుతుంది. ఇది కాక ఎక్వేరియం ఒకటి వుంది. అరుదైన 24 రకాలకు చెందిన చేపలను యిక్కడ ప్రదర్శిస్తున్నారు. ఈ జూకి అనుకునివున్న మీర్ ఆలం చెరువు రాతిగోడ సైతం చూడ్డానికి అందంగా వుంటుంది. దీనికి కట్టిన గోడ అర్ధచంద్రాకారంలో ఆర్చీలు ఆర్చీలుగా (21 ఆర్చీలు) వుంది. ప్రపంచంలో యీమాదిరి ఆర్చీల గట్లు చాలా అరుదుగా వున్నాయి. దీని పొడవు 3,390 అడుగులు, ఎత్తు 40 అడుగులు. జూలో అక్కడక్కడ ఎత్తయిన చోట్ల వర్షానికి ఎండకు రక్షణగా అందమైన "షెల్టర్లు" నిర్మించారు. అక్కడ నుండి చూస్తే మీర్ ఆలం చెరువు, జంతుప్రదర్శనశాల అత్యంత మనోహరంగా కనుపిస్తాయి. ఈ ప్రదర్శనశాలలో వివిధరకాల మొక్కలను చెట్లను పెంచుతున్నారు. రోజూ యీ ప్రదర్శనశాలకు 1500—2000 మందివరకూ జనం వస్తుంటారు. ఆదివారాల్లోనూ, శెలవు రోజుల్లోనూ దగ్గరదగ్గర ఏడువేల మందయినా వస్తుంటారు. సగటున సంవత్సరానికి ఎనిమిది నుంచి పది లక్షల వరకు ప్రజలు ఈప్రదర్శన శాలను తిలకిస్తుంటారు. —రాజా







నెహ్రూ జూలాజికల్ పార్క్

1600 జంతువులకు పైగా గల యీ పార్కు భారతదేశమంతటిలో పెద్దది. ఏటేటా సుమారు 10 లక్షల మంది ప్రజలు ఈ పార్కుకు వచ్చి పోతుంటారు.

1969 అక్టోబరులో రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి పార్కును సందర్శించి దాని నిర్వహణను ప్రశంసించారు.

ఎదుటి పేజీపై భాగంలో : చూడడానికి వచ్చిన వారికోసం నిర్మించిన కరర్రి భవనం.

నగరంలో

అభ్యుదయ సాహిత్య సదస్సు

నగరంలోని సాంస్కృతిక సంస్థ, సెవెన్‌స్టార్స్ సిండికేట్ దశమ వార్షికోత్సవ సందర్భంగా జూలై 4, 5 తేదీలలో హైదరాబాదులోని జూబ్లీహాలో అభ్యుదయ సాహిత్య సదస్సు జరిగింది. సదస్సును ప్రారంభిస్తూ శ్రీ తాపీధర్మారావు గారు అభ్యుదయ సాహిత్య ఉద్యమ లక్ష్యాలను వివరించారు. సమాచార, పౌరసంబంధ శాఖామాత్యులు శ్రీ అక్కిరాజు వాసుదేవరావు గారు సభికులకు స్వాగతం పలికారు. ప్రఖ్యాత సినీనటుడు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు సమావేశానికి అధ్యక్షత వహించారు.

కథానిక, నవల, కవిత, నాటకం, సాహిత్య విమర్శ అనే అయిదు విభాగాలుగా సాహిత్య గోష్ఠులు ఏర్పాటు చేయబడినవి మొదటి రోజున కథానికల గోష్ఠిలో శ్రీయుతులు పాలగుమ్మి పద్మరాజు, ఆర్. ఎస్. సుదర్శనం గార్లూ, నవలమీద గోష్ఠిలో శ్రీయుతులు మహీధర రామమోహన రావు, నవీన్, మంజుశ్రీ గార్లు పాల్గొన్నారు. 5వ తేదీ ఆదివారం జరిగిన కవితాగోష్ఠిలో శ్రీయుతులు పురిపండా, ఆరుద్ర, సోమసుందర్, కుందుర్తి సి. నారాయణరెడ్డి, సుప్రసన్న, అరిపిరాల విశ్వం గార్లు తమ ప్రసంగ వ్యాసాలు చదివారు. సాయంత్రం నాటకాలపై జరిగిన గోష్ఠిలో శ్రీయుతులు కె. యల్. నరసింహారావు, గొల్లపూడి మారుతీరావు ప్రభృతులూ, సాహిత్య విమర్శ గోష్ఠిలో శ్రీయుతులు ఏటుకూరి బలరామమూర్తి, సంపత్‌కుమారాచార్య అద్దేపల్లి రామమోహన రావు, నూతలపాటి గంగాధరం, తిరుమల రామచంద్ర, తుమ్మల వెంకట్రామయ్య, నిడమర్తి ఉమారాజేశ్వరరావు ప్రభృతులూ పాల్గొన్నారు.

కథానిక గోష్ఠికి శ్రీ గోరాశాస్త్రి, నవల గోష్ఠికి శ్రీ పాలగుమ్మి పద్మరాజు, కవిత గోష్ఠికి శ్రీ విద్వాన్ విశ్వం, సాహిత్య విమర్శ గోష్ఠికి శ్రీ ఆవుల సాంబశివరావు గార్లు అధ్యక్షత వహించారు.

ముఖ్యమంత్రి విజ్ఞప్తి

4వ తేదీ సాయంత్రం 6–30 గంటలకు శ్రీ దేవులపల్లి రామానుజరావు అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగింది. కవులకు యథోచిత సత్కారం చేయబడింది. 5వ తేదీన రాత్రి సమాచార శాఖ ఆధ్వర్యంలో గాంధీ చరిత్ర–తోలుబొమ్మలాట ప్రదర్శనం జరిగింది. అంతకుముందు, సాయంత్రం 5–30 గంటలకు ఆనంద నిలయంలో ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారు సభకు విచ్చేసిన రచయితలను కలుసుకొని తేనీటి విందుచేశారు. ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ జాతీయ సమైక్యత, పరస్పర అవగాహన మొదలగు విషయములను గురించి రచయితలు ప్రజలలో నిరంతరం చైతన్యం కల్గించడానికి పాటు పడాలని విజ్ఞప్తి చేశారు.




ప్రణాళికా సంఘం సభ్యుడు శ్రీ ఆర్. వెంకట్రామన్ జూన్ 19 న హైదరాబాదులో ముఖ్యమంత్రిని కలుసుకున్నారు



మహారాష్ట్ర గవర్నరు నవాబ్ అలియవార్ జంగ్ జూన్ 19 న జూబ్లీ హాలులో భారత-మధ్య ప్రాచ్య, ఆఫ్రికా దేశాల స్నేహ సంఘానికి ప్రారంభోత్సవం చేశారు



ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీ ఎన్. రమేశన్, ఐ. ఎ. ఎస్. హైదరాబాదులోని నృపతుంగ హైస్కూలులో సైన్స్ ఎగ్జిబిషన్‌కు ప్రారంభోత్సవం చేశారు



స్విట్జర్లాండ్ రాయబారి డా. ఎ. ఆర్. లిండ్ జూన్ 24వ హైదరాబాదులో ముఖ్య మంత్రిని కలుసుకున్నారు

అణుశక్తి, అంతరిక్ష పరిశోధన ప్రదర్శన

అణుశక్తిశాఖ వారు, రాష్ట్ర సమాచార, పౌరసంబంధ, యాత్రికశాఖ సహాయంతో హైదరాబాదులోని జూబ్లీహాల్‌లో 1970 జూలై 11వ తేదీనుండి రెండు వారాలపాటు అణుశక్తి, అంతరిక్ష పరిశోధనల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి యీ ప్రదర్శనకు ప్రారంభోత్సవం చేశారు.

అణుశక్తికి సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు అందజేయడానికీ, మానవ జీవనంలో దాని ఉపయోగాన్ని గురించీ అంతరిక్ష పరిశోధనలలో సాధించిన విజయాన్ని గురించీ ప్రజలకు తెలియజేయడానికీ యీ ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. అహ్మదాబాదులోని భౌతిక పరిశోధన లెబొరెటరీ, తిరువేంద్రం లోని తుంబా రాకెట్ల ప్రయోగకేంద్రం, యితర అంతరిక్ష పరిశోధన కేంద్రాలలో జరిగినకృషిని, వాటి కార్యక్రమాలను గూర్చి యిక్కడ ప్రదర్శించారు. అణుశక్తి అంతరిక్ష పరిశోధన కార్యక్రమాల ఫోటోలు, నమూనాలు, పరికరాలను కూడా ప్రదర్శించారు. ఈ ప్రదర్శన నిర్వహణకాలంలో అణుశక్తి, అంతరిక్ష పరిశోధనలకు సంబంధించిన చలన చిత్రాలను ప్రదర్శించారు.

విహార పర్యటనలు

భారత ప్రభుత్వానికి చెందిన యాత్రికాభివృద్ధి సంస్థవారు, హైద్రాబాదు నగరంలోని దర్శనీయ స్థలాలను సందర్శించగోరే యాత్రికుల సౌకర్యార్థం లగ్జరీకోచ్‌లను ప్రవేశపెట్టారు. శుక్రవారాలు మినహా మిగతా అన్నిరోజులలోనూ ఈ శకటాలు నడుపుతారు. ఈ సంస్థవారు అన్ని ఆదివారాలలో నాగార్జునసాగర్ ఆనకట్ట వద్దకు కూడా శకటాలను నడుపుతారు. కంట్రాక్టు బుకింగులకు కూడా లగ్జరీకార్లు, కోచ్‌లు లభిస్తాయి. హైద్రాబాదులోని రాష్ట్ర సమాచార, పౌరసంబంధ, యాత్రిక శాఖ డైరెక్టరు కార్యాలయంలో భారత యాత్రికాభివృద్ధి సంస్థ ఇంచార్జి ఆఫీసరువద్ద అడ్వాన్సు బుకింగ్ చేయాలి.

గ్రంథ సమీక్ష

రచన

విలువలు*బాధ్యతలు*దృక్పథాలు

"మారుతున్న విలువలు - రచయితల బాధ్యతలు" గోష్ఠి సందర్భంగా చదువబడిన ప్రత్యేక వ్యాసాల సంకలనం. నిర్వహణ: యువ భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, 5, కింగ్స్‌వే, సికింద్రాబాద్-3. పేజీలు 267. వెల: ఐదు రూపాయలు.

"మారుతున్న విలువలు-రచయితల బాధ్యతలు" అనే అంశంగురించి హైదరాబాదు నగరంలో యువభారతి సంస్థవారి ఆధ్వర్యాన జులై 26 వ తేదీన జరిగిన గోష్ఠిలో పాల్గొన్న ప్రముఖ రచయితలు చదివిన వ్యాసాలను 'రచన' అనే పేరుతో చక్కని సంపుటిగా వెలువరించారు. ఇటువంటి గోష్ఠులు ఎన్ని జరిగినా, అప్పటి చర్చలు, వ్యాసాలు మొదలైనవి గాలికిపోకుండా యీ విధంగా రికార్డు చేయడం అనే ఆచారం చాలా మంచిది. చివరకు మిగిలేది యిదే. ఈ విధంగా చేసినందువల్ల గోష్ఠికి సంబంధించిన చర్చలు కేవలం ఆనాడు సభకు విచ్చేసినవారికి మాత్రమే కాకుండా యావదాంధ్రదేశంలోని పాఠకులకు అందే అవకాశం వుంది. కాబట్టే యిటువంటి ప్రయత్నాలు మంచివి అనడం. జులై నెల మొదటి వారంలో హైదరాబాదు జూబ్లీహాల్లో రెండురోజుల పాటు జరిగిన అభ్యుదయ సాహిత్య సదస్సులో చదివిన సుమారు 40 వ్యాసాలనుకూడా "నవత" ప్రత్యేక సంచికగా ప్రకటిస్తామని దాని నిర్వాహకులు సెవెన్ స్టార్స్ సిండికేట్ సంస్థవారు అన్నారు. ఆ బాపతు ఒక అడ్వర్‌టైజ్‌మెంటుకూడా 'రచన'లో వున్నది. ఆ సంకలనంకూడా త్వరలోనే వెలుగుచూస్తుందని ఆశిద్దాం.

ఇటీవల రెండు మూడు సంవత్సరాలుగా తెనుగు దేశంలో సాహిత్య రంగంలో సంచలనం ఎక్కువగావుంది. ముఖ్యంగా దిగంబర కవులు రంగం మీదికి వచ్చింతర్వాత అభ్యుదయ కవిత్వాన్ని గురించిన చింతన, విప్లవాత్మకమైన క్రొత్త కవితా రీతుల కోసం అన్వేషణ ప్రారంభమైంది. దిగంబర కవులు యీ సందర్భంగా చేసిన కృషిని గురించి వాదోపవాదాలుకూడా ఎక్కువగానే జరిగాయి. వీటన్నిటి పర్యవసానంగానే 'అభ్యుదయ సాహిత్య సదస్సు', 'మారుతున్న విలువల సదస్సు' జరిగాయని అనుకోడానికి ఆస్కారంలేకపోలేదు. ఎందుకంటే సాహిత్యపు విలువలనుగురించి పునరాలోచించుకోవాలనే స్పృహ సాహిత్యవేత్తలలో ఎక్కువయింది.

విలువలు ఎప్పటికప్పుడు, కాలానుగుణంగా మారుతుంటాయని గానీ, అవి సాహిత్యంలో ప్రతిబింబిస్తుంటాయనిగానీ ప్రత్యేకంగా ఎవరూ చెప్పనవసరంలేదు. ఇది అందరూ అంగీకరించే సత్యమే. అయినా అసలు సాహిత్యపు విలువలు అంటే ఏమిటి, అవి మారినాయా, ఎప్పుడు మారినాయి, మారిన ఆ విలువలు మన సాహిత్యంలో ఏవిధంగా ప్రతిఫలించాయి అనే వివిధ విషయాలు సమగ్రంగా ఆలోచించుకుంటేగాని తేలేవికావు. స్థూలంగా అనుకోవడంవేరు, సూక్ష్మంగా పరిశీలనచేసి నిర్ణయించడంవేరు. అభిప్రాయ భేదాలు ఎన్ని వున్నప్పటికీ, సాహిత్యవేత్తలలో ప్రముఖులైనవారు ఆలోచించి చెప్పేమాటలకు ఎప్పటికైనా విలువ వుంటుంది. ఆ విధంగా చూస్తే యువ భారతి సంస్థవారు చేసిన కృషి మెచ్చుకోదగినది. 'రచన' ప్రకటనద్వారా వేలాది పాఠకులలో సాహిత్య పరమైన ఆలోచనలను రేకెత్తించినందుకు వారిని అభినందించక తప్పదు.

'రచన' రెండు భాగాలుగా ప్రకటించారు. మొదటి భాగంలో శ్రీయుతులు ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్య, సంజీవదేవ్, ఆర్. యస్. సుదర్శనం, డా. దివాకర్ల వెంకటావధాని, కె. వి. రమణారెడ్డి, అక్కిరాజు వాసుదేవరావు, యం యన్ రావ్, మంజుశ్రీ, డా. సుప్రసన్న, శశాంక, డా. కేతవరపు రామకోటి శాస్త్రి, కొడవటిగంటి, కాశోజీ, గోరా శాస్త్రి ప్రభృతులు వివిధ అంశాలమీద రాసిన వ్యాసాలువున్నాయి. రెండవ భాగంలో శ్రీయుతులు కపిల కాశీపతి, పాములపర్తి సదాశివరావు, పోతుకూచి, కుందుర్తి, సంపత్కుమార, శీలా వీర్రాజు, పురాణం సుబ్రహ్మణ్య శర్మ, గొల్లపూడి మారుతీరావు డా. అరిపిరాల విశ్వం, పన్యాల, నార్ల చిరంజీవి, శ్రీమతులు సి. ఆనందారామం, కె. రామలక్ష్మిగార్లు రాసిన వ్యాసాలు వున్నాయి. వ్యాస విషయాలలో మామూలుగా వివిధ సాహిత్య ప్రక్రియలకు సంబంధించి మారుతున్న విలువలను గురించిన చర్చలే కాక, రచయితల సంఘాలు, గ్రంథాలయాలు, పాఠకులు, ప్రచురణ కర్తలు, భాష, రేడియో, సినిమా, వార్తా పత్రికలు మొదలగు అంశాలకు సంబంధించిన రచనలుకూడా వున్నాయి. మొత్తంమీద సాహిత్యంలోని అన్ని విభాగాలనూ స్పృశిస్తూ, సమగ్రమైన పరిశీలన చేసిన గ్రంథం "రచన."

ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్యగారు "విలువలు-నాడు, నేడు" అనే తమ వ్యాసంలో పూర్వకాలంలోవున్న విలువలకూ, నేటి విలువలకూ గల తారతమ్యాన్ని అద్దంలో చూపినట్లు స్పష్టంగా చూపించారు. జీవిత లక్ష్యమును నిర్వచించడం,

సామాజిక జీవితమును నియమబద్ధం చేయడం, సమాజంలోని తర తమ భేదాలను సమర్థించడం—యీ మూడూ విలువలయొక్క ప్రయోజనాలని వారు నిర్వచించారు. నాటి పారలౌకిక సౌఖ్య వాంఛకూ, నేటి ఐహిక సౌఖ్య వాంఛకూగల ప్రధాన భేదాన్ని వారు తమ వ్యాసంలో చూపించారు. మొత్తంమీద వ్యాసం చదివిన తరువాత వ్యాస కర్త మనస్సు పూర్వకాలపు విలువలవైపు మొగ్గుచూపుతున్నదేమోఅనే అనుమానంకలిగే అవకాశం వున్నది

శ్రీ గోరాశాస్త్రిగారు తమవ్యాసంలో రచయిత, పత్రికలు, పబ్లిషర్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రేడియో, సినిమా మొదలగువాటి చేతుల్లో దాసుడుగా చిక్కి ఏ విధంగా వ్యక్తిత్వాన్ని కోల్పోతున్నాడో చక్కగా వివరించారు. సాహిత్యానికి జీవితం మీద ఏమాత్రం ప్రభావం లేదనే ధోరణిలో వారు తమ అభిప్రాయాలను వెల్లడిచేశారు. అభ్యుదయ సాహిత్య సదస్సులోకూడా వారి అధ్యక్ష ప్రసంగంలో సాహిత్యం యొక్క ముద్ర జీవితం మీద ఏమీ వుండదనే తమ అభిప్రాయాన్ని ఉద్ఘాటించారు. ఇది కొంతవరకు వివాద గ్రస్తమైన విషయం అని అంగీకరించక తప్పదు. నిజానికి ప్రజలను మార్చే శక్తి సాహిత్యానికి లేదంటే అధిక సంఖ్యాకులైన మేధావులు అంగీకరించరు. సాహిత్యం ద్వారా కొన్ని భావాలు ప్రచారం అవుతాయి. అవి ప్రజల మనస్సులో ఆలోచనలను రేకెత్తించి వారిలో భావ విప్లవం రావడానికి దోహదం చేస్తాయి అనేక ఇతర రంగాలలోని విశేషాలుకూడా యథాశక్తి దీనికి దోహదం చేయవచ్చు. కాని సాహిత్యంకూడా అదే పనిచేస్తుందనే నేటికీ విజ్ఞులైనవారి విశ్వాసం. ప్రజల్లో కొత్త చైతన్యాన్ని కలిగించి, వారి వూహలలో మార్పుతెచ్చి. సామాజికమైన మార్పులకు పునాది వేయలేని పక్షంలో సాహిత్య సృష్టి జరగడమే అనవసరం అవుతుంది. కాకపోతే సాహిత్యకారుడు తన ఆనందంకోసం రాసుకుంటే తప్ప, సామాజికమైన ప్రయోజనం సాహిత్యానికి లేకుండా పోతుంది.

శ్రీ కాళోజీ తమ వ్యాసంలో రచయిత ఏ సిద్ధాంతానికీ కట్టుబడి వుండకూడదు అనే అభిప్రాయాన్ని ప్రకటించారు. స్వాతంత్ర్యం, సమానత్వం అనే విలువలను రాజకీయ విప్లవాలద్వారా సేకరించుకున్నప్పటికీ సర్వమానవ సౌభ్రాతృత్వంఅనేది విప్లవాలద్వారా, రాజకీయ చర్యలద్వారా సాధ్యమయేది కాదని, దానిని రచయితలే సాధించాలనీ ప్రతిపాదించారు. "సమాజంలో విలువలను మార్చగలనన్న విశ్వాసం, మారుస్తున్నానన్న ధీమా, మార్చవలెనన్న ఆతురత రచయితకు వుంటుంది. అదంతా వట్టి భ్రమే సమాజం మీద సాహిత్యం వేసే ముద్ర అతి స్వల్పం ; అత్యంత తాత్కాలికం" అని కాళోజీ తమ వ్యాసంలో ప్రకటించారు. దాదాపు గోరా శాస్త్రిగారి లాగానే శ్రీకాళోజీకూడా సాహిత్యానికి సమాజాన్ని ప్రభావితం చేసే శక్తి లేదన్నట్లుగా మాట్లాడారు.

శ్రీ సంజీవదేవ్ తమ వ్యాసంలో "రచయిత ప్రధానంగా రసస్రష్ట మాత్రమేకాని ఉపదేశకుడూ, సంఘ సంస్కర్తా కాదు.... లోకం మరమ్మత్తు చేయాలని రచయిత కంకణం కట్టుకుని రచన చేయ ప్రారంభిస్తే ఆ రచనలోని రససృష్టి నశించి అదొక ప్రచార సాహిత్యంగా తయారవుతుంది" అన్నారు. విశ్వ శ్రేయస్సాధక బాధ్యత రచయితకు లేదని ఆయన అభిప్రాయపడ్డారు. అంటే గురజాడనుండి ప్రారంభమైన అభ్యుదయ సాహిత్య ఉద్యమ లక్ష్యాలతో వీరికి ఏకీభావంలేదని స్పష్టం అవుతున్నది.

మారుతున్న విలువలు – విమర్శ అనే అంశంమీద శ్రీయుతులు సంపత్కుమార. జి. వి. సుబ్రహ్మణ్యంగారలు, నవల గురించి మంజుశ్రీ. శ్రీయుతులు ఆనందారామం. కె. రామలక్ష్మి గారలు, కథానిక గురించి శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ, నాటకం గురించి శ్రీగొల్లపూడి మారుతీ రావు. కవిత గురించి శ్రీయుతులు కుందుర్తి డా. అరిపిరాల విశ్వంగార్లు వ్యాసాలు రాశారు. శ్రీ పురాణం తమ వ్యాసంలో—కథానికా ప్రక్రియను తెలుగువారు ఎరువు తెచ్చుకున్నప్పటికీ తమ స్వంతం చేసుకున్నారనీ, కవిత్వం వలెకాక కథ సూటిగా జనంలోకి పోగలిగిన ప్రక్రియ అనీ అన్నారు. సాహిత్యసృష్టి వ్యక్తిపరమైనదనీ, దానిమీద సాంఘిక అజమాయిషీ పనికిరాదనీ వాదించారు.

సంఘంలో శరవేగంతో వస్తున్న మార్పును గురించీ, దాని ఆవశ్యకతను గురించీ మన సాహిత్యం మనకు తగినంతగా జ్ఞాపకం చేయడంలేదని కుటుంబరావు గారు తమ వ్యాసంలో నొచ్చుకున్నారు. ఒక వ్యక్తికోసమే రాయబడి, చదవగానే చించివేయబడే ప్రేమ లేఖ వెనుకకూడా సామాజిక శక్తులున్నాయని కుటుంబరావు గారు ప్రతిపాదించారు. సంఘం యిలా ఉండాలి అని ఎవరూ శాసించలేరనీ, "ఇప్పటి సంఘం ఎలా మారాలి" అన్నదే ప్రధాన ప్రశ్న అనీ, దానికి సరియైన సమాధానం కనుక్కున్న వాళ్లే సమాజం యొక్క పరిణతికి దోహదం చేస్తారనీ ఆయన ప్రతిపాదించారు.

ఈ విధంగా అభిప్రాయ భేదాలు ప్రకటించబడినప్పటికీ ప్రతి వ్యాసమూ ఆలోచనాత్మకంగా వుంది. ప్రతి పాఠకుడికీ ప్రయోజనకరంగా వున్న వ్యాసాల సంపుటి "రచన". అందరూ చదువదగినది.

—చైతన్య

వార్తా — సేవ

పొగాకు పరిశ్రమ వేతన మండలి సభ్యుల గుంటూరు పర్యటన

పొగాకు పరిశ్రమ వేతన మండలి అధ్యక్షులు శ్రీ ఎం.ఆర్. మెహర్, ఐ.సి.ఎస్ (రిటైర్డు) ఇటీవల గుంటూరు చిలకలూరి పేట, చీరాలలో పర్యటించి అక్కడి పొగాకు ఫ్యాక్టరీలను దర్శించారు

అక్కడి పరిశ్రమలోని పనివారల వేతనాల తీరు, సర్వీసు పరిస్థితులు, పొగాకుకు సంబంధించిన యితర విషయాలను గూర్చి పరిశీలించారు. పని వారలకు గ్రాచ్యుటీ పథకం రూపొందించడం, వేతనాలు మినహా సెలవు సౌకర్యం, సెలవులువంటి యితర సర్వీసు పరిస్థితులను గూర్చి యీ మండలి పరిశీలిస్తుంది. ఈ మండలి వేతనాలను నిర్ణయించడానికి ముందు, ఆర్థిక అభివృద్ధి విషయంలో పరిశ్రమ అవసరాలు, పరిశ్రమల చెల్లింపు శక్తి ఎగుమతుల పెంపుదల విషయాలను దృష్టిలో ఉంచుకుంటుంది.

యజమానులు, పనివారలు, యీ పరిశ్రమకు సంబంధించిన సంస్థలు, ఆసక్తి గల యితరులకు యీ మండలి ప్రశ్నావళిని జారీ చేసింది.

సర్వశ్రీ ఆర్. రామానందరావు, ఛీఫ్ పర్సనల్ మేనేజరు, ఇండియన్ లీఫ్ టుబాకో కంపెనీ, వై.కె.ఎస్. ప్రకాశరావు, ఈస్ట్ ఇండియన్ టుబాకో కంపెనీ, జి.వి. ఆంజనేయశర్మ, కె. మల్లాయలింగం యీ మండలిలో సభ్యులుగా ఉన్నారు. శ్రీ ఎస్.ఎ.ఎం. మూర్తి, కార్మికశాఖ డిప్యూటీ కమీషనర్, మండలి కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు అవార్డులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జాతీయ అవార్డులు ఇచ్చే పద్ధతిలోనే రాష్ట్రభద్రతా అవార్డులుఇచ్చేందుకు ఒక పథకాన్ని రూపొందించింది. పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించి యజమానులు, కార్మికుల ప్రయోజనాలను పెంపొందించి, పరిశ్రమల్లో తీసుకొనే భద్రతాచర్యలను పరిగణించి, అందుకు తగిన పారితోషికం ఇవ్వడమే యీ పథకం ముఖ్యోద్దేశమైవుంది.

ఆంధ్రప్రదేశ్‌లో యీ పథకం తొలిసారిగా అమలుపరచబడుతున్నది. టెక్స్టైల్స్–నూలు, సిల్కు, చక్కెర, ఖండసారి మినహా–సిమెంటు ఇంజనీరింగు, ఇనుము ఫ్యాక్టరీలు 1969 వ సంవత్సరపు పారిశ్రామిక భద్రతలకు రాష్ట్ర అవార్డు పొందడానికి అర్హత కలిగి ఉంటాయి. ఈ ఫ్యాక్టరీలు 1948 సం॥ ఫ్యాక్టరీల చట్టంక్రిందికి వచ్చివుండాలి. అంతే కాకుండా కేలండర్ సంవత్సరంలో కనీసం 6 లక్షల గంటలు పనిచేసిఉండాలి.

పైన పేర్కొన్న ఐదు పరిశ్రమలకూ ప్రథమస్థానం ఆక్రమించినవాటికి రన్నింగ్ ట్రోఫీలు బహూకరించబడుతాయి. 1968తో పోల్చినపుడు అవి 1969లో ప్రమాదాల సంఘటనలు తక్కువగావుండాలి. గరిష్ట ఉత్పత్తి సాధించి వుండాలి.

ఆకాశవాణి కార్యక్రమాల సలహా సంఘం పునర్నిర్మాణం

హైదరాబాదు ఆకాశవాణి కేంద్రానికి సంబంధించిన కార్యక్రమాల సలహా సంఘాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌర సంబంధశాఖా మంత్రి అధ్యక్షతన పునర్నిర్మించారు. ఈ సంఘంలోని మిగతా సభ్యులు :—శాసనసభ ప్రతిపక్ష నాయకుడు, పార్లమెంటు సభ్యులు శ్రీ తెన్నేటి విశ్వనాథం, శ్రీ హెన్రీ సామ్యూల్. శాసనసభ్యుడు శ్రీ ఏ. భాస్కరరావు, శాసనమండలి సభ్యురాలు శ్రీమతి శ్యామలాదేవి; శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్, శ్రీమతి ప్రేమలతాగుప్త, శ్రీ ఎన్. నరోత్తమరెడ్డి, శ్రీ పి. సూర్యచంద్రరావు, శ్రీ బోయి భీమన్న, పండిత భీష్మదేవ్ శాస్త్రి. డా. రఫియా సుల్తానా, బనారసీలాల్‌గుప్త, భావరాజు నరసింహారావు, కె. యన్. అయ్యంగార్, డా. సి.ఎల్. రాయుడు, పోతుకూచి సాంబశివరావు.

ఆకాశవాణి డైరెక్టరు జనరల్, లేక ఆయన ప్రతినిధి, హైదరాబాదు ఆకాశవాణి కేంద్రం డైరెక్టరు, స్టేషను ఇంజనీరు, న్యూస్‌ఎడిటరు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధ యాత్రికశాఖ డైరెక్టరు, ఎక్స్‌అఫీషియో సభ్యులుగా వుంటారు.

ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం అసిస్టెంట్ డైరెక్టరు కార్యదర్శిగా వ్యవహరిస్తారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రం డైరెక్టరును, స్టేషను యింజనీరును కూడా సంఘం సమావేశాలకు ఆహ్వానిస్తారు. హైదరాబాదు, విజయవాడలలోని ఆకాశవాణి కేంద్రాలకు సంబంధించిన యిప్పటి కార్యక్రమాల సలహా సంఘాలు రద్దుపరచబడినవి.

హిందుస్తాన్ ఎయిరోనాటిక్స్‌లో గరిష్ఠ ఉత్పత్తి

హైదరాబాదులోని హిందుస్తాన్ ఎయిరోనాటిక్స్‌లో 1969–70 సంవత్సరంలో, 'మిగ్' విమానాల అనుబంధ పరికరాల విషయంలోనూ, ఎలక్ట్రానిక్ పరికరాల విషయంలోనూ రికార్డు వుత్పత్తిని సాధించారు.

ఈ ఫ్యాక్టరీలో, 1967 సంవత్సరంలో పనిప్రారంభించి నప్పటినుంచి, సుమారు రూ 10 5 కోట్లు విలువచేసే పరికరాలను వుత్పత్తి చేశారు కాగా రూ. 55.5 కోట్లు ఖరీదుచేసే పరికరాలను ఒక్క 1969,70 సంవత్సరంలోనే వుత్పత్తి చేశారు. ఈ కర్మాగారం సుమారు రూ. 7½ కోట్ల ఖర్చుతో నెలకొల్పబడింది. టెలివిజన్ రిసీవర్ల వంటి వినియోగదార్ల వస్తువులతో సహా యితర రకాల ఎలక్ట్రానిక్ వస్తువులను చేర్చడంద్వారా ఈ కర్మాగారం కార్యకలాపాలను విస్తృతీకరించడానికి తలపెట్టారు.

జిల్లాల్లో



ఉపముఖ్య మంత్రి శ్రీ జె. వి. నరసింగరావు జూలై 4న నాయుడు పేట వంతెనకు ప్రారంభోత్సవం చేసినప్పటి చిత్రం

నాయుడుపేట వద్ద ఉపముఖ్యమంత్రిచే వంతెనకు ప్రారంభోత్సవం

ఉపముఖ్యమంత్రి శ్రీ జె. వి. నర్సింగరావు జూలై 4వ తేదీన నెల్లూరు జిల్లాలోని నాయుడుపేట వద్ద రైల్వే క్రాసింగు చోట హైవే వంతెనకు ప్రారంభోత్సవం జరిపారు. ఈ వంతెన నిర్మాణానికి రు. 5,82,000 లు ఖర్చు అయింది. ఇది నిర్మాణం కావడం వల్ల ఇప్పుడు రైల్వే లెవెల్ క్రాసింగు గేట్ల వద్ద అన్ని రకాల వాహనాలకు రాకపోకల సౌకర్యం ఏర్పడుతున్నది. వంతెన నిర్మాణానికి పూర్వం ఇండ్లు గంటల తరబడి కాచుకొని వుండవలసి వచ్చేది.

ఈ సందర్భంలో ఏర్పాటైన బహిరంగ సభకు శాసన సభ్యులు శ్రీ వేమారెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. నాయుడుపేట సర్పంచ్ ఉపముఖ్యమంత్రికి సన్మాన పత్రం సమర్పిస్తూ ఆ గ్రామానికి రక్షిత నీటి సరఫరా పథకాన్ని మంజూరు చేయవలసిందని అభ్యర్థించారు. ఈ పథకానికయ్యే ఖర్చునంతటినీ పంచాయతీ భరించగలదని కూడా ఆయన చెప్పారు. ఇక్కడ ప్రభుత్వం ప్రసూతి వైద్య చికిత్సాలయాలను కూడా ఏర్పాటుచేసినట్లయితే, చుట్టు ప్రక్కల గ్రామాలకు చాలా ఉపకరించగలదని ఆయన సన్మాన పత్రంలో పేర్కొన్నారు.

ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రస్తుతం హైవేలను వెడల్పుచేసి అభివృద్ధిపరచడానికి నాల్గవ పంచవర్ష ప్రణాళికలో ప్రతిపాదించబడిందని తెలిపారు. ఈ సంవత్సరం సమితి, జిల్లా పరిషత్తు రోడ్లను రోడ్లు, భవనముల శాఖ యాజమాన్యం క్రిందికి తేవడానికి ప్రభుత్వం యోచిస్తున్నదని అన్నారు. నాయుడుపేట పంచాయతీకి రక్షిత నీటిసరఫరా పథకాన్ని మంజూరు చేయడానికి శాయశక్తులా కృషి చేయగలమని శ్రీ జె. వి. నర్సింగరావు హామీ ఇచ్చారు.

హిందీ విద్యాలయ భవనానికి శంకుస్థాపన

విద్యాశాఖమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు శ్రీకాకుళంలో హిందీ విద్యాలయ భవనానికి శంకుస్థాపన చేశారు. ఇందుకు శ్రీకాకుళం మున్సిపాలిటీ భూమిని ఉచితంగా ఇచ్చింది. భవన నిర్మాణానికి శ్రీ చతుర్భుజదేవ్ రు. 5,000లు విరాళమిచ్చారు.

విద్యామంత్రి హిందీ ప్రచార మహాసభకు ప్రారంభోత్సవం జరుపుతూ, హిందీ భాషను అభ్యసించడానికి రాజ్యాంగం ప్రకారం హిందీని జాతీయ భాషగా అమలువరచడానికి ఆంధ్రులు ఎవ్వరికీ తీసిపోరని రుజువు చేయాలని ఉద్బోధించారు. "ఉత్తర దక్షిణ భారతావనికి ఆంధ్రప్రదేశ్ ఒక వంతెనవలె వున్నది. ఆంధ్రులు జాతీయ భాష అయిన హిందీని అభ్యసించాలి. స్వాతంత్ర్య పోరాట సమయంలో జాతీయ భాషగా హిందీని అంగీకరించారు. అయితే నేడు కొంత మంది దీనికి వ్యతిరేకత తెలుపుతున్నారు. హిందీ ప్రచారకులు హిందీభాషా వ్యాప్తికి కృషిచేయాలి" అని మంత్రి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ త్రిభాషా విధానాన్ని అమలుపరుస్తున్నది. ఉత్తరాదేశంలో కొన్ని రాష్ట్రాలు కూడా దక్షిణ దేశ భాషలను నేర్చుకోవలసిన అవసరాన్ని గురించి, అందుకు తగిన నిధులు కేటాయిస్తున్నాయని మంత్రి తెలిపారు.

ఆహ్వానసంఘ అధ్యక్షులు శ్రీ జి. వి. లక్ష్మణరావు మంత్రికి స్వాగతం చెప్పారు. శ్రీ వేమూరి రాధాకృష్ణమూర్తి వందన సమర్పణ చేశారు.

మల్యాల సమితిలో కొత్త పథకాల మంజూరు

కరీంనగర్ జిల్లా మల్యాల పంచాయతీ సమితికి చెందిన పన్నులు, ఆర్థిక విషయాల స్థాయీ సంఘం సమావేశం జూన్ నెలలో సమితి అధ్యక్షుడు శ్రీ పి. లక్ష్మణరావు అధ్యక్షతన జరిగింది. ఆ సందర్భంలో, సమితిలోని 17 గ్రామ సేవకుల సర్కిళ్ళలో ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటుచేసే నిమిత్తం వ్యవసాయ కార్యక్రమం క్రింద రూ. 9,960 ల మొత్తాన్ని మంజూరు చేశారు. ఎగ్జిబిషన్లకొరకు కేసులను, మోడల్సును కొనుగోలు చేయడానికి రూ. 250 లు మంజూరుచేశారు. సమితిలోని అభ్యుదయ కర్షకులకు 25 శాతం సబ్సిడీ పద్ధతి మీద పంపిణీ చేసేందుకై 5 పవర్ స్ప్రేయర్లు కొనడానికి మంజూరీ యిచ్చారు. స్ప్రేయర్లు, డస్టర్లకు సంబంధించిన విడిభాగాలు కొనడానికి రూ. 500 లు మంజూరు చేశారు.



యాత్రా విషయాల మంత్రిణి శ్రీమతి రోడామిస్త్రీ జూలై 2న ఉండవల్లి గుహలను సందర్శించినప్పటి చిత్రం

ఉండవల్లి గుహలలో యాత్రా విషయాల శాఖా మంత్రిణి

యాత్రా విషయాలు, మహిళా సంక్షేమశాఖా మంత్రిణి శ్రీమతి రోడామిస్త్రీ జూలై 2న మహిళా సంక్షేమశాఖ డైరెక్టరు శ్రీమతి రాజ్యం సిన్హా, ఆ శాఖ అసిస్టెంటు డైరెక్టరు కుమారి వి. సీతాదేవి గారలతో ఉండవల్లి గుహలను సందర్శించారు. సుందరమైన గుహలను అనంతపద్మనాభస్వామి విగ్రహాన్ని తిలకించి మంత్రిణి చాల సంతోషించారు. జిల్లా పౌరసంబంధశాఖాధికారి శ్రీ ఎన్. గోపాలకృష్ణమూర్తి మంత్రిగారికి గుహలను చూపించారు.

"మహిళామండలులు జాతికి వెన్నెముక వంటివి" మహిళా సంక్షేమమంత్రిణి అభిభాషణ

మహిళా సంక్షేమం, యాత్రా విషయాల శాఖామంత్రిణి శ్రీమతి రోడామిస్త్రీ జూలై 11 న శ్రీకాకుళంలో మహిళామండలి సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ, మహిళామండలులు జాతికి వెన్నెముక వంటివని చెప్పారు. తమ పిల్లలు క్రమశిక్షణతో పెరగడానికి తల్లులు పాటుపడాలని ఆమెచెప్పారు. మహిళామండలులు పిల్లల కొరకు ఉత్తమ శిశువు ఆరోగ్య పోటీలు నిర్వహించాలని సూచించారు.

మంత్రిణి, మహిళల కొరకు ఏర్పాటుచేసిన వృత్తి విద్యా శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు

ఆ తరువాత మంత్రిణి రోటరీ క్లబ్బులో ప్రసంగిస్తూ, దేశంలో సుమారు 20 ఏండ్ల క్రిందట స్వచ్ఛంద సంస్థలు ప్రజా సహకారంతో సాంఘిక సంక్షేమానికి కృషి చేస్తూవుండేవనీ, శ్రీకాకుళంలోని రోటరీ క్లబ్బు, మిషనరీల కార్యకలాపాలతో సహకరిస్తూ కుష్ఠురోగనివారణకు కృషిచేయాలని సూచించారు. రోటరీ క్లబ్బు చేస్తున్న కృషిని ఆమె శ్లాఘించారు.

సంక్షేమ కార్యక్రమాలకు నిధి సేకరణ

మహిళా సంక్షేమం, యాత్రా విషయాల శాఖా మంత్రిణి శ్రీమతి రోడామిస్త్రీ విజయనగరం మహిళా కళాశాల విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ స్త్రీలు విద్యాభ్యసించవలసిన అగత్యాన్ని గురించి చెప్పారు. ఒక కాలంలో స్త్రీలకు విద్య విలాసవస్తువుగా వుండేది. అయితే ఇప్పుడు వారు అన్నిరంగాలలోను పురుషులతో సమానంగా పనిచేస్తున్నారు. పురుషులతో పోటీచేసి విజయం సాధించాలంటే బాలికలు చాలా శ్రద్ధగా చదువుకోవాలి విద్యార్థినులు కాలాన్ని వృధాచేయకుండా వుండాలని ఆమె చెప్పారు.

ప్రిన్సిపాలు డా. బి.వి. సీతాకుమారి మంత్రిణికి స్వాగతం చెప్పారు. శాసన సభ్యులు శ్రీ సాంబమూర్తి రాజు, విజయనగరం మునిసిపల్ ఛైర్మన్ శ్రీ ఎ. అప్పన్నదొర కూడా విజయనగరంలో ఆమెకు స్వాగతం చెప్పారు. మంత్రిణి బాలవిహార్‌ను సందర్శించి అక్కడ పిల్లలకు మిఠాయి పంచిపెట్టారు

గిరిజన సంక్షేమానికి రూ. 5.12 లక్షలు కేటాయింపు

ఖమ్మం జిల్లా అశ్వారావుపేట పంచాయతీ సమితి సర్వసభ్య సమావేశం 1969-70 సంవత్సరానికి సమితి పరిపాలనా నివేదికను ఆమోదించింది. సమావేశానికి సమితి అధ్యక్షులు శ్రీ వెంకటరామారావు అధ్యక్షత వహించారు.

ఈ సమితి గిరిజన సంక్షేమానికి రూ. 5,12,630లు, వ్యవసాయానికి రూ. 1,90,000లు, పశుగణాభివృద్ధికి రూ. 23,500లు విద్యాభివృద్ధికి రూ. 1,42,000 బావుల త్రవ్వకానికి రూ. 40,000లు మంజూరు చేసింది. అంతేకాకుండా గిరిజన గ్రామాలలో 7 ఆశ్రమ పాఠశాలలను నెలకొల్పడానికి కూడా రూ. 75,000లు మంజూరు చేసింది.

తాళ్లూరు సమితిలో 65,000 ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం

గుంటూరు జిల్లా తాళ్ళూరు సమితి, యిటీవల వ్యవసాయ రంగలో అమోఘమైన అభివృద్ధిని సాధించింది. నాగార్జునసాగర్ నీటి విడుదలతో రైతులు ఐ. ఆర్-8, జయ, పద్మవంటి అధిక దిగుబడి వరివంగడాలను సేద్యంచేస్తున్నారు.

ఇంతవరకు 65,000 ఎకరాలకు సేద్యపు నీటిసౌకర్యం కల్పించారు. 1969 ఖరీఫ్ పంట కాలంలో భట్లూరు గ్రామానికి చెందిన అభ్యుదయ కర్షకుడు శ్రీ ఇ. కోటయ్య తమ క్షేత్రంలో ఐ. ఆర్. 8 వరి వేసి ఎకరాకు 54 బస్తాలు ఉత్పత్తి చేశారు. అదే గ్రామానికి చెందిన శ్రీ కె. సుబ్బారావు ఎకరాకు 47 బస్తాలు ఉత్పత్తి చేశారు.

పనిదం, అత్తలూరులలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు యీ సమితి అవసరాలను తీర్చుతున్నది. ఇంతవరకు 1100 కుటుంబనియంత్రణ శస్త్రచికిత్సలను నిర్వహించారు.

ప్రభుత్వ ప్రధానకార్యదర్శిచే లిఫ్టు ఇరిగేషన్ పథకానికి ప్రారంభోత్సవం

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ యం.టి. రాజు జూలై 4వ తేదీన మహబూబునగరానికి 60 మైళ్ళ దూరంలోవున్న వీరరాఘవపురంలో రూ. 1.62 లక్షల ఖర్చుతో పూర్తి చేయబడిన లిఫ్టు ఇరిగేషను పథకానికి ప్రారంభోత్సవం జరిపారు. ఈ సందర్భంలో ఏర్పాటైన సభకు అడిషనల్ చీఫ్ సెక్రటరీ శ్రీ యన్. ఏ. ఖాదర్ అధ్యక్షత వహించారు.

శ్రీ రాజు మాట్లాడుతూ ఇది ప్రజల పథకమనీ, లిఫ్టు ఇరిగేషన్ కో-ఆపరేటివ్ సొసైటీవారు దీన్ని నిర్వహించే పద్ధతిపైన ఈ పథకం భవిష్యత్తు ఆధారపడివుందనీ చెప్పారు. ఈ పథకం నుంచి వచ్చిన జలాలవల్ల ఎక్కువపంటలు పండించడానికి అవకాశం కలుగుతున్నదని చెప్పారు. ప్రజల పథకాలను విజయవంతం చేయడానికి ప్రభుత్వ అధికారులు శ్రద్ధాసక్తులతో కృషి చేయాలని ప్రధాన కార్యదర్శి అన్నారు.

వ్యవసాయోత్పత్తిని అధికం చేయడానికి వ్యవసాయం, ఇతర శాఖాధికారులు ప్రజలకు సరియైన సలహాలు ఇవ్వగలరని శ్రీ యన్. ఎ. ఖాదర్ తమ ఆశాభావాన్ని వెల్లడించారు.

జిల్లా కలెక్టరు శ్రీ వి. కె. థార్ మాట్లాడుతూ, వెనుకబడిన ప్రాంతంలో లిఫ్టు ఇరిగేషన్ పథకాలు చాల సహాయకారిగా వుండగలవని చెప్పారు: మహబూబునగరం జిల్లాలో పెద్ద ఇరిగేషన్ పథకాలు ఏవీలేవు. కనుక లిఫ్టు ఇరిగేషన్ పథకాలు ఈ జిల్లాలో విజయవంతం కావాలని కలెక్టరు చెప్పారు. ఈ పథకం వల్ల వీరరాఘవపురం, తూముపల్లి, రేచింతల గ్రామాలలో 550 ఎకరాల ఆయకట్టుకు నీటిపారుదల సౌకర్యం లభించగలదని ఆయన చెప్పారు. జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ కె. కె. రెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన ఈ జిల్లాలో ఇట్టి పథకాలకు ప్రజల విరాళాన్ని మినహాయింపు చేయాలని అభ్యర్థించారు.

సభానంతరం, ప్రధాన కార్యదర్శి ఆత్మకూరు సమితిలోని 7 గ్రామాలలో వున్న భూములులేని బీద రైతులకు 503 ఎకరాలకు సంబంధించిన 256 పట్టాలు పంచిపెట్టారు.

తిరుమల రెండవ ఘాట్ రోడ్డు


రాష్ట్ర ఉపముఖ్యమంత్రి శ్రీ జె. వి. నరసింగరావు తిరుపతిలో పత్రికలవారితో మాట్లాడుతూ తిరుమల-తిరుపతి రెండవ ఘాట్ రోడ్డు నిర్మాణంక మొదటి ఐదుమైళ్ళు 12 8 లక్షల రూపాయల ఖర్చుతో పూర్తయిందని, 1971 జూన్ నాటికి రెండవ ఘాట్ రోడ్డు మొత్తం పూర్తికాగలదనే ఆశాభావాన్ని వెలిబుచ్చారు. దీనికి అవుతున్న ఖర్చు 40 లక్షలు తిరుమల-తిరుపతి దేవస్థానం భరిస్తున్నది.

రాష్ట్రంలో 450 మైళ్ళ జాతీయ రహదారిని రెండు వైపుల రవాణాకు వీలుగా వెడల్పు చేసే కార్యక్రమం నాల్గవ ప్రణాళికా కాలంలో పూర్తికాగలదని చెప్పారు.

తిరుపతిలో రూ. 1·6 లక్షల ఖర్చుతో ఈ సంవత్సరాంతంలోగా ఒక సర్క్యూట్ హౌవుస్ నిర్మాణము చేయబడుతుందని తెలియజేశారు.

సంక్షేమ సంస్థలకు గ్రాంట్లు

ఆంధ్రప్రదేశ్ సంక్షేమ నిధి యొక్క తూర్పుగోదావరిజిల్లా శాఖ విభాగం, జిల్లాకలెక్టరు శ్రీ ఎల్. మాలకొండయ్య అధ్యక్షతన సమావేశమై వివిధ సంక్షేమ సంస్థలకు, అర్హతగల బీద వ్యక్తులకు మొత్తం రూ. 80,000 లు మంజూరు చేసింది.



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. టి. రాజు, ఐ.సి.ఎస్. జూలై 4న మహబూబ్‌నగర్ జిల్లా, వీరరాఘవపురంలో లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ప్రారంభోత్సవం చేస్తున్న దృశ్యం.

నిర్మల్‌లో ఇతోధిక వైద్య సౌకర్యాల కొరకు విజ్ఞప్తి

ఆరోగ్య శాఖా మంత్రి శ్రీ మొహమ్మద్ ఇబ్రహీం అలీ అన్సారీ జూలై 7న నిర్మల్‌లోని సివిల్ ఆసుపత్రి ప్రసూతి వార్డులను దర్శించారు. జిల్లా వైద్య శాఖాధికారి డా సుదర్శనరావుతో పాటుమంత్రిగారు ఆసుపత్రిని పరిశీలించి, ఉద్యోగసిబ్బంది, రోగుల యోగక్షేమాలను పరామర్శించారు.

ఈ ప్రాంతంలోనే కుష్ఠువ్యాధి ప్రబలుతున్నదనీ ఈ రోగాన్ని అదుపు పెట్టాలంటే ఎక్కువ నిధులు కేటాయించవలసి వుంటుందనీ, స్థానికనాయకులు మంత్రికి వినతి పత్రం సమర్పించారు. నిర్మల్‌లో కుష్ఠురోగ చికిత్సాలయం కొరకు అరయెకరం భూమిని కేటాయించగలనని మునిసిపల్ ఛైర్మన్ శ్రీరాములు హామీఇచ్చారు.

ఉప ముఖ్యమంత్రిచే ప్రసూతి, శిశు సంక్షేమ కేంద్రానికి శంకుస్థాపన

ఇటీవల ఉప ముఖ్యమంత్రి శ్రీ జె. వి. నర్సింగరావు ఆదిలాబాదుజిల్లా లక్సెట్టిపేటలో ప్రసూతి శిశు సంక్షేమ కేంద్రానికి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంలో బహిరంగ సభకు జిల్లా కలెక్టరు శ్రీ అల్లాయార్‌ఖాన్ అధ్యక్షత వహించారు.

తమకు సమర్పించిన సన్మాన పత్రానికి ఉప ముఖ్యమంత్రి సమాధానమిస్తూ, కడెం కాలవల లోపాలను సరిచేయడానికి రూ. 6 50 లక్షలు కేటాయించడం జరిగిందని తెలిపారు.

బ్యాంకుల జాతీయకరణ, భూసంస్కరణలు, చిన్నరైతులకు పరపతి సౌకర్యాలు, హరిజనులకు ఇండ్లస్థలాల కేటాయింపు, వెనుకబడ్డ తరగతుల అభివృద్ధి ఇతర అనేక పథకాలను అమలు పరచడానికి ప్రధానమంత్రి నాయకత్వాన తీసుకోబడిన పురోభివృద్ధి చర్యలను గురించి శ్రీ నర్సింగరావు ప్రజలకు వివరించి చెప్పారు.

సోషలిస్టు సమాజ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి సహకరించవలసిందని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా అభివృద్ధికి సాయశక్తులా కృషిచేస్తానని ఆయన హామీ యిచ్చారు.

40 ఏండ్లుగా సర్పంచ్‌గా ఎన్నికైన వ్యక్తి

శ్రీ గాదె చిన్నవెంకయ్య గుంటూరు జిల్లా నాదెండ్ల సమితిలోని చిరుమామిళ్ళ గ్రామసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోబడినారు.

ఆయన గత 40 ఏండుగా ఈ గ్రామ సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. గ్రామాభివృద్ధికి-ముఖ్యంగా బీద హరిజనుల సంక్షేమం కొరకు ఆయన యెనలేని సేవచేస్తున్నారు. తుఫానుబాధితుల సహాయక కార్యక్రమం క్రింద హరిజనులకు 100 ఇండ్లు నిర్మించడానికి ఆయన మూలకారకుడు.



కందుకూరి వీరేశలింగం పంతులుగారి 122 వ జన్మదినం సందర్భంగా జూన్ 28 న రాజమండ్రిలో ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరిస్తోన్న తూ. గో. జిల్లా సెషన్స్ జడ్జి

సర్పంచ్‌గా ఆరవసారి ఎన్నిక

పశ్చిమ గోదావరిజిలా పెనుమంత్ర పంచాయతీ సమితిలోని మునమర్రు గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీ తోట మునేశ్వరరావు జూన్ 9 న తిరిగి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

1951 నుండి శ్రీ మునేశ్వరరావు, ఆయన సభ్యులతోపాటు ఆరవసారి కూడా అందరూ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ఆయన ప్రత్యేకతను తెల్పుతుంది.

ఇండ్ల స్థలాల పట్టాల పంపిణీ

ఆర్థికశాఖ ఉపకార్యదర్శి, శ్రీ ఎస్. ఆర్. శంకర్, ఆంధ్రప్రదేశ్ గిరిజన ఆర్థిక సహాయ కార్పొరేషన్ జనరల్ మేనేజరు శ్రీ వి. చంద్రమౌళితో కలిసి పర్యటిస్తూ జూన్ 27 వ తేదీన నెల్లూరు జిలా, ఇందుకూరు పేట పంచాయతీ సమితిలోని పోతురాజు దిబ్బకు చెందిన 48 మంది గిరిజనులకు, కాకుపల్లికి చెందిన 33 మంది హరిజనులకు ఇండ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. పంపిణీ చేసిన మొత్తం భూమి విస్తీర్ణము 6.51 ఎకరాలు.

గిరిజన హాస్టళ్ల ప్రారంభం

మహబూబ్‌నగరంజిల్లా మన్ననూరులో ఇటీవల 30 మంది గిరిజన బాలురకు, 30 మంది గిరిజన బాలికలకు ప్రభుత్వం రెండు హాస్టళ్లు ఆరంభించింది. వీటిలో ఇంతవరకు 42 మంది గిరిజన బాలబాలికలు చేర్చుకోబడినారు డీ నోటిఫై చేసిన గిరిజనులకు కూడా అమదాబాదులో మరొక హాస్టలు ఇటీవలనే తెరువబడింది.


ఈ మూడు హాస్టళ్ళలో చేరిన గిరిజన బాలబాలికలకు నాగర కర్నూలు ఆర్. డి. ఓ. శ్రీ మురళీధర్ బట్టలు, పుస్తకాలు పంచి పెట్టారు.

1970-71లో 1000 గ్రామాలను విద్యుచ్ఛక్తి సరఫరా

విద్యుచ్ఛక్తి శాఖా మంత్రి శ్రీ వి. కృష్ణమూర్తి నాయుడు, జూన్ నెలలో శ్రీకాకుళంలో పత్రికా ప్రతినిధులగోష్ఠిలో ప్రసంగిస్తూ 1970–71వ సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికకు యింకా తుది రూపం యివ్వలేదని అన్నారు. అయితే శాసనసభలో ప్రకటించినట్లు యీ సంవత్సరం 1,000 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయడం జరుగుతుందని ఆయన ప్రకటించారు.

వ్యవసాయ టారిఫ్‌ను పెంచినప్పుడు కనిష్ఠ గ్యారంటీని తగ్గించడం జరుగుతుందని ఆయన అన్నారు. మీటరు రేటును 150 పైసల నుండి 450 పైసలకు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ విజ్ఞాపనలు అందాయనీ, యీ సమస్య ప్రభుత్వ పరిశీలనలో ఉందనీ ఆయన వెల్లడించారు.

అంతకు ముందు, మంత్రి బండపల్లిలో గిరిజన యిండ్ల కాలనీకి, తామరపల్లిలో హరిజన యిండ్ల కాలనీకి ప్రారంభోత్సవం చేశారు.



కందుకూరి వీరేశలింగంగారి 122 వ జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్ర సమాచార మంత్రి శ్రీ అక్కిరాజు వాసుదేవరావుగారితో ఉత్సవ నిర్వాహకులు

నివాసంలో జరిగిన బహిరంగసభలో మంత్రి ప్రసంగిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణకు తమవంతు పాత్రను నిర్వహించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భూమిలేని వారికి, హరిజనులకు, గిరిజనులకు బంజరుభూములను పంపిణీచేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందనీ, వ్యవసాయదారులకు అనేక విధాలుగా ప్రభుత్వం తోడ్పడుతున్నదనీ మంత్రి అన్నారు.

వరంగల్లు జిల్లాలో గిరిజన అభివృద్ధి

వరంగల్లు జిల్లా కలెక్టరు, శ్రీ కె. ఆర్. వేణుగోపాల్, జూన్ 3వ వారంలో ఇటూరివాగారం పంచాయతీ సమితిలోని తాడ్వాయ గ్రామంలో గిరిజనుల బహిరంగ సభలో ప్రసంగిస్తూ జిల్లాలోని మొత్తం గిరిజన ప్రజలకు సంబంధించిన వివిధ అవసరాలను దృష్టిలో ఉంచుకొని, ప్రాధాన్యతాక్రమం ప్రాతిపదికగా సమగ్రమైన ప్రణాళికను రూపొందించడం జరిగిందని వెల్లడించారు. యీ 34 లక్షల ప్రతిపాదిత మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేసిన వెంటనే యీ ప్రణాళికను అమలు జరుపుతారని ఆయన అన్నారు.

ప్రభుత్వంలో విశ్వాసం ఉంచి, తమ అభ్యుదయానికి ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాల అమలులో సహకరించాలని ఆయన గిరిజనులకు విజ్ఞప్తిచేశారు. గిరిజన ప్రాంతంలో త్వరలోనే సంచారక వైద్య చికిత్సా శకటాన్ని ప్రవేశపెడతారని ఆయన అన్నారు. స్థానిక వడ్డీ వ్యాపారస్థుల నుండి గిరిజనులకు విముక్తి కల్గించడానికి వీలుగా స్వల్పకాలిక ఋణం ప్రాతిపదికగా రు. 750 చొప్పున వారికి యివ్వబడుతుందని. త్వరితగతిని చర్యలు తీసుకొనడానికి వీలుగ వారి సహేతుకమైన ఫిర్యాదులను తాను స్వయంగా పరిశీలిస్తానని కలెక్టరు వారికి హామీ యిచ్చారు.

కొండాయి గ్రామంలోని 100 మంది భూమి హీనులైన గిరిజనులకు 500 ఎకరాలలో పునరావాసం కల్పించే పథకాన్ని త్వరలో అమలు జరుపుతారని ఆయన అన్నారు.

రు. 5,000 ల విలువచేసే విత్తనాలు, క్రిమిసంహారక మందులు, ఎరువులను కలక్టరు పంపిణీచేశారు

చిత్తూరులో 14 మంది మహిళలు సర్పంచులుగా ఎన్నిక

చిత్తూరు జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో 80 శాతం మంది ఓటర్లు ఎన్నికల్లో పాల్గొన్నారు

సర్పంచిగా ఎన్నికైనవారిలో 14 మంది మహిళలు, 12 మంది షెడ్యూలు కులాలవారు, ఒకరు షెడ్యూలు తెగకు చెందినవ్యారువున్నారు.

ఆసుపత్రికి భవనం రూపంలో విరాళం

కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దాత శ్రీ వెంపల్లి బాలిరెడ్డి రు. 35,000 ల ఖర్చుతో విశిష్ట నమూనాలో నిర్మించిన భవనాన్ని ఒకదానిని ఆసుపత్రిని నిర్వహించే నిమిత్తం మునిసిపాలిటీకి విరాళంగా యిచ్చారు.

రోటరీ క్లబ్‌వారు యీ పథకం అమలుకు ఆధ్వర్యం వహించి, తమ పర్యవేక్షణలో యీ భవనాన్ని నిర్మించారు. జిల్లా కలక్టరు శ్రీ ఎస్.వి. గిరి; యిటీవలనే యీ భవనానికి ప్రారంభోత్సవం చేశారు.

ఆదిలాబాదులో కుటుంబనియంత్రణ కార్యక్రమం

ఆదిలాబాదు జిల్లా కుటుంబ నియంత్రణ విషయాల సమీక్షా సంఘ సమావేశం జూన్ 30 వ తేదీన ఆదిలాబాదులో కలెక్టర్ ఇంఛార్జి శ్రీ ఎస్. కె. సురోయా అధ్యక్షతన జరిగింది. 1970 మేలో 61 స్టెరిలైజేషన్లు జరిగినట్లు, 10,485 కండోములను పంపిణీ చేసినట్లు జిల్లా కుటుంబ నియంత్రణ శాఖాధికారి డా. ఏ. ఎన్. శాస్త్రి తెలియజేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. సుదర్శనరావు, జిల్లా హెడ్‌క్వార్టర్స్ ఆసుపత్రి సూపరింటెండెంటు డా. ఖమ్రుద్దీన్, జిల్లా పరిషత్తు కార్యదర్శి శ్రీ ఐ. కమరుల్ హక్ సమావేశానికి హాజరయ్యారు.

నెల్లూరులో సర్పంచులుగా 8 మంది స్త్రీల ఎన్నిక

నెల్లూరు జిల్లాలో 218 గ్రామ పంచాయతీలలో సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. 9 మంది నిమ్నజాతులవారు, 18 మంది స్త్రీలు కూడా సర్పంచులుగా ఎన్నిక అయ్యారు.

హరిజన దినోత్సవం — వస్త్రాల పంపిణీ

అనంతపురం జిల్లా, రాయదుర్గం పంచాయతీ సమితిలోని టి. వీరాపురం గ్రామంలో జూన్ 30 వ తేదీన హరిజన దినోత్సవాన్ని జరిపారు.

హరిజనవాడలో పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు సాంఘిక సంక్షేమ ఎలిమెంటరీ పాఠశాలలో బహిరంగ సభకూడా జరిపారు. బ్లాక్ డెవలప్‌మెంటు అధికారి. శ్రీ బి. ఈశ్వరప్ప, పాఠశాలకు వెళ్ళే హరిజన బాల బాలికలకు పాఠశాల యూనిఫారమ్ దుస్తులనూ, బీద హరిజన మహిళలకు చీరెలనూ పంపిణీ చేశారు. ఉత్తమ హరిజన గృహానికి ప్రత్యేక బహుమతినికూడా ఇచ్చారు.

హరిజన దినోత్సవం లక్ష్యాలను వివరిస్తూ, హరిజన సంక్షేమానికి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలన్నిటిని పూర్తిగా వినియోగించుకోవాలని వక్తలు హరిజనులకు విజ్ఞప్తిచేశారు.

గ్రామంలోని పిల్లలందరికీ మిఠాయీలు పంచిపెట్టారు.

వరంగల్లు జిల్లా పరకాల పంచాయతీ సమితిలోని నేరేడుపల్లి గ్రామంలో హరిజన దినోత్సవం సందర్భంగా 25 మంది హరిజన బాల బాలికలను ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు.

వీథులను శుభ్రం చేయడం, సామూహిక విందు ఏర్పాటు చేయడంతోపాటు మశూచి టీకాలనుకూడా వేశారు.

షెడ్యూలు జాతుల అభివృద్ధికి రిజర్వు నిధులు

వరంగల్లు జిల్లా పరిషత్తు స్థాయీ సంఘం జూన్ 30వ తేదీన జిల్లా కలెక్టరు శ్రీ కె. ఆర్. వేణుగోపాల్ అధ్యక్షతన సమావేశమై షెడ్యూలు జాతులు, గిరిజనుల సంక్షేమానికై కేటాయించిన సాధారణ నిధుల నుంచి కొంత భాగాన్ని వర్తమాన సంవత్సరంలో ఈ వర్గాలకు చెందిన ప్రజల సంక్షేమానికై పూర్తిగా వినియోగించాలని నిర్ణయించింది.

మహబూబ్‌నగర్ జిల్లాలో మహిళా సర్పంచుల ఎన్నిక

మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పంచాయతీ సమితిలోని దొండ్లపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా శ్రీమతి రేణుకాదేవి ఎన్నికయ్యారు. జడ్చర్ల సమితిలోని పెద్దదిరియాల్ గ్రామ సర్పంచ్‌గా శ్రీమతి పి. రామేశ్వరమ్మ, కల్వకుర్తి సమితిలోని వెల్కంపల్లి గ్రామ సర్పంచ్‌గా శ్రీమతి మునియమ్మ, ఆత్మకూరు సమితిలోని జిన్నారం గ్రామ సర్పంచ్‌గా శ్రీమతి దేవకమ్మ, మక్తల్ సమితిలోని కొల్పూర్ గ్రామ సర్పంచ్‌గా శ్రీమతి ఆశాదేవి కూడా ఎన్నికయ్యారు.

మద్దూరు సమితిలోని కైతనపల్లి గ్రామ సర్పంచ్‌గా హరిజన నాయకుడు శ్రీ గజ్జలప్ప, కొడంగల్ సమితిలోని చిట్లపల్లి గ్రామ సర్పంచుగా మరో హరిజన నాయకుడు శ్రీ పొచ్చప్ప ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలన్నీ జూన్ 13 వ తేదీన జరిగాయి.



కందుకూరి వీరేశలింగం 122వ జన్మదినోత్సవ సందర్భంగా 'వీరేశలింగం మ్యూజియం'కు సమాచార పౌర సంబంధశాఖ మంత్రి శ్రీ ఎ. వాసుదేవరావు ప్రారంభోత్సవం చేశారు.

హరిజనులకు ఇండ్లు

చిత్తూరుజిల్లా, మదనపల్లి పంచాయతీ సమితిలోని చిన్న తిప్ప సముద్రం, వెంపల్లి, నిమ్మనపల్లి, కోరవపోలు గ్రామాలకు చెందిన 72 హరిజన కుటుంబాలకు ఇండ్లు నిర్మించుకోడానికి రూ. 6,600 ల మేరకు ఆర్థిక సహాయం అందజేయబడినది.

సమితి ప్రాంతంలో హరిజనులకు ఇండ్ల స్థలాలు కేటాయించడానికి వీలుగా భూములు సేకరించే కార్యక్రమాన్ని త్వరిత గతిని అమలు జరుపడానికి చర్యలు తీసుకుంటున్నారు.



నెల్లూరు జిల్లా రెవెన్యూ అధికారి శ్రీ పి. యల్. సంజీవరెడ్డి, ఐ. ఎ. ఎస్. బదిలీ అయిన సందర్భంగా నెల్లూరు పట్టణ పాత్రికేయులు సన్మానించినప్పటి దృశ్యం

గాంధీ జీవితముపై తోలుబొమ్మలాట

గుంటూరు జిల్లా పౌరసంబంధాధికారి తెనాలి, పొన్నూరు, తాడేపల్లిలలో గాంధీ జీవితంపై తోలుబొమ్మలాట ఏర్పాటుచేశారు.

గుంటూరు పట్టణంలో ఒక ప్రదర్శనకు నాగార్జునసాగర సంస్కృతి కేంద్రంలోనూ, మరో ప్రదర్శనను రాష్ట్ర ప్రాంతీయ గ్రంథాలయంలోనూ నిర్వహించారు. గ్రంథాలయంలో జరిగిన ప్రదర్శనకు నాగార్జునసాగర్ సూపరింటెండింగ్ ఇంజనీరు శ్రీ పి. వి. రావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

గిరిజన గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా

శ్రీకాకుళం జిల్లా గిరిజన సంక్షేమ కార్యక్రమం క్రింద శేవిడి, గుమ్మం గిరిజనగ్రామాలలో గృహోపయోగార్థం విద్యుచ్ఛక్తి సరఫరా చేయడం జరిగింది. శేవిడి గ్రామంలో డి ఆర్. ఓ. శ్రీ టి. నాగరత్నం; పార్వతీపురం, గుమ్మం గ్రామలలో సబ్ కలక్టరు శ్రీ కె. కోసల్‌రాం విద్యుచ్ఛక్తి సరఫరాకు ప్రారంభోత్సవం చేశారు. పాలకొండ, పార్వతీపురం ఏజన్సీలలోని గిరిజనులకు ఎద్దులు కొనుక్కొనడానికి ఒక్కొక్కరికీ రూ. 300 చొప్పున మొత్తం రూ. 90,000లు అప్పుగా ఇవ్వడం జరిగిందని, స్పెషల్ డిప్యూటీ కలక్టరు తెలిపారు. బీద గిరిజన రైతులకు రూ. 250 లక్షలు విలువచేసే విత్తనాలు సరఫరా చేయబడినాయి.

బాలాజి పేటలోని గ్రాన్సు సహాయ కేంద్రానికి చెందిన శ్రీమతి యల్. స్టివెనార్డుమంద గోటివాడ, తాడికొండ, పెద కరాజ రేగడి గ్రామాలలోని గిరిజన రైతులకు రూ. 20.000 లు ఖరీదు చేసే చెరకు విత్తనాలు విరాళంగా ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో బావుల త్రవ్వడానికి భద్రగిరి గిరిజన కార్మిక సహకార సంఘానికి ఆమె ఒక పవర్ డ్రిల్లును కూడా విరాళంగా ఇచ్చారు. దీనిసహాయంతో ఇంతవరకు రెండు బావులు త్రివ్వించబడినాయి.

గిరిజన బాలురకు ట్రాక్టరు నడపటంలో శిక్షణ గరపడానికి అగ్రో_ఇండస్ట్రీస్ కార్పొరేషను డి. టి._14 ట్రాక్టరును సరఫరా చేసిందని తెలిపారు.

కడపలో కుటుంబ నియంత్రణ మహాసభకు ప్రారంభోత్సవం

కడప జిల్లా కలెక్టరు శ్రీ ఎస్ వి గిరి జిల్లా స్థాయిలో జరిగిన కుటుంబనియంత్రణ ప్రథమ మహాసభకు ప్రారంభోత్సవం చేశారు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంటు డా. నరసింహారావు ఈ సభకు అధ్యక్షత వహించారు.

జిల్లా కలెక్టరు శ్రీ గిరి, తమ ప్రారంభోత్సవంలో కడప జిల్లాలో కుటుంబ నియంత్రణ కార్యక్రమ ప్రగతిని గురించి ప్రస్తావిస్తూ ఈ జిల్లా 1969_70 సంవత్సరానికి నిర్ణయించుకొన్న లక్ష్యంలో 70 శాతం కార్యక్రమాన్ని పూర్తి చేసినప్పటికీ సాధించిన కార్యక్రమం పట్ల సంతృప్తి కలగడానికి ఆస్కారం వుండకూడదని చెప్పారు.

డా. నరసింహారావు మాట్లాడుతూ, గత ఐదేండ్లలో కుటుంబనియంత్రణ కార్యక్రమం ఫలితంగా ఈ జిల్లాలో జననాలరేటు 0.5 వరకు మాత్రమే తగ్గిందనీ, ప్రగతి ఇదేవిధంగా వున్నట్లయితే ఈజిల్లాలో మూడవ ప్రణాళిక అంతంనాటికి జననాల రేటును వెయ్యిమందికి 41 వరకూ 1974 అంతంనాటికి ఈ రేటును 25కూ తగ్గించడం సాధ్యంకాదని చెప్పారు. కుటుంబనియంత్రణ సందేశాన్ని పల్లెల్లో, పట్టణాలలో ఇంటింటికి అందజేయాలని ఆయన వైద్యశాఖాధికారులను కోరారు.

సర్పంచ్‌గా ప్యూన్ ఎన్నిక

ప్రభుత్వకార్యాలయంలో ఇటీవలివరకు ప్యూనుగా పనిచేసిన శ్రీ పోలీసు గండయ్య మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పంచాయతీ సమితిలోని కోడూరు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

గ్రామానికి వీధి లైట్లు

ఇటీవల చిత్తూరు జిల్లా మదనపల్లి పంచాయతీ సమితిలో అసిస్టెంటు కలెక్టరు శ్రీ యన్. కె. పచౌరి వీధి లైట్లకు ప్రారంభోత్సవం చేస్తూ, రైతులు ఆహారోత్పత్తిని అధికం చేయడానికి గ్రామీణ విద్యుచ్ఛక్తి సరఫరాను విరివిగా ఉపయోగించాలని ఉద్బోధించారు.

అంతకు ముందు బీరంగి పంచాయతీ సర్పంచ్ శ్రీ శ్రీనివాసాచారి ప్రముఖులకు స్వాగతం చెప్పారు. వ్యవసాయ విస్తరణ అధికారి, ఇంజనీరింగు సూపర్‌వైజరు కూడా ఈ సందర్భంలో ఏర్పాటైన సభలో ప్రసంగించారు.

శ్రీ కె. బయ్యారెడ్డి రైతుల తరపున మాట్లాడుతూ ఈ ప్రాంతంలో చెరువులు, ఇళ్ళను మరమ్మతు చేయాలని కోరారు.

శ్రీ కె. నాగభూషణం వందన సమర్పణ చేశారు.



కోకా-కోలా సాంగత్యం బ్రతుకే ఒక సారస్యం


ముచ్చటలాడే వేళే ముచ్చటైన వేళ! అట్టి వేళల కోకా-కోలా కలిస్తుంది కమ్మని వేడుక! ఉల్లాసం ఉత్తేజం కలిగించే సజీవమైన రుచి కోకా-కోలా రుచి. అందుకనే, త్రాగాలనిపిస్తుంది మళ్లీ మళ్లీ. త్రాగండి కోకా-కోలా-మళ్లీ కోకా-కోలా-మళ్లీ మళ్లీ కోకా-కోలా! ప్రపంచంలో నలుమూలలా, పెరిగిపోతోంది కోకా-కోలా త్రాగేవారి సంఖ్య రోజు రోజుకూ. కారణం: సేదదీర్చటంలో, కనివిని ఎరుగని కమ్మదనం, కోకా-కోలా కమ్మదనం!

Enjoy Coca-Cola

కోకా-కోలా, కోకా-కోలా కంపెనీవారి రిజిస్టరు చేయబడిన ట్రేడ్‌మార్కు.

CHCC-15-203 TEL

PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION AND PUBLIC RELATIONS, ANDHRA PRADESH, HYDERABAD.
PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVERNMENT OF ANDHRA PRADESH, AT THE GOVERNMENT CENTRAL PRESS- HYDERABAD-24




RAVINDRA BHARATHI